http://sripadasrivallabha.webs.com



# శ్రీ గురుమూర్తి

## నృశింహ సరస్వతి చరితము

కోటంరాజు శ్రీనివాసరావు



శ్రీరామరామరామ



# శ్రీ గురుమూర్తి నృశింహ సరస్వతి చరితము

అధ్యాయము - 1

**(గంధర్వనగరము - వివరణ)**

గంధర్వ నగరమునకు మరొక పేరు గాణ్గాపూర్. ఇది మహారాష్ట్రలోని గుల్బర్గా అనే ఊరు దగ్గరలో ఉన్నది. ఇది మహాపుణ్యక్షేత్రము. శ్రీ దత్తాత్రేయుని ద్వితీయ అవతారమైన శ్రీ నృసింహసరస్వతి స్వామివారు (శ్రీగురుమూర్తి) తమ దివ్యపాదములను మోపి తమ మహిమచే పుణ్యభూమిగా మార్చి ఎందరో భక్తులను పునీతులను చేసినారు. ఈ గాణ్గాపురము నందు సంగమము కలదు. భీమ మరియు అమరజ నదులు కలిసిన సంగమము. ఈ సంగమము శ్రీ గురుమూర్తి అయిన శ్రీనృసింహసరస్వతి స్వామివారి దేవాలయమునకు దగ్గరలో వున్నది. ఆ నదిలో ఎందరో భక్తులు వచ్చి స్నానము చేయుటచే వారి పాపకర్మల నుండి విముక్తులై పుణ్యులగుచున్నారు. ఈ నదీసంగమము పొడవున అష్టతీర్థాలు కలవు. అవి

1. మనోరథ తీర్థం2. మహాతీర్థం 3.కాశీతీర్థం 4. పాపవినాశన తీర్థం 5. కోటితీర్థం 6. రుద్రపాదతీర్థం 7. చక్రతీర్థం 8. మన్మధ తీర్థం.

ఈ అష్టతీర్థముల ఒడ్డున సంగమేశ్వరాలయము మరియు ఔదుంబర వృక్షములున్నవి. భక్తులు అష్టతీర్థాల స్నానం చేసి శ్రీ దత్తుని ఆలయమున దత్తభగవానుని దర్శించుకుంటారు. అక్కడ శ్రీ దత్తుడు చిత్రరూపముతో కనిపిస్తారు. దేవాలయ ప్రవేశ ద్వారానికి సరిగ్గా ఎదురుగా ఉన్న గోడ మధ్యన చిన్న గవాక్షము గుండా లోనున్న త్రిమూర్తిస్వరూపుడైన ఆ దత్త భగవానుని దర్శనము లభిస్తుంది. శ్రీ దత్తుని గర్భాలయము కుడి ప్రక్కగా (ప్రవేశద్వారానికి) శ్రీ నృసింహసరస్వతి వారి నిర్గుణ పాదుకలు కలవు. అవి అనునిత్యం భక్తులచే పూజింపబడును. ఈ ఆలయమున ప్రతిరోజు రాత్రిపూట శ్రీవారి పల్లకీసేవ జరుపబడును. ఈ గంధర్వనగరమున కళ్ళేశ్వరస్వామి (శివుడు) వారి ఆలయము కూడా కలదు. మరియు శ్రీనృసింహసరస్వతి ప్రతిష్ఠించిన చింతామణి గణపతి కూడాకలదు.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే



## అధ్యాయము - 2

## (గంధర్వనగరము - మహత్యం)

1వ అధ్యాయమున భీమ అమరజ నదుల సంగమము కలదని తెలుసుకుంటిమి. ఆ సంగమ మహిమ అపారమని కూడా తెలుసుకున్నాము. మరి ఆ సంగమ మహిమ ఏమిటి? పూర్వము దేవదానవులకు ఘోరయుద్ధము జరిగినది. ఆ యుద్ధమున దానవుల చేతిలో దేవతలు బాగా దెబ్బతినిరి. దేవతల రాజు అయిన ఇంద్రుడు దానికి భయపడి శివుడిని శరణుతో ఆశ్రయించి జరిగిన వృత్తాంతమును చెప్పి ఆ యుద్ధములో ఎక్కడైతే దానవులు దెబ్బతగిలి రక్తబిందువులను భూమిపై రాల్చినారో ఆ భూమిపై పడిన బిందువుల సంఖ్యగా దానవులు తిరిగి జన్మించుచున్నారని శివునికి చెప్పగా, ఆ పరమేశ్వరుడు ఒక అమృతఘటమును ఇచ్చి మరణించిన దేవతలపై అమృతమును చల్లమని ఆజ్ఞాపించెను. ఇంద్రుడు శివాజ్ఞను పాటించి దేవతలను బ్రతికించెను. సర్వేశ్వరుడు మిగిలిన అమృతముతో ఉన్న ఘటమును తీసుకొనుచున్న సందర్భమున ఆ కుంభము నుండి అమృతము జారి భూమిపై పడెను. అదే మహాప్రవాహమై సంజీవినిగా మారి అమరజానదిగా ప్రసిద్ధి అయ్యెను. ఈ అమరజానది భీమానది అను నదితో సంగమముచెందుటచే ప్రయాగగా మారి ఒక గొప్పపుణ్యస్థలమయ్యెను. ఇట్టి పుణ్యనదిలో స్నానము చేసినవారికి ఏ రోగములు రాక చిరంజీవియై వర్ధిల్లెదరు. మరియు వారికున్న బ్రహ్మహత్యాదిపాపములు కూడా ఆ స్నానమహిమచే పటాపంచలగును. ఈ సంగమమున కెదుట ఒక అశ్వత్థవృక్షము కలదు. అది కోరికలను తీర్చు కల్పవృక్షము. మరికొంత దూరమున శివాలయము మరియు 'నాగేష'మను గ్రామము కలదు. అది సాక్షాత్తు వారణాశితో సమానము. ఆ గ్రామమున ఒక కుటుంబీకులకు సాక్షాత్తు శివుడు ప్రత్యక్షమై జ్ఞానకుండము మరియు మణికర్ణిక, కాశి అచటనే కలవని ఋజువుచేసెను. అశ్వత్థవక్ష సన్నిధియందు మనోరథతీర్థము కలదు. అది సాక్షాత్తు శ్రీగురుమూర్తి వచనము వంటిది. అక్కడ శ్రీగురుమూర్తి నిత్యము గుప్తరూపమున ఇప్పటికి కలరు. నాగేషమను గ్రామమునకు దగ్గరలో మహాతీర్థము కలదు. అది వారణాశితో సమానము. భీమ అమరజానదుల సంగమమందు కాశీతీర్థమేర్పడెను. 'పాపవినాశన'మనెడి మరియొక తీర్థము అచ్చటకలదు. అందు స్నానము చేసినవారికి సప్తజన్మల పాపములు నశించును. కోటి తీర్థమనే మరియొక తీర్థము కలదు. జంబూద్వీపమందు ఉన్న సకల తీర్థములు అందు కలియును. రుద్రపాదమనెడి మరియొక తీర్థము కలదు. ఇది గయతో సమానము. దీనిపైన చక్రతీర్థము కలదు. ఇచ్చట కలిసిన అస్థికలు ఏవైతే ఉన్నవో అవి ద్వారకకు నాలుగు రెట్లు అధికపుణ్యము లబ్ధి పొందియున్నవి. మన్మథ తీర్థమని కళ్ళేశ్వరునితో కూడి యున్నది. ఇది అష్టైశ్వర్యములను ప్రసాదించును.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 3

### (శ్రీ గురుమూర్తి గుప్తరూపమున గాణ్గాపురమున ఈనాటికి కలరు)

కలడందురు దీనుల యెడ

గలడందురు పరమయోగి గణముల పాలం

గల దందు రన్ని దిశలను

గలడు గలండనెడు వాడు గలడో లేడో (భాగవతము)

పై శ్లోకము గజేంద్రమోక్షము లోనిది. "దీనులైనవారికి భగవంతుడు రక్షగా ఉన్నాడని, పరమయోగి గణముల పక్షమున భగవంతుడు కలడని మరియు సర్వదిక్కుల ఆ పరమాత్మ ఉండునని అందురు. కాని ఉన్నాడు అని అనుటలో దేవుడు అసలు ఉన్నాడో లేడో?" ఇటువంటి సంశయములతో గజేంద్రుడు కలిగియుండి తనకాలు మొసలి నోటిలో చిక్కుకున్నప్పటికి అహమును విడువక పోవుటచే మరియు సంశయబుద్ధి ఉండుటచే శ్రీ హరి గజేంద్రుని రక్షించుటకు రాలేదు. ఇట్లు కొన్ని రోజులు ఘోరపోరాటం జరిగిన పిదప గజేంద్రుని ప్రాణమునకు హాని కలిగే స్థితిలో, తన శరీరము అలసిపోయి, శక్తి సన్నగిల్లుటచే అహంవీడి ఆ గజేంద్రుడు నీవు తప్ప మరియొక దిక్కులేదని, నా అపరాధమును మన్నించమని "నీవు తప్ప నితఃపరం బెఱుగ మన్నింపదగున్ దీనునిన్'... అని మనసా వాచా భగవంతుని వేడుకొనగా శ్రీహరి గజేంద్రుని రక్షిచుటకు పరగుపరుగున వచ్చెను.

నృసింహసరస్వతి (ఇక నుండి శ్రీగురుమూర్తి అని సంభోదించబడును). గంధర్వనగరమున అనగా గాణ్గాపూరమున గుప్తస్వరూపముగా ఈనాటికి కూడా కలరు. దీనికి సాక్ష్యం శ్రీ గురుమూర్తి స్వయముగా వారు సజీవముగా ఉన్నప్పుడు తమ భక్తులతో ఇట్లనినారు. "ఈ గాణ్గాపురమున గుప్తస్వరూపమున నేను సదా ఉండెదను. భక్తులు ఇచ్చటనే నన్ను సాక్షాత్కరించుకొనవచ్చును. ఈ గాణ్గాపురము నాకు మిక్కిలి ఇష్టమైనది. నన్ను కోరి వచ్చినవారికి నా గీతములను గానరూపమున భజించు భక్తులకు, నా నిర్గుణపాదుకలను ఆశ్రయించువారికి నేను తప్పక సాక్షాత్కరించెదను. సద్భక్తులకు మాత్రమే ఇట్టి అవకాశము లభించును. ఇచ్చటి సంగమమందే నా యొక్క నిత్యకృత్యములు జరుగును. మధ్యాహ్నం పూట నేను మఠమునందు గుప్తుడనై ఉండెదను. ఉషఃకాలమున కృష్ణానది యందు స్నానము చేసి కల్పతరు సమీపమున కర్మలనాచరించ తిరగి మధ్యాహ్నమున భీమానదికి నేను చేరుట నా నిజమైన భక్తులు నన్ను గమనింపగలరు. శంకరుని అర్చనను నేనే స్వీకరించెదను. నన్ను నమ్మి మనస్ఫూర్తితో ఇక్కడకు వచ్చిన భక్తుల యొక్క యోగక్షేమములను నేనే

చూచెదను. ఇచ్చట గల అశ్వత్థ వృక్షము నందు నేను ఉండెదను. సత్పురుషులకు నా దర్శనము తప్పక లభించును" అని శ్రీగురుమూర్తి పలికెను.

ఎవరైతే సర్వశ్యశరణాగతితో ప్రేమతో అహమును విడిచి గాణ్గాపురమునకు వెళ్ళినచో శ్రీ గురుమూర్తి యొక్క దర్శనము తప్పక లభించును. అట్టి దృఢమైన నమ్మకము మరియు విశ్వాసము అనేవి కలిగియున్న వారికి గురుదర్శనము లభ్యమగును. గజేంద్రమోక్షమున గజేంద్రునికి కలిగినటువంటి దేవుడు ఉన్నాడో లేడో అనే సంశయము మనము వీడవలెను. పరమాత్మ మానవజన్మకు జ్ఞానము ప్రసాదించెను. అట్టి జ్ఞానము మరే ఇతర పశుపక్ష్యాదుల వంటివానికి లేదు. కావున మనకిచ్చిన ఆ జ్ఞానము సద్వినియోగము చేసుకొనినచో దైవసాక్షాత్కారము లభించును.మన నిత్య జీవితములో ఎన్నో సమస్యలతో, బాధలతో అనారోగ్యముతో కొట్టుమిట్టాడే మనకు అవన్నీ ఒక మొసలి పట్టులాంటివి. మన సంసారము ఇట్టి భయభ్రాంతుల వలన బలహీనమై అధైర్యముతో గజేంద్రుని పాదము వంటి మన సంసారము మొసలి నోటిలో అనగా సమస్యలు, బాధలు, అనారోగ్యచిక్కులో చిక్కుకున్నవి. అట్టి చిక్కుముడి విడవాలంటే గాణ్గాపురంనకు వెళ్ళి శ్రీ గురుమూర్తిని ఆర్తితో పిలిచి ఓ గురుమూర్తీ ! నా ధైర్యము సన్నగిల్లినది. నా ప్రాణముల గూడు తప్పినది. నా శరీరము అలసిపోవుటచే నీవే తప్ప మాకు దిక్కులేదని ఆర్తితో వేడుకొనినచో గుప్త స్వరూపమున ఉన్న శ్రీ గురుమూర్తి తప్పక కనిపించెదరు. ఒక్క బాధలు ఉన్నవారికే కాక ఏ కోరికా లేని నిజభక్తులను కూడా శ్రీ గురుమూర్తి తమ దర్శనం ఇచ్చెదరు. ఏ జ్ఞానము లేని గజేంద్రునికే ఆ శ్రీహరి వచ్చి రక్షించగా జ్ఞానమున్న ఈ మానవజన్మకు దైవము వచ్చి రక్షించెదనుటలో సందేహము లేదు.

కావున మనము మారుదాం. ప్రేమతో, భక్తితో, ఆర్తితో, నిస్వార్థముతో ఉండే జీవితానిఒకి అలవాటు చేసుకుందాం. అది అలవాటైతే ఆ ఈశ్వరుని దర్శనము తప్పక అవుతుంది.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 4

### (శ్రీగురుమూర్తి జననము మరియు అంతర్ధానము)

విశ్వకరు, విశ్వదూరుని
విశ్వాత్మకు, విశ్వవేద్యు, విశ్వ, నవిశ్వున్
శాశ్వతు, నజు, బ్రహ్మప్రభు,
నీశ్వరునిం బరమ పురుషునే భజియింతున్

-(శ్రీమద్భాగవతం)

పై శ్లోకమునకు అర్థం కనిపించే జగత్తును తాను సృష్టించి తానే ఆ జగత్తు యొక్క స్వరూపముగా ఉండి యావత్ జగత్తునందు ఆత్మప్రజ్ఞగా ఉండి అయినను ఆ సృష్టికి అతీతంగా ఉన్నవాడు కావున ఈ విశ్వమంతటిని అతడు ఎరుంగును. ఈ విశ్వముగా ఉన్నాడు మరియు విశ్వముగా లేని వాడు కూడా అతడై సృష్టి లీనమైనప్పుడు ఆ లీనమగుటగా అతడు ఉన్నాడు కావున అతడు వేరుగా పుట్టుటలేని శాశ్వతమైనవాడు అతడే పరమాత్మ.

శ్రీగురుమూర్తి సాక్షాత్తు ఆ పరమాత్మ దత్తాత్రేయుడు. త్రిమూర్తి సృష్టిస్థితి లయకారుడు. జగద్గురువు. అట్టి పరమాత్మకు జననం అనునది ఒక చిత్రమే. అటువంటి మహాపురుషులకు జనన మరణాలుండవు. వారు లోకకళ్యాణమునకై అవతారము దాల్చి వారి కార్యము ముగిసిన పిదప అంతర్థానమయ్యెదరు. కావున శ్రీ గురుమూర్తి జన్మించుట అనునది లేదు. త్రిగుణములతో కూడుకుని ఉన్న మానవులకు మాయ ఆ త్రిగుణములచే కప్పబడియుండుటచే అటువంటి మహాపురుషులను ఒక సామాన్య మానవునిగా తలంచి మరియు వారి జననమునకు సంతసించి అటువంటి మహాపురుషుల నిర్యాణమునకు దుఃఖించెదరు. శ్రీ గురుమూర్తి జననము సామాన్య మానవుని వలె కనిపించినప్పటికి దానికి గల కారణము ముఖ్యమైన రెండు సంఘటనలు కలవు. దత్తాత్రేయుని ప్రథమావతారమైన శ్రీపాదశ్రీవల్లభుడు తన అవతారములో ఇద్దరి భక్తులకు వరము లొసగెను. ఆ వరము తీర్చుటకై శ్రీ దత్తుడు మరల తన ద్వితీయ అవతారమును దాల్చవలసి వచ్చెను. ఆ అవతారమే శ్రీ గురుమూర్తియైన నృసింహ సరస్వతి. కావుననే శ్రీ గురుమూర్తి సామాన్యమానవుని వలె తన జననము చూపించెను. కాని వారు సామాన్యుని వలె మరణించుట జరుగలేదు. వారు శ్రీశైలమునకు పోయి శ్రీ పర్వతమున గల పాతాళగంగలో స్నానము చేసి ఉత్తరాయణం మాఘమాస కృష్ణపక్షమందు పాడ్యమినాడు పుష్యమినక్షత్రమున మరియు బహుదాన్య సం॥లో నదీ ప్రవాహము మధ్యన అంతర్ధాన మయ్యెను. దీనిని బట్టి అసలు వారు జన్మిస్తే గదా మరణించుట అనునది ఉండును. వారి అవతారమును చాలించి అంతర్ధానమయ్యెను.

వారి జననమునకు గల ముఖ్యమైన రెండు సంఘటనలు ఏమిటో వచ్చే అధ్యాయములో గమనించెదము.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 5

**(శ్రీగురుమూర్తి పూర్వావతారములు భక్తులకు అభయమిచ్చుట)**

మహావిష్ణువు నాభినుండి బ్రహ్మదేవుడు వెలువడి లోకములను సృష్టించెను. మహావిష్ణువు ఆజ్ఞనుపాలించుటకై బ్రహ్మ తన తపస్సుచే సృష్టిని పెంపొందించుటకు నలుగురు పుత్రులను సృష్టించిరి. వారే సనకాదులు అయిరి. మరియు బ్రహ్మదేవుడు సప్తఋషులైన మరీచి, అత్రి, అంగీరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్టుడు అను సప్తఋషులను కూడా సృష్టించెను. సప్తఋషులలో ఒకరైన అత్రికి అనసూయ ధర్మపత్నిగా అయ్యెను. ఆమె మహా పతివ్రత. ఆమె పాతివ్రత్యము పరీక్షించుటకై సాక్షాత్తు త్రిమూర్తులే అతిథి రూపముగా వచ్చి భోజనము తమకు దిగంబరముగా వడ్డించమని ఆ పతివ్రతను కోరగా అనసూయ తమ భర్త పాదములను ధ్యానించగా ఆ త్రిమూర్తులు బాలురుగా మారిపోయిరి. త్రిమూర్తులు ప్రసన్నులై తిరగి స్వస్వరూపములతో ప్రత్యక్షమై అనసూయ పాతివ్రత్యమునకు మెచ్చి వరము కోరుకోమనగా అనసూయ ఆ త్రిమూర్తులు అంశతో బాలురని ప్రసాదించమని కోరెను. త్రిమూర్తులు తథాస్తు అని పలికి అదృశ్యులైరి. త్రిమూర్తుల ఆశీసులతో అత్రి, అనసూయలకు శ్రీదత్తుడు, చంద్రుడు మరియు దుర్వాసుడు అను కుమారులు జన్మించిరి.

శ్రీ దత్తుని అవతారము మరియొకటి కలదు. పితాపురమున కులీనుడు మరియు సుమతి అనే బ్రాహ్మణదంపతులు కలరు. ఒకసారి శ్రీ దత్తుడు అతిథిరూపమున ఆ దంపతుల ఇంటికి వచ్చెను. ఆనాడు వారి యింట శ్రాద్ధకర్మ జరుగుచుండెను. బ్రాహ్మణుల భోజనము కాకమునుపే శ్రీదత్తుడు భిక్షకోరెను. అంత సుమతి అతిథిగా వచ్చిన శ్రీదత్తుని కోరిక నెరవేర్చెను. శ్రీదత్తుడు ప్రసన్నుడై తన నిజరూపమును చూపి వరము కోరుకోమనగా, సుమతి తనకు పెక్కు కుమారులు జన్మించినప్పటికి కేవలం అందు ఇద్దరు మాత్రమే జీవించియున్నారని, వారు కూడా అంగవిహీనులై బ్రతుకుతున్నారని కావున ఒక యోగ్యుడైన పుత్రుని ప్రసాదించమని ఆ పుత్రుడు శ్రీ దత్తుడు వంటివాడై ఉండవలెనని కోరగా శ్రీదత్తుడు అనుగ్రహించెను. స్వల్పకాలములోనే ఆ దంపతులకు ఒక పుత్రుడు జన్మించెను. ఆ పుత్రుని పాదములయందు శ్రీ చిహ్నములుండుట వలన "శ్రీపాదుడ"ని పేరు పెట్టెను. ఆ బాలుడు సామాన్యబాలుని వలె కాక విద్యలో బుద్ధిలో గుణములలో అన్నింటిలోను ప్రశంసనీయుడై యుండెను. అతనిని చూచి సాక్షాత్తు పరమాత్మయేనని జనులు పలికెడివారు. శ్రీపాదుడు వివాహము చేసికొనక తనకు వైరాగ్యమే తన భార్యయని వేరొక స్త్రీతో సంబంధము లేదని చెప్పెడివారు. శ్రీపాదుడు తల్లితండ్రుల కోరిక మేరకు తన అన్నలైన కుంటివానిని మరియొక గుడ్డివానిని ఆశీర్వదించి వారికిరువురికి తన దివ్యదృష్టితో మామూలు స్థితికి తెచ్చెను. తరువాత తన తల్లిదండ్రుల అనుమతి తీసుకుని

శ్రీపాదుడు అదృశ్యుడై కాశీ చేరెను.

ఎట్టి తపంబు సేయబడె, నెట్టి చరిత్రము లబ్ధమయ్యెనో,

ఎట్టి ధనంబు లర్థులకు నీబడెనో తొలుబామునందు,నా

యట్టి వివేకహీనునకు నారదమునీంద్రులు యోగదృష్టులన్

బట్టంగలేని యీశ్వరుని బ్రహ్మమయున్ హరిజూడ గల్గెడిన్

(శ్రీమద్భాగవతం)

అర్ధం ॥ ఎట్టి తపస్సును పూర్వజన్మలో చేసితినో, ఎంతటి గొప్ప సంస్కారములతో జీవించి దాన ధర్మములు చేయుటవలన ఇంతటి అదృష్టము ఎదురై పరమాత్మ అయిన శ్రీహరి దర్శనభాగ్యము నావంటి వివేకహీనునికి కలిగెను కదా! (అక్రూరుడు కంసుని ఆజ్ఞచే శ్రీకృష్ణుని తీసుకొని రావుటకు బృందావనము చేరి కృష్ణభగవానుని దర్శనభాగ్యము కలిగినప్పుడు అన్న మాటలివి.)

అట్లే నేను ఎంత పుణ్యము పూర్వజన్మమున ఆర్జించితినో కదా! ఎన్ని తపస్సులు చేస్తే గాని నాలాంటి వివేకహీనునికి అక్రూరుడువంటి వారే నావంటి వివేకహీనుని అనిరి. ఇక నేనెంత వారితో సరితూగను కదా!.శ్రీదత్తుని చరిత్రమును పఠించే అవకాశము వచ్చెనో కదా! ఆహా! శ్రీగురుమూర్తి ఆశీస్సులచే నాకీ భాగ్యము కలిగినది.

శ్రీ గురుమూర్తిరాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 6

**(శ్రీపాదుడు తన భక్తుల కోరికచే శ్రీగురుమూర్తిగా అవతరించుట - మొదటి కారణం)**

శ్రీదత్తుని ప్రధమావతారము శ్రీపాదవల్లభుడని తెలుసుకుంటిమి. శ్రీపాదుడు తన తల్లితండ్రుల అనుమతి తీసుకొని కాశీనగరము చేరెరని కూడా తెలుసుకుంటిమి. వారు పెక్కు పుణ్యక్షేత్రములు గోకర్ణము, శ్రీపర్వతము, కురుపురము మొదలగు ఎన్నో పుణ్యక్షేత్రములు సంచరించి తమ లీలలను ఎన్నో చూపినారు. వారి లీలలన్ని చెప్పుట అసాధ్యమైన పని. శ్రీ దత్తుని ద్వితీయావతారమైన నృసింహసరస్వతి స్వామివారి గురించి ప్రస్తుతము చెప్పుట చేత ప్రధమావతారమైన శ్రీపాదుని గురించి వారి లీలలను గురించి అన్నీ ఇక్కడ ప్రస్తావించుటలేదు. శ్రీగురుమూర్తి అవతారము ఎందుకు వచ్చినదో చెప్పుట కొరకు శ్రీపాదశ్రీవల్లభుని లీలలలో రెండు ముఖ్యాంశములు ఇక్కడ చెప్పబడుచున్నవి.

శ్రీపాదశ్రీవల్లభుడు కురుంగడ్డలో ఉంటూ తమ అవతారమును మరియొకటి చూపినారు. అనగా వారు కురుగడ్డలో గుప్తరూపమున ఉన్నారని అర్ధము. తమ మరియొక అవతారమెత్తుటకు మొదటి కారణము కురుగడ్డలో బ్రాహ్మణదంపతులు కలరు. ఆ బ్రాహ్మణుడు వేదశాస్త్రపరాయణుడు. ఆయన భార్య అంబిక. ఆమెకు పెక్కుపుత్రులు జన్మించినప్పటికి వారందరు మరణించుచుండిరి. ఆమె అనేక పుణ్యక్షేత్రములు దర్శించి చివరకు ఒక పుత్రుని కనెను. కాని అతను మందబుద్ది కలవాడు. ఆ కుర్రవాడి పరిస్థితిని చూచి తన తండ్రి విచారగ్రస్తుడై కొన్నాళ్ళకు మరణించెను. తల్లి అంబిక తన పతి పోయిన దుఃఖము మరియొక వైపు మందబుద్ధిగల కుమారుని దుఃఖము చూచి తట్టుకోలేక తన కుమారునితో కృష్ణాప్రవాహమున ఆత్మహత్య ప్రయత్నము చేసెను. అదే సమయమున శ్రీపాదశ్రీవల్లభుడు ఆ కృష్ణాప్రవాహమున వచ్చి ఆ తల్లి కష్టమును తెలుసుకొని అంబికను ఈశ్వరారాధనము చేయమని అట్లు చేసినచో శ్రీహరి వంటి పుత్రుడు జన్మించునని మరియు అంబిక యొక్క తరువాత జన్మము నందు తాను చేసిన శివారాధన వలన ప్రాజ్ఞుడైన పుత్రుడు జన్మించునని ఆశీర్వదించెను. ఆ క్షణము నుండి శ్రీపాదుని ఆజ్ఞమేరకు శివుడిని పూజించెను. తత్ఫలితముగా ఆమె సుతుడు జ్ఞాని అయ్యెను.

ఎఱుగుదు తెఱవా ! యెప్పుడు
మఱవను సకలంబు నన్ను మఱచిన యెడలన్
మఱతునని యెఱిగి మొ ఱగక
మఱవక మొఱ యిడిరి యేని మఱి యన్యములన్
(శ్రీమద్భాగవతము)

అర్ధం : నన్ను జీవులు మరచినను నేను ఆ జీవులను ఎన్నటికిని మరువను. నేను ఆ జీవులను

మరచిపోయితిననివారు భావించినట్లయితే అటువంటి జీవులు మాయలో చిక్కుకున్నట్లే. అట్టి మాయలో ఉండి బయటపడి ఆ జీవులు నన్ను మరువకుండా నా కోసం మొరపెట్టుకున్నచో నాకు ఆ జీవుల యొక్క క్షేమమే గాని మరే ఇతరము గుర్తుండదు.

శ్రీపాదశ్రీవల్లభుడు అంబికకు మాట యిచ్చినారు. ఆ అంబిక తనకు కల్గిన భర్తశోకము మరియు పుత్రశోకము గూర్చి శ్రీపాదునికి విన్నవించుకొనెను. మొరపెట్టుకొనగా మరియు శ్రీపాదుడే శరణమని శరణువేడగా శ్రీపాదుడు అంబిక తరువాత జన్మలో శివప్రసాదమున ప్రాజ్ఞుడైన పుత్రుడు లభించునని అను నిత్యము శివారాధన చేయమని సెలవిచ్చెను. ఆ క్షణము నుండి అంబిక శంకరుని పూజించుటచే తన సుతుడు జ్ఞాని అయ్యెను. అంబిక శివారాధన అను నిత్యము చేయుటవలన మరియు శ్రీపాదుని ఆశీస్సులు తన తదుపరి జన్మలో ప్రాజ్ఞుడైన పుత్రుడు లభించుననే వరము వలన అంబిక తరువాత జన్మయందు కరంజాలో బ్రాహ్మణుని ఇంటి అంబ అను నామముతో జన్మించి ఆ జన్మలో కూడా పూర్వజన్మసుకృతముచే అను నిత్యము శివారాధన చేస్తూ మాధవుడనే బ్రాహ్మణుని వివాహము చేసుకుని తన 16వ సం॥న శ్రీపాదుడు మళ్ళీ జన్మించెను. అతనే శ్రీ గురుమూర్తి అయిన నృసింహ సరస్వతి. జీవరాసులు అట్టి పరమాత్మను ఏ కారణము చేతనైనను మరిచినను ఆ కరుణామూర్తి పరమాత్మ తనను నమ్ముకున్న భక్తునికి ఇచ్చిన మాట నిలబెట్టుకొనుటకు తిరిగి అవతరించెదరని నిరూపించెను.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే



## అధ్యాయము - 7

### (శ్రీపాదుడు తన భక్తుల కోరికచే శ్రీగురుమూర్తిగా అవతరించుట - రెండవ కారణం)

6వ అధ్యాయమున శ్రీగురుమూర్తి అవతారము వచ్చుటకు గల మొదటి కారణము తెలుసుకుంటిమి. ఇక శ్రీ గురుమూర్తి అవతారమునకు గల రెండవ కారణము తెలుసుకుందాము. శ్రీపాదుడు కురుపురమున ఉన్నరోజులలో స్వామి ప్రతిరోజు కృష్ణానదిలో స్నానము చేయుచు వెళ్తూ ఉండేవారు. అదే నది ఒడ్డున ఒక రజకుడు అను దినము వచ్చి పోవుచున్న శ్రీపాదుని చూచి భక్తితో నమస్కరించుచుండెడివాడు.

స్వామి ఒకరోజు ఆ రజకుడిని ప్రతిదినము తనకు ఎందుకు నమస్కరించుచున్నావని ఆ రజకునిగల కోరిక ఏమని? ప్రశ్నించగా ఆ రజకుడు ఆ స్వామిని సాక్షాత్తు ఈశ్వరునిగా భావించెనని కావున గురుసేవకై అనుమతని కోరగా, శ్రీపాదుడు అనుగ్రహించెను. అప్పటినుండి ఆ రజకుడు శ్రీపాదుని నివాసము నందు ఉంటూ ఆ యింటి ప్రాంగణమును శుభ్రముగా తుడిచి నీళ్ళు చల్లుతూ గురుసేవా పరాయణుడై కాలము గడిపెను. ఒకసారి ఆ రజకుడు నదీ తీరమున ఒక యువరాజు స్త్రీలతో జలక్రీడలాడుతున్న దృశ్యమును చూచి, ముగ్ధుడై, గురుచింతన తప్పెను. ఆ రజకుడు తన పరిస్థితిని ఆ యువరాజు యొక్క వైభవముతో పోల్చుకుని, తన జన్మ వ్యర్థముగా భావించి, ఆ రాజు  ఎంత పుణ్యము చేసికొననచో అట్టి భోగభాగ్యములైన జన్మ లభించెనో అని భావించి ఆ రాజు యొక్క గురువు ఎవరో? అని తలచెను. శ్రీపాదుడు రజకుని మనసులోనున్న వాంఛను గ్రహించి, "పూర్వజన్మ వశము వలన నీవు కష్టములు కలిగియున్నావు. ఈ జన్మలో నీకు రాజ్యభోగముల యందు కోరిక యుండెను. కనుక నీవు త్వరలో ఇంద్రియ తృప్తికై మ్లేచ్ఛజన్మ ఎత్తెదవని" శ్రీపాదుడు చెప్పగా ఆ రజకుడు సంతసించి ఇట్లనెను. "స్వామీ మీ వియోగము ఎప్పటికికి వలదు. ఎల్లప్పుడు మిమ్ములను దర్శించవలెను. కావున రాబోవు జన్మయందు కూడా మీ పునఃదర్శనమును అనుగ్రహింపుమని ప్రార్థింపగా, శ్రీ పాదుడు "నీవు తిరిగి వైడూర్యనగరమున జన్మింతువు. నీ అంత్యకాలమున నా దర్శనము లబించును. నేను శ్రీనృసింహ సరస్వతి అను యతిగా అవతరించెదను. నీవు మ్లేచ్ఛుడవై జన్మింతువు. నీ వాంఛను ఈ జన్మలోనే తీర్చుకుందువా ? లేనియెడల మరుజన్మయందు తీర్చుకొందువా? అని స్వామి ప్రశ్నించగా రజకుడు తన వృద్ధాప్యము వలన శరీరము కృసించినది కావున తన కోరికను మరుజన్మయందేతీర్చుకుందుదునని లేదా యెడల మరుజన్మ యందు తీర్చుకుందువా?" అని స్వామి ప్రశ్నింపగా జనకుడు తన వృద్ధాపము వలన శరీరము కృసించునది కావున తన కోరికను మరజన్మయందే తీర్చుకుందునని స్వామికి చెప్పగా స్వామి అనుగ్రహించును.

దేవా! నీచరణ ప్రసాద కణలబ్ధింగాక లేకున్న నొల

డే వెంటంజను నీ మహామహిమ నూహింపంగ నెవ్వానికిన్

నీ వారై చనువారిలో నొకడనైనిన్ గొల్చు భాగ్యంబు నా

కీవే యిప్పటి జన్మ మందయిన నొండెందైన నో యీశ్వరా!

(శ్రీమద్భాగవతము)

అర్థం : ఓ పరమాత్మా! నీ పాదరేణువులు శిరస్సుపైన భరించగలిగిన పుణ్యాత్ములకే నీ మహిమాన్వితము తెలుసుకొనుటకు సాధ్యమగునే తప్ప యితరులకు అది అసాధ్యం. నీ ఆశ్రితుడనై నీ అనుగ్రహమునకు పాత్రులైన వారి అందరిలో ఒకడిగా ఉండవలెనని నా వాంఛ. అది ఈ జన్మలోనైనా లేదా రాబోవు జన్మలో నైనా అట్టి అనుగ్రహము ప్రసాదింపుము. (సాక్షాత్తు బ్రహ్మదేవుడు శ్రీహరిని ఉద్దేశించి పలికిన పలుకులివి.)

అట్లే రజకుడు, శ్రీపాదుడు తన వాంఛను తీర్చుకొనుటకు ప్రస్తుత జన్మ కావలెనా లేదా మరు జన్మ కావలెనా అని ప్రశ్నించెను. దానికి ఆ రజకుడు “మీ పాదములే నాకు సుఖము నివ్వగలవు. మీ చరణముల వియోగము వలదని నీ దర్శనము కావలెనని పునఃదర్శనమనుగ్రహింపుమని ఈ జన్మలో నేను వృద్ధుడనైతిని కావున మరుసటి జన్మయందు నా వాంఛ తీర్చుమని“ విన్నవించుకొనెను. శ్రీపాదుని ఆశీస్సులచే రజకుడు తరువాత తన ప్రాణములను విడిచి వైడూర్యనగరమున మ్లేచ్ఛకులమునందు జన్మించెను. తన భక్తుని వాంఛను తీర్చుటకై శ్రీపాదుడు శ్రీగురుమూర్తిగా అవతరించవలసివచ్చినది. శ్రీగురుమూర్తి అవతారమునకు ఇదే రెండవ కారణము.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 8

### (శ్రీగురుమూర్తి జననం - కరంజ)

హరిగని చన్నులు గుడిపెడు

తరుణులు ప్రాపించు పదము తలపన్ వశమే

హరి యారగించుటకు బా

ల్గురిసిన ధేనువులు ముక్తి కొసల జరించున్

(శ్రీమద్భాగవతము)

శ్రీమహావిష్ణువు ఎన్నో అవతారములు దాల్చెను. తన అవతారములన్నిటిలోను తనను కని పాలిచ్చిపెంచిన తల్లులు ఎంతటి ఉన్నతమైన స్థితిలో ఉన్నారో మనము చెప్పుటకు వీలుపడదు. తనను పెంచిన ఆ తల్లులే కాక ఆ మహావిష్ణువుకు త్రాగుటకు పాలిచ్చిన ఏయే ఆవులు ఉన్నవో అవి కూడా మోక్షానికి అర్హులైనవి.

పూర్వపు అధ్యాయములో చెప్పేరీతిగా శ్రీపాదులు తన భక్తురాలైన అంబికకు వరము ఇవ్వుటవలన తన మాట నెరువేర్చుటకు అంబికను మరుజన్మలో ఒక బ్రాహ్మణుని యింట అంబ అను పేరుతో, ఆ అంబను మాధవుడు అనే బ్రాహ్మణునితో జత కలిపి ఆ జన్మలో కూడా నిరంతరము పూర్వజన్మలో చేసిన రీతిగా శివపూజ కావించుటచే శ్రీపాదుడు ఆ దంపతులిరువురికి కుమారుడై జన్మించెను. అతనిని నరహరి అనే నామధేయముతో పిలుచుచుండెడివారు. నరహరి పుట్టిన వెంటనే ఓంకారము ఉచ్చరించెను. తనకు ఉపనయనము వరకు కూడా ఒక్క ఓంకారము తప్ప మరే ఇతర మాటలు పలుకలేదు. ఉపనయన సందర్భముగా తన తల్లి మొట్టమొదటి భిక్ష నరహరికి సమర్పించినప్పుడు ఆ నరహరి నోటి వెంట "నీ భిక్షవలన నేను భిక్షుడనై భిక్షాన్నమునే స్వీకరించుచు ధర్మరక్షణ చేయుటకు నేను అవతరించినానమ్మా" అని పలికి అక్కడున్న వారిని ఆశ్చర్యపరచి తన తల్లితో, "అమ్మా! నీకు ఇంకా నలుగురు పుత్రులు జన్మింతురని చెప్పి తన తల్లి పూర్వజన్మవృత్తాంతమంతయు గుర్తుచేసెను. తన వృత్తాంతము విన్న తల్లి సంతసించి శ్రీగురుమూర్తిని సేవింగా శ్రీ గురుమూర్తి ఆ రహస్యమును బయటకు పెట్టవలదని ఆజ్ఞాపించెను. శ్రీగురుమూర్తి బాలకుడుగా ఉన్న రోజులలేనే ఒక లీలను ప్రదర్శించెను. ఒక లోహఖండమును తాకగానే అది స్వర్ణముగా మారిపోవుట తల్లి చూచి ఆశ్చర్యపోయెను. తన పుత్రుడు సామాన్య శిశువు కాదని సాక్షాత్ పరమాత్మయే నని కావుననే పుట్టిన వెంటనే ప్రణవనాదమును పలికెనని గ్రహించెను. ఇట్లు శ్రీ గురుమూర్తి కరంజా అనే ఊరులో జన్మించెను. ఈ కరంజా మహారాష్ట్రలోనిది. పూనాకు దగ్గరగా ఉన్నది. అక్కడ మందిరము వెనుక మెట్లపై భాగమున గదిలో శ్రీగురుమూర్తి జన్మించినారు.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము – 9

**(తల్లిదండ్రుల ఆజ్ఞను కోరుట - శ్రీగురుమూర్తి తన తల్లికి తత్త్వము బోధించుట)**

ఒంటి నిల్చి పురాణ యోగులు యోగమార్గనిరూఢులై
కంటి మందురు గాని నిక్కము కాన రీ భవదాకృతిన్
గంటి భద్రము గంటి మాంసపు గన్నులం గనబోలదే
తొంటిరూపుదాలంగ బెట్టుము తోయజేక్షణ ! మ్రొక్కెదన్

(శ్రీమద్భాగవతము)

అర్థం : దివ్యతేజోమయమైనటువంటి నీవు ప్రదర్శించిన రూపాన్ని నాకున్న కన్నులతో చూచుట అసంభవము కావున ఈ రూపమును తొలగించుకొనుము. సామాన్యమైన శిశువుగా నాకు ప్రదర్శించి అనుగ్రహింపుము. (దేవకీదేవి తన పుత్రుడైన శ్రీకృష్ణపరమాత్మని బాల్యములోగల తేజస్సును, ప్రవర్తనను, లీలలను చూచినప్పుడు పలికిన పలుకులివి).

పై అధ్యాయములో శ్రీపాదుడే అంబ మరియు మాధవుడు అనే దంపతులకు జన్మించెనని వారికి నరహరి అనే నామధేయము చేసిరని జన్మించిన వెంటనే ఓంకారము ఉచ్ఛరించెనని ఒక్క ప్రణవము తప్ప తనకు ఉపనయనము అయ్యే వరకు ఏ ఒక్క మాట మాటలాడక తన ఉపనయనమయిన మరుక్షణమే తల్లితో మాట్లాడెనని తల్లికి తన పూర్వజన్మవృత్తాంతము జ్ఞప్తికి చేసిరని తన స్పర్శచే లోహపు ఖండము స్వర్ణముగా మార్చెనని మరియు తన తల్లిని దీవించెనని తెలుసుకుంటిమి. అంబ దివ్య తేజస్సుతో వెలుగుచున్న తన పుత్రుడైన శ్రీగురుమూర్తిని తన కన్నులతో సందర్శించుట కష్టమైనదిగా భావించెను. తన పుత్రుని లీలలను చూసి అంబ దేవకివలె తనను పై శ్లోకములో తెలిపిన అర్థము ప్రకారము భావించెనేమో!

శ్రీ గురుమూర్తి తన ఉపనయనము రోజున గాయత్రి మంత్రము ఉపదేశము స్వీకరించి తన తల్లి అంబ భిక్షను తెచ్చి శ్రీగురుమూర్తికి ఇచ్చిన వెనువెంటనే శ్రీగురుమూర్తి ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము మొదలగు వేదములు అన్నియు పలికెను. తల్లిదండ్రులతో పాటు అక్కడున్న జనులందరూ ఆశ్చర్యపడిరి. శ్రీగురుమూర్తిని పరమాత్మగా అందరూ భావించిరి. తన తల్లి ఉపనయనమున, భిక్ష ఇచ్చుటచే భిక్షకుడై భిక్షాన్నమునే స్వీకరించుచు తీర్థాటనమునకై అనుమతిని ఇవ్వమని తన తల్లిని కోరెను. తన తల్లి గురుమూర్తిని "నీవు తీర్థాటనము చేసినచో మమ్ము రక్షించువారు ఎవరు?" అని ప్రశ్నింపగా, శ్రీగురుమూర్తి తన తల్లితో "నీకు నలుగురు పుత్రులు జన్మించెదరు. మిమ్ములను చూచుకొనెదరు" అని చెప్పి తన తల్లిని ఓదార్చెను. తన తల్లికి తత్వజ్ఞానము ఈ విధముగా బోధించెను. "అమ్మా !జీవితము భౌతికమైనది. కావున

క్షణికమైనది. దేహమనునది అనిత్యము. నిృతమైనది మాత్రము మృత్యువు. కావున వైభవములు శాశ్వతమైనవని భ్రమించుటయే. క్షణికమైన దేహము బలముగా ఉన్నప్పుడే పుణ్యకార్యములు చేయవలెను. మరణము ఏ క్షణమునైనా రావచ్చును. కావున ధర్మమును ఆచరిస్తూ మంచి పనులు చేయవలెను. ధనము, పుత్రులు, భార్య, బంధువులు, శరీరము, గృహము మొదలగునవి అశాశ్వతమైనవి. వాటి వెంటపడినవారు మూర్ఖులే".

చెలివై చుట్టమవై మనస్థితుడవై చిన్మూర్తివై యాత్మవై
వలనై కోర్కెల పంటవై విభుడవై వర్తిల్లు నిన్నొల్లకే
బలు వెంటంబడి లోకమక్కట! వృదా బద్ధాశమై పోయెడిన్
నిలువన్నేర్చునే హేమరాశిగనియున్ నిర్భాగ్యుడం భశ్శయా !
(శ్రీమద్భాగవతము)

అర్థం : నీవు మానవులకు స్నేహితుడిగా, బంధువుగా వున్నావు. మనసుగా అందులోని భావనగా ఉన్నది నీవే. నేను అనే ప్రజ్ఞగా నీవే ఉన్నావు. మంచి మార్గమును చూపెడివాడవు నీవే. ఇటువంటి నిన్ను సేవింపగ మిగిలిన వాటికై పరిగెత్తుచున్నాము. ఆశ అను త్రాటితో మేమే బంధించుకొని ఉన్నాము.

శ్రీ గురుమూర్తి తన తల్లికి తత్వమును బోధించిన పిదప తన తల్లి సంతసించి తనకు పుత్రులు జన్మించిన పిదప అనుమతిన ఇచ్చెదనని చెప్పగా శ్రీగురుమూర్తి తాను ఒక్క సంవత్సరము మాత్రమే వారితో ఉండెదనని ఈలోగా ఇద్దరు పుత్రులు జన్మించెదరని తక్కిన ఇద్దరు తరువాత జన్మించెదరని తన తల్లిని కోరి ఆశీర్వదించెను. అంబ శ్రీగురుమూర్తి ఆశీస్సులచే కవలలను కనెను. శ్రీగురుమూర్తి తన తల్లి కడ సంవత్సరము మాత్రమే ఉండి తన మాట ప్రకారము తీర్థాటనకు బయలుదేరుటకు సిద్ధమయ్యెను. తన తల్లితండ్రులను ఒప్పించి మరల తమ దర్శనమగునని చెప్పెను. తన తల్లితండ్రులు ఆజ్ఞ ఇవ్వగా శ్రీగురుమూర్తి తీర్థాటనకై బయలుదేరిరి.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 10

### (కాశీయాత్ర - శ్రీగురుమూర్తికి గురువు - శ్రీదత్తుని గురువులు)

శ్రీగురుమూర్తి తన తల్లిదండ్రులకు వారి దర్శనము తిరిగి ఉత్తరోత్తర లభించునని అనుగ్రహించి వారి అనుమతిని తీసుకున్న పిదప శ్రీగురుమూర్తి కాశీక్షేత్రమునకు చేరెను. కాశీ మహాక్షేత్రమున ఎందరో మహానుభావులు, సన్యాసులు, మునులు ఆ సమయమున కలరు. కాశీలో అడుగుపెట్టిన శ్రీగురుమూర్తిని వారు చూచి ఆశ్చర్యపడిరి. వారందరు యోగాభ్యాసమున దిట్టలైనప్పటికి ఆ దివ్యమూర్తి అయిన శ్రీగురుమూర్తిని (శ్రీగురుమూర్తి అనగా నృసింహసరస్వతి) చూచి వారందరు ఆ బ్రహ్మచారి వారి కంటె గొప్పవారని గ్రహించిరి. వారందరిలో కృష్ణసరస్వతి అనే మహానుభావుడు శ్రీగురుమూర్తిని తదేకముగా చూచి తక్కినవారితో శ్రీగురుమూర్తి వయస్సులో వారిందరి కంటే చిన్నవాడైనను అతని తేజస్సుకు ముగ్ధులైరి కావున కృష్ణసరస్వతి వారందరిని శ్రీగురుమూర్తికి నమస్కరించమని చెప్పెను.

ఎన్నడుం బరువేడబోడట యేకలంబట కన్నవా
రన్నదమ్ములు నైన లేరట యన్ని విద్యల మూలగో
ష్ఠినె్నఱింగిన బ్రోడ గుజ్జట చేతులొగ్గి వసింప నీ
చిన్న పాపని ద్రోసి పుచ్చగజిత్త మొల్లదు సత్తమా!
(శ్రీమద్భాగవతము)

అర్థం : వచ్చినవాడు మారువేషధారియై కావచ్చు. అయినను ఈ బాలుడు ఎంత ముచ్చటగా ఉన్నాడు. కన్నవారు గాని, అన్నదమ్ములు గాని ఎవ్వరు లేని ఒంటరి అయినను సర్వవిద్యలసారము తెలిసిన జ్ఞాని (మహావిష్ణువు వామన అవతారం దాల్చి బలి చక్రవర్తి వద్దకు వచ్చినప్పుడు ఆ దివ్యతేజోమయి అయిన బాలుని చూచినప్పుడు బలి చక్రవర్తి తన మనస్సులో అనుకొనిన మాటలివి.)

శ్రీ దత్తుడు బ్రహ్మవిష్ణు మహేశ్వరులు కలిసిన అవతారమూర్తి. వారి జననం శ్రీదత్తునిగా ఎట్లు ఆవిర్భవించినదో మొదటనే తెలుసుకున్నాము. శ్రీదత్తుడు తన భక్తులైన కులీనుడు మరియు సుమతి కోరికపై దత్తుడు మొదటి అవతారమైన శ్రీపాదశ్రీవల్లభునిగా అవతరించెనని తెలుసుకున్నాము. తిరిగి శ్రీ దత్తఅవతారమైన శ్రీపాదశ్రీవల్లభుడు తన భక్తురాలైన అంబిక కోరికపై తిరిగి దత్తుడు తన రెండవ అవతారమైన శ్రీగురుమూర్తి (నృసింహసరస్వతి) అంబ కడుపున కరంజాలో జన్మించినారని తెలుసుకున్నాము. శ్రీగురుమూర్తి కాశీలోని గొప్ప సన్యాసులు కంటపడినప్పుడు కృష్ణసరస్వతి అను మహానుభావుడు తన తదేక దృష్టితో శ్రీగురుమూర్తి యొక్క తేజస్సును చూచి ఆ వచ్చిన మహాపురుషుడు సామాన్యమైన వారు కాదని మారువేషములో వచ్చిన

పరమాత్మ ఏమో అని చూడముచ్చటగా ఉన్నారని తలంచి సర్వవిద్యల సారము ఎరిగిన జ్ఞాని అయి ఉండవలెనని పూర్వము బలిచక్రవర్తి వామనుని చూచినప్పుడు ఏ విధముగా తలిచెనో అదే విధముగా కృష్ణసరస్వతి తలచినారు. కృష్ణసరస్వతి శ్రీగురుమూర్తికి సన్యాసము ఇవ్వవలెనని తలంచి శ్రీగురుమూర్తికి శాస్త్రీయముగా కృష్ణసరస్వతి సన్యాసాశ్రమదీక్ష నొసంగినారు. అయితే శ్రీగురుమూర్తి అనగా శ్రీ దత్తుని అవతారమని అన్నాము కదా మరి అంతటి జగద్గురువుకు వేరొక గురువు (కృష్ణ సరస్వతి) ఎలా ఉండగలరు? సన్యాస దీక్షను వారిచ్చినచో గురుమూర్తి ఎందుకు స్వీకరించిరి? దీనికి జవాబు శ్రీగురుమూర్తి శ్రీదత్తుని అవతారమే కావున దత్తాత్రేయులవారు జగద్గురువు అయినప్పటికి వారు 24 మంది గురవులను స్వీకరించినారు. ఆ 24గురిలో ప్రతి ఒక్కరిలోనూ విలక్షణమైనటువంటి విజ్ఞానతత్త్వాన్ని అవగాహన చేసుకున్నారు. ఆ జగద్గురువు దత్తాత్రేయులవారు ఆ 24 మంది గురువులు 1. భూమి 2. వాయువు 3. ఆకాశము 4. జలము 5. అగ్ని 6. సూర్యుడు 7. చంద్రుడు 8. పిచ్చుక 9. అజగరము 10. సముద్రము 11. మిణుగురు పురుగు 12. తేనెటీగ 13. ఏనుగు 14. తేనెపోగు చేసేవాడు 15. లేడి 16. చేప 17. పింగళ 18. పక్షి 19. పిల్లవాడు 20. కన్య 21. విలుకాడు 22. సర్పము 23. సాలీడు 24. కీటకము.

శ్రీదత్తుని అవతారమైన శ్రీగురుమూర్తి అంతమంది గురువులుగా చివరికి కీటకముతో సహా తనకు గురువుగా అంగీకరించినపుడు కృష్ణసరస్వతి కోరికపై సన్యాసము తీసుకొనుటకు ఎటువంటి అభ్యంతరము చూపలేదు. రామాయణములో శ్రీరామునికి వశిష్టమహర్షి గురువుగా ఉండుట మనందరికి తెలుసు. అదే విధముగా శ్రీకృష్ణపరమాత్మకు సాందీపుడు అనే ముని కూడా గురువుగా ఉన్నారని తెలుసు. అలాగే శ్రీగురుమూర్తి కృష్ణసరస్వతిని గురువుగా తీసుకుని వారినుండి సన్యాసదీక్షను తీసుకున్నారు. అప్పటి నుంచి శ్రీ గురుమూర్తి కాశీక్షేత్రములో వేదములను ఉపదేశిస్తూ ఎందరో శ్రీగురుమూర్తిని ఆరాధిస్తూ కాశీలో వారికి శిష్యులుగా చేరి శ్రీగురుమూర్తితో అనేక తీర్థయాత్రలు చేయుట మొదలెట్టినారు.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 11

### (శ్రీగురుమూర్తి ముఖ్య శిష్యుడు - శ్రీగురుమూర్తి తన జననీ జనకులనుద్ధరించుట - తన చెల్లెలి యొక్క పూర్వదోషము తెలుపుట)

కాశీనుండి శ్రీగురుమూర్తి ప్రయాగ చేరిరి. శ్రీగురుమూర్తికి ముఖ్యమైన ఏడుగురు శిష్యులు కలరు. 1. బాల సరస్వతి 2. కృష్ణసరస్వతి 3. ఉపేంద్రుడు 4. మాధవసరస్వతి 5. సదానందుడు 6. జ్ఞానజ్యోతి సరస్వతి 7. సిద్ధుడు. ఈ సిద్ధుడే 'గురుచరిత్ర' విశదీకరముగా దత్తభక్తుడైన నామధారకునికి చెప్పెను. పై ఏడుగురు శిష్యులలో శ్రీ గురుమూర్తి ప్రయాగలో ఉన్నప్పుడు మాధవునకు దీక్ష ఇచ్చినారు. వీరందరితో శ్రీగురుమూర్తి కరంజా నగరమునకు చేరెను. వారు కరంజా నగరములో ప్రతి గృహమున భిక్షాటన చేస్తూ ఉండేవారు. ఒక్కొక్కసారి వారు అద్భుతమైన లీలలను ప్రదర్శించేవారు. అదేమనగా వారు బహురూపధరులై కరంజా నగరమున అందరి ఇంట ఒకేసారి భిక్ష గైకొనినారు. పూర్వము తన తల్లితండ్రులకు ఇచ్చినమాట ప్రకారము శ్రీగురుమూర్తి వారి జననీ జనకులకు తమ దర్శనము ఇచ్చి శ్రీపాదవల్లభునిరూపము కూడా చూపించి తమ తల్లితండ్రుల పూర్వ వృత్తాంతము కూడా గుర్తింపచేసి వారి కోరికను కూడా నెరవేర్చినారు. శ్రీగురుమూర్తి తన వంశమున 42 తరముల ఉద్ధరించునని వారి వంశమువారు బ్రహ్మలోక ప్రాప్తి కలుగునని వారి సంతతికి మృత్యుభయము ఉండదని వారి తల్లిదండ్రులకు బ్రహ్మపదము లభించునని వారి వంశము అష్టైశ్వర్యములతో తులతూగి అంత్యదశయందు వారి తల్లితండ్రులకు కాశీక్షేత్ర నివాసము లభించునని ఆశీర్వదించిరి. అంత వారి చెల్లెలైన రత్న తనను కూడా తరింపచేయమని కోరగా శ్రీగురుమూర్తి తన చెల్లెలైన రత్న పూర్వజన్మలో ఒక ఆవును కొట్టడము చేత మరియు ఒక దంపతులకు కలహము పెట్టుట చేత ఈ జన్మయందు రాబోవు కాలమున కుష్టువ్యాధితో బాధపడవలెనని మరియు పూర్వజన్మమున దంపతులు నడుమ కలహము పెట్టుటచే ఈ జన్మలో త్వరలో తన భర్త ఆమెను విడిచి పెట్టెదడని, శ్రీగురుమూర్తి ముందు జరుగబోవునది రత్నకు తెలియపరిచెను. అంత శ్రీగురుమూర్తి చెల్లెలైన రత్న ఆయన చరణములపై పడి రక్షింపుమని వేడుకొనెను. అంత శ్రీగురుమూర్తి తన చెల్లెలిని కొంతకాలము ఆగమని తన పాపఫలము అనుభవించవలెనని, తనకు కుష్టువ్యాధి వచ్చిన పిదప శ్రీ గురుమూర్తి దర్శనము లభించునని తన పాపపరిహారమునకు పాపవినాశనమను తీర్థమే నివారణమని ఆ వ్యాధి వచ్చినప్పుడు గంధర్వనగరము చేరి ఆ తీర్థమున మునిగిన పాపములు పోవునని నా దర్శనము అప్పుడు కలుగునని రత్నకు శ్రీగురుమూర్తి బోధించెను.

దేవా ! దేవరయడుగులు

భావంబున నిలిపి కొలుచుపని నా పనిగా

కో వల్లభ ! యేమని యెదు?

నీ వెంటనే వచ్చుచుంటి నిఖిలాధిపతి

(శ్రీ మద్భాగవతము)

అర్థం : దేవా! నీ పాదములను ధ్యానించి సేవించుటయే నా కార్యము. నీ వెనువెంటనే రాక నేను చేయగలుగున దేమున్నది? దీనజనుల ఆర్తనాదములు వినుటలోను వారిని రక్షించి వారి దీవెనలను పొందుటలోను నీకు సాటి మరియెవరు? నీవు దీనుల అధీనములోని వాడవు కావా? (శ్రీమహావిష్ణువుని లక్ష్మీదేవి ప్రశ్నించిన పలుకులివి.)

సాక్షాత్తు శ్రీలక్ష్మీదేవియే శ్రీమహావిష్ణువుని శరణువేడినది. ఇక సామాన్యులు ఎంతటివారు! రత్న తన పూర్వజన్మలో ఒక సామాన్య స్త్రీ. తాను చేసిన రెండు పాపములచే ప్రస్తుతజన్మలో పాపము అనుభవించవలసి వచ్చినది. కారి రత్న ఏ జన్మ సుకృతమో తాను సాక్షాత్తు త్రిమూర్తి అవతారమైనశ్రీగురుమూర్తి యొక్క చెల్లెలుగా జన్మించినది. తన పాపము శ్రీ గురుమూర్తి ద్వారా ఎరిగిన పిమ్మట తన పాప పరిహారమునకు శ్రీగురుమూర్తి యొక్క పాదములను ధ్యానించుట మరియు సేవించుటయే మార్గమని శ్రీగురుమూర్తినే నమ్మి వారి అడుగుజాడలు అనుసరించుటయే మార్గమని తన ఆర్తనాదములను తప్పక శ్రీగురుమూర్తి విని తనకు కలిగిన కుష్టువ్యాధి మరియు భర్త వియోగము నుండి తప్పక రక్షించెదరని ఆశచెంది ధైర్యముతో రాబోవు ఆ రెండు పాపఫలములకై కనిపెట్టుకుని యుండెను.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 12

**(వైద్యనాథ్‌న శ్రీగురుమూర్తి ఒక బ్రాహ్మణునికి కనువిప్పు కలిగించుట -**

**కరవీరమను నగరమున ఒక విప్రుని కుమారుని జ్ఞాని చేయుట)**

శ్రీగురుమూర్తి ఆజ్ఞను శిరసావహించి వారి శిష్యులు తీర్థాటనమునకు వెళ్ళిరి. సిద్ధుడు మటుకు శ్రీగురుసేవకై వైద్యనాథమున శ్రీగురువుతో ఉండిరి. ఒక బ్రాహ్మణుడు శ్రీగురుమూర్తి వద్దకు వచ్చి నమస్కరించి భక్తితో తన విన్నపమును వెల్లడిచేసెను. ఆ బ్రాహ్మణుడు చాలాకాలమునుండి తపస్సు చేసినను తన మనస్సు స్థిరముగా ఉండక సతమతమవుతున్నట్లు శ్రీగురుమూర్తికి వెల్లడి చేసి ఏదైనా ఉపదేశమును ప్రసాదించమని గురుమూర్తిని కోరెను. అంత శ్రీ గురుమూర్తి తపస్సు చేయుటకు ఒక గురువు అవశ్యకము కనుక ఆ బ్రాహ్మణుని గురువు లేకుండా తపస్సు ఎలా సాగెనో అని ప్రశ్నింపగా ఆ బ్రాహ్మణుడు తనకొక గురువు కలడని ఆ గురువ తనకు సేవ చేయమని ఎటువంటి భోదనలు తనకు చెప్పలేదని ఒక్క సేవ మాత్రమే చేయమనుట చేత ఆ బ్రాహ్మణుడు తన గురువుపై కోపించుకొని తన గురువు కోపమునకు కూడా తట్టుకొనలేక గురువుని విడిచి వచ్చెనని బ్రాహ్మణుడు శ్రీగురుమూర్తితో విన్నవించుకొనెను.

ఉర్విన్ మానవులెవ్వరైన గురువాక్యోద్యుక్తులై గానిత
తూర్వారంభము సేయబోల వనుచున్ బోధించు చందబునన్
సర్వజ్ఞత్వముతో జగద్గురువులై సంపూర్ణులై యుండినన్
గుర్వంగీకరణంబు సేయజనిరాగోవిందుడన్ రాముఁడన్
(శ్రీమద్భాగవతము)

అర్థం : సర్వజ్ఞులైన బలరామకృష్ణులు జ్ఞానులైనప్పటికి గురువుని సేవించి విద్యాభ్యాసము చేసిరి. కావున లోకములో ఎంతటివారైనను గురువు యొక్క ఉపదేశము లేనిదే విద్యను అభ్యసించుట అసాధ్యము. ఇది ఋజువుచేయుటకే బలరామకృష్ణులవంటివారే గురువు నెన్నుకొని విద్యాభ్యాసము చేసిరి.

ఆ బ్రాహ్మణుడు మాటలు విన్న శ్రీగురుమూర్తి ఆ బ్రాహ్మణుని కోపగించెను. ఆ బ్రాహ్మణుడు గురుద్రోహము చేసెనని గురువుని వదిలి రావటమే కాక గురువుపై నిందను మోపి, గురుదోషములను పలుకుచున్నాడని గురుద్రోహికి మనస్సు స్థిరమైనప్పటికి కలుగదని జ్ఞానము లభించదని ఎల్లప్పుడు దుఃఖముతోనే మనశ్చంచలముతో సుఖము కలుగక అజ్ఞానిగా ఉండెదరని శ్రీగురుమూర్తి ఆ బ్రాహ్మణునికి ఉపదేశించెను. అంత ఆ బ్రాహ్మణుడు తాను చేసిన తప్పును శ్రీగురుమూర్తి ద్వారా తెలుసుకుని తన తప్పును సరిదిద్దుకొనుటకు గల ఉపాయమును మరియు గురువును ఎట్లు తెలుసుకొనవలెనో, గురుసేవావిధానాన్ని ఆ

బ్రాహ్మణుడు శ్రీగురుమూర్తి పాదములపై పడి సర్వశ్యశరణాగతి వేడి బోధింపమని కోరగా శ్రీగురుమూర్తి ఆ బ్రాహ్మణునికి గురుసేవా విధని క్లుప్తముగా వర్ణించటమే గాక గురువును ఎట్లు తెలుసుకొనవలెనో భోదించెను. గురువు సంతసించినచో అసాధ్యమంటు ఉండదని వేదశాస్త్రాదులు గురువు ద్వారా లభించునని కావున ఆ బ్రాహ్మణుడు వదిలి వచ్చిన గురువు వద్దకు వెళ్ళి ప్రణామము చేసి తన తప్పును మన్నింపుమని వేడుకొనుమని శ్రీగురుమూర్తి బ్రాహ్మణునికి నివారణోపాయమును చెప్పగా అంత ఆ బ్రాహ్మణుడు శ్రీగురుమూర్తి పాదములపై పడి పశ్చాత్తాపము చెంది తనకు వైరాగ్యము కల్గినదని శ్రీగురుమూర్తినే సకల దేవతలగను గురువులుగను తలంచి ఆ ద్విజుడు శరణుకోరగా శ్రీ గురుమూర్తి ఆశీస్సులచే ఆ బ్రాహ్మణుడు సకల వేదశాస్త్రాలలో ప్రావీణ్యము సంపాదించి జ్ఞానిగా మారెను.

బలరామకృష్ణులవంటి వారే గురువును ఎన్నుకుని విద్యాభ్యాసము చేసిరని దీనినిబట్టి ఎంతటి మహనీయులకైనను గురూపదేశము లేనిదే విద్యనభ్యసించుట సాధ్యము కాదు అన్న విషయమును పై సంఘటన ద్వారా ఋజువైనది.

శ్రీగురుమూర్తి భువనేశ్వరిలో (కృష్ణానది సమీపమున) కొంత కాలముండెను. కరవీరమను నగరమున విప్రుడు ఒకడు కలడు. అతని కుమారుడు మందబుద్ధియై జన్మించెను. ఉపనయనము చేసినప్పటికిని ఆ బాలుడి చేష్టలలో మార్పురాలేదు. తన తండ్రి గొప్ప విద్వాంసుడైనప్పటికి తన కుమారుడి మందబుద్ధిస్థితిని చూసిన ఆ నగరవాసులు హేళన చేసి తన తండ్రి పేరును నాశనము చేయుచున్నాడని కావున తాను జీవించుట కంటె మరణించుటయే మేలని ఆ జనులు హేళన చేసిరి. ఆ మందబుద్ధిగలవాడు జనుల మాటలకు బాధపడి తాను జీవించుట కంటె మరణించుటే మేలని తలచి 'ఖిల్లవాటిక' అను గ్రామమునకు చేరి ఉపవాసదీక్ష ప్రారంభించెను. ఆ గ్రామదేవత 'భువనేశ్వరి' అతని దీక్ష సఫలీకృతము కానందున నిరాశచెంది తన ప్రాణములను నర్పించుకొనుటకు సిద్ధమయ్యెను. అంతట జగన్మాత భువనేశ్వరి అతని స్వప్నమున దర్శనమిచ్చి కృష్ణానది సమీపమున ఔదుంబర వృక్షము క్రింద ఒక యతి తపస్సు చేయుచున్నాడని సాక్షాత్తు అతను శివ అవతారమని అతనిని శరణువేడుమని జగన్మాత ఆ మందబుద్ధివానికి ఉపదేశించెను. ఆ ద్విజుడు స్వప్నాదేశము అనుసరించుటకై కృష్ణానదీ తీరము చేరి ఔదుంబర వృక్షము వద్ద శ్రీగురుమూర్తిని దర్శించి వారి చరణములపై పడి శరణువేడెను. అంత శ్రీ గురుమూర్తి సంతసించి ఆ విప్రుని తలపై శ్రీ గురుమూర్తి తన చేతిని ఉంచి తీసిన వెంటనే ఆ మూఢభక్తిగల విప్రుడు మహాపండితుడిగా మారెను.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 13

### (ఔదుంబర వృక్షము అన్న శ్రీ గురుమూర్తికి ప్రీతి కల్గుటకు కారణం)

శ్రీగురుమూర్తి మూలావతారము శ్రీదత్తుడని తెలుసుకుంటిమి. దత్తుడు త్రిమూర్తి అవతారము అనగా బ్రహ్మవిష్ణుమహేశ్వరుల కలయిక. దత్తునికి ఔదుంబరము అనగా ఎంతో ప్రీతి. దానికి గల కారణము తెలిసికొనుటకు మహావిష్ణువు అవతారమైన నరసింహస్వామి అవతారము గురించి తెలుసుకొనుట ముఖ్యం. బ్రహ్మపుత్రులైన సనకసనందనాదులు ఒకసారి వైకుంఠమునకు వచ్చినప్పుడు అక్కడి ద్వారపాలకులు ఇద్దరు వారిని లోనికి పోనీయక అడ్డగించగా సనకసనందనాదులు ద్వారపాలకుల చర్యకు సహింపక వారిని రాక్షసులై జన్మించెదరని శపించిరి. అంత ద్వారపాలకులు ఆ మునులను కరుణింపమని కోరగా వైరభావమున మహావిష్ణువును స్మరించుటచే తిరిగి మూడు జన్మలలో వైకుంఠమునకు చేరెదరని ఆ మునులు చెప్పిరి. అంత శాపవశాత్తు ద్వారపాలకులు దితికి హిరణ్యకశ్యప మరియు హిరణ్యాక్షులుగా జన్మించిరి. చిన్నవాడైన హరిణ్యాక్షుని శ్రీహరి వరాహరూపమున సంహరించెనని తన తమ్ముని మరణముచే కోపోద్రిక్తుడై హిరణ్యకశిపుడు శ్రీహరితో వైరము పెట్టుకొనెను. హిరణ్యకశిపుడు తనకు ముసలితనము, చావు ఉండరాదని తన కోరిక సిద్ధించుటకై ఘోరతపస్సు చేసెను. ఆ తపస్సుకు మెచ్చి బ్రహ్మవరము కోరుకొనమనగా అంత హిరణ్యకశిపుడు పంచభూతముల యందు కాని, దిక్కుల యందు కాని, రేయింపగలు కాని తనకు మరణము లేకుండా మొసళ్ళు, రాక్షసులు, క్రూరమృగములు, సర్పములు, దేవతలు, నరులు వారితో యుద్ధము సంభవించినప్పటికి మృత్యువు రాకూడదని సమస్త శస్త్రాస్త్రముల వలన మృత్యువు లేనటువంటి వరమును ఆ బ్రహ్మదేవుని కోరగా బ్రహ్మ అనుగ్రహించి వెడలెను. అంత హిరణ్యకశిపుడు తన తమ్ముని సంహరించిన శ్రీహరిని చంపుటకు తన వరప్రభావముతో సిద్ధమయ్యెను. హిరణ్యకశిపునకు ప్రహ్లాదుడు జన్మించెను. తండ్రి శ్రీహరికి శతృవు అయితే కుమారుడైన ప్రహ్లాదుడు మటుకు శ్రీహరికి అనన్యభక్తుడు. చిన్నతనము నుండి ప్రహ్లాదుడు శ్రీహరి నామము తప్ప ఏమీ పలికేవాడు కాదు. హిరణ్యకశిపుడు తన శత్రువైన శ్రీహరిని పూజించే తన పుత్రుడైన ప్రహ్లాదుని అనేక విధములుగా శిక్షించినను ప్రహ్లాదుడు శ్రీహరి భక్తిని విడువలేదు. తండ్రి చివరకు తన కుమారుని చంపుటకు కూడా సిద్ధమయ్యెను. శ్రీహరి ప్రహ్లాదుని ఎప్పటికప్పుడు రక్షించుతూ వచ్చుచుండెను. తన మూఢభక్తిని చూచి హిరణ్యకశిపుడు ఒకసారి శ్రీహరి సర్వవ్యాపి అన్న ప్రహ్లాదుని మాటలకు కోపించి తన ఎదురుగా ఉన్న స్తంభము నందు చూపమని తన గదతో స్తంభమును కొట్టగా, మహావిష్ణువు స్తంభము నుండి నరసింహస్వామి అవతారుడై బయటకు వచ్చెను. నరుడుగాను, సింహముగాను ఉన్న ఆకారము దాల్చి తనచేతి గోళ్ళు జ్వాలలతో ఉగ్రరూపుడై కనిపించి జడలు విదిలించి హిరణ్యకశిపుని ఒడిసి పట్టి తన తొడపై పడేవసి ఆ రాక్షసుని చీల్చి

నరములను త్రెంచి, హిరణ్యకశిపుని ప్రేగులను స్వామి మెడలో హారముగా ధరించెను. హిరణ్యకశిపుని వరమునకు అతీతముగా విష్ణువు అతనిని సంహరించెను. స్వామి రూపము అటు నరుడు ఇటు మృగము గాక సంధ్యాసమయమున తొడపై పెట్టుకొని అనగా సభలోను లేదా బయట గాక ఎటువంటి ఆయుధములు ఉపయోగించక స్వామిగోళ్ళతో చీల్చి సంహరించెను. శ్రీమహావిష్ణువు నరసింహస్వామి అవతారముగా ఔదుంబరస్తంభము నుండి ఉద్భవించెను. హిరణ్యకశిపుని ఉదరము చీల్చుటచే స్వామివారి చేతిగోళ్ళలో విషము ప్రాకెను. దాని కారణముచే స్వామి అనేక రోజులు ఆ విషబాధచే వేదనపడగా మహావిష్ణువు పత్ని అయిన శ్రీమహాలక్ష్మి తన భర్త బాధను శాంతింపచేయుటకు ఔదుంబరఫలములను స్వామి చేతి గ్రోళ్ళకు నొసగెను. ఆ ఫలములవల్ల విషాగ్ని శీతలమై స్వామి శాంతించెను.

శ్రీగురుమూర్తి మహావిష్ణు అవతారమే కావున తనకు నరసింహస్వామి అవతారమున ఔదుంబర వృక్షము తనకు బాధ నివారణము కల్గెనని ఆ విశ్వాసముతో గురుమూర్తికి ఔదుంబరమన్న ప్రీతి. అందువలన శ్రీగురుమూర్తి ఎల్లప్పుడు ఔదుంబర వృక్షము క్రిందనే ధ్యానము చేసుకొనుచుండెడివారు.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 14

**(ఔదుంబర వృక్షమునకు లక్ష్మీనరసింహస్వామి వరముల నొసగుట - 64 మంది యోగినులు శ్రీగురువును పూజించుట)**

పై అధ్యాయమున శ్రీమహావిష్ణు అవతారమైన నరసింహస్వామి తన భక్తుడైన ప్రహ్లాదుని రక్షించుటకు ఔదుంబర స్తంబము నుండి వచ్చి హిరణ్యకశిపుని ఉదరము చీల్చి చంపెనని శ్రీహరి చేతివేళ్ళ గోళ్ళకు విషం సహింపరాని వేదన పెట్టుచుండగా లక్ష్మీదేవి ఔదుంబరఫలములను ఆ వేళ్ళకు గ్రుచ్చి స్వామి వేదనను నివారింపచేసెను అని తెలుసుకుంటిమి. లక్ష్మీనరసింహస్వామికి విషశాంతి కలుగచేసిన ఆ ఔదుంబర వృక్షమునకు క్రింది విధముగా వరముల నొసగెను.

1. భక్తితో ఔదుంబరమును సేవించిన వారికి తమ కోరికలు నెరవేరును.
2. ఔదుంబర దర్శనముచే ఉగ్రవిషశాంతి కలుగును.
3. ఔదుంబరమును సేవించిన సర్వపాపక్షయమగును.
4. ఔదుంబర దర్శనమువల్ల శాంతి లభ్యం
5. ఔదుంబరమును సేవించిన పుత్రపౌత్రాదులు కల్గును.
6. ఔదుంబరమును పూజించిన శ్రీమంతులగుదురు.
7. ఔదుంబర ఛాయ జల మధ్యమున ఉన్న స్తంభమున స్నానము చేయువారికి భాగీరథీ స్నానపుణ్యాలు లభ్యమగును.
8. ఔదుంబర నీడ ఎన్నో ఫలములనొసగును.
9. ఔదుంబర దర్శనము మరియు సేవించుటచే వ్యాధి హీనులగును.
10. బ్రహ్మహత్యాది దోషములు ఔదుంబరమును పూజ చేసిన తొలగిపోవును.
11. సకల దేవతలు ఔదుంబరమును ఆశ్రయించెదరు.
12. నేను (శ్రీహరి), నా భార్య (లక్ష్మీదేవి)తో కూడి నీయందే (ఔదుంబరమునందే) నివసించెదను.

కావుననే శ్రీదత్తుని అవతారమగు శ్రీగురుమూర్తి ఔదుంబర వృక్షఛాయ నందే నివసించెదరు.

పంచనదులు కృష్ణలో సంగమించిన ప్రదేశము నందు తూర్పున అమరాపురం కలదు. ప్రసిద్ధి అయిన అమరేశ్వర దేవునితో పాటు ఔదుంబర వృక్షమున్న ప్రదేశమున శ్రీగురుమూర్తి నివసించుచుండెను. ఈ అమరేశ్వరుని సన్నిధియందు పాపవినాశనము, కామ్యతీర్థము వరదము అను ప్రఖ్యాత తీర్థలుము ఆ ఔదుంబర వృక్షసమీపమున కలదు. ఇచ్చట శ్రీగురువు 12 సం॥లు ఉండెను.ప్రతి దినము భిక్షార్థమునకై అమరాపురమునకు

పోవుచుండెను. శ్రీగురుమూర్తి గుప్తరూపమున వృక్షమూలమున నివసించు సమయమున ప్రతి రోజు మధ్యాహ్నము 64మంది యోగినులు అమరేశ్వరమునుండి వచ్చి శ్రీగురుమూర్తిని భక్తితో పూజించుచుండెను. వారు శ్రీ గురుమూర్తిని ఆశ్రమమునకు తీసుకునిపోయి పూజలు చేసేవారు. పూజానంతరము శ్రీ గురుమూర్తి తిరిగి ఔదుంబర వృక్షమూలమునకు చేరేవారు. ఒకసారి శ్రీ గురుమూర్తిని పరీక్షించుటకు ఒక వ్యక్తి గురుమూర్తిని అనుసరించి మార్గమధ్యమున తిరిగి ఆ వ్యక్తి భయాందోళనలతో శ్రీగురుమూర్తిని అనుసరించుట మాని తన గ్రామమునకు వెనుకకు తిరిగి పారిపోయెను. అదే గ్రామములో నివసించు గంగానుజుడను వాడు శ్రీగురుమూర్తిని దర్శించుటకై వచ్చుచున్న యోగినులను గంగ మధ్య నుండి వచ్చుట గమనించెను. పైగా ఆ యోగినులు జలమధ్యమున ఒక మార్గము చేసికొని వచ్చుట చూచి ఆశ్చర్యపోయెను. శ్రీగురుమూర్తి సాక్షాత్తు శివుడని తలచి కావుననే యోగినులు వచ్చి పూజించుచున్నారని ఆ గ్రామస్థుడు తలచెను. ఆ గ్రామస్థుడైన గంగానుజుడు శ్రీగురుమూర్తిని వెంట రహస్యముగా అనుసరించెను. ఆ యోగినులు గురుమూర్తిని జలమార్గమున తీసుకునిపోయి నవరత్న ఖచితములైన పురమున రత్నఖచితమైన సింహాసనముపై శ్రీగురుమూర్తిని కూర్చుండపెట్టి సకల పూజలు ఆచరించుట ఆ గంగానుజుడు గమనించెను. శ్రీగురుమూర్తి వచ్చిన ఆ గంగానుజుని చూచెను. అంత ఆ మనిషి శ్రీగురుమూర్తి పాదములపై పడి శరణుకోరగా గురుమూర్తి అతనిని ఆశీర్వదించి జరిగిన ఈ విషయము ఎవ్వరితోను చెప్పవద్దని అతనికి సద్గతి కలుగునని శ్రీగురుమూర్తి తన దివ్య ఆశీస్సులను ఇచ్చెను. కొంతకాలమునకు గంగానుజునకు శ్రీ గురుమూర్తి ఆశీస్సులచే అతని పొలములో నిధి దొరికెను.

అప్పటినుండి అను నిత్యము శ్రీగురుమూర్తి కడకు వచ్చి ఆ దంపతులు భక్తితో పూజించుచుండెడివారు. ఒకసారి గంగానుజుడు ప్రయాగ కాశీ వెళ్ళవలెనని తలంచినప్పుడు శ్రీగురుమూర్తి తన కోరిక నెరవేర్చుటకు గంగానుజునికి గురుపాదుకలను ధరింపచేసి ప్రయాగకు అతనిని శ్రీగురుమూర్తి తీసుకుని వెళ్ళి స్నానము చేయించి మధ్యాహ్నమున కాశీకి కూడా తీసుకుని వెళ్ళి సాయంకాలమునకు తిరిగి ఆశ్రమమునకు తీసుకొని వచ్చెను.

శ్రీగురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 15

**(అమరాపురమునందు ఒక బ్రాహ్మణదంపతులకు శ్రీగురుమూర్తి వారిపై కరుణ చూపుట - శ్రీగురుమూర్తి అమరేశ్వరస్వామిని వీడుకొలిపి అచటినుండి గంధర్వనగరము చేరుటకు నిశ్చయించుకొనుట)**

శ్రీగురుమూర్తి కృష్ణానదీ తీర తీర్థములను పునీతము చేయుచు కృష్ణపంచనదీ సంగమము నందు 12 సం॥లు ఉండెను. ప్రయాగతో సమానమైన సంగమస్థానము అక్కడ పంచనదీ ప్రవాహము ఆ కృష్ణానదిలో సంగమించెను. తూర్పున అమరాపురము కలదు. ఆ పంచనదీ ప్రదేశమున ఔదుంబర వృక్షము అమరేశ్వరదేవుడు కలవు. ఆ ఔదుంబర వృక్షసమీపమున పుణ్యతీర్థములు కలవు. శ్రీ గురుమూర్తి ప్రతి రోజు అమరాపురమునకు భిక్షకై పోవుచుండెడివారు. ఆ గ్రామము నందు నిరుపేద కుటుంబీకులైన బ్రాహ్మణుడి ఇంట శ్రీగురుమూర్తి భిక్షార్థమై వచ్చెను.

ఆ బ్రాహ్మణుడు యింటి ప్రాంగణమున చిక్కుడు పాదు కలదు. ఆ చిక్కుడుకాయలు ఆ దంపతులకు జీవనాధారము. అట్టి కటిక దరిద్రములో ఉన్న ఆ దంపతుల ఇంట శ్రీగురుమూర్తి భిక్షార్థమునకై వచ్చెను.

ఏ విభుపాద పద్మంతు లెన్నడు నెవ్వరు బొందలేని పెం
ద్రోవ జరింతు రట్టి బుధతోషక నీ వరుదెంచుటం బ్రయో
దావృత మయ్యె జిత్తము కృతార్థత నొందె మనోరథంబు, నీ
సేవ బవిత్రభావమును జెందెశరీరము నేడు మాధవా !

(శ్రీమద్భాగవతము)

అర్థం : ఓ దేవా! ఈనాటికి నా యింటికి వచ్చితివా? నేనెంత ధన్యుడను. శ్రీ పాద పద్మాలయందు జీవితమును సమర్పణ చేసెనంత సంతోషము ఇంకొకటి లేదు. నిన్నెరిగిన వానికి ఆనందము ప్రసాదించెదవు. అటువంటి నీవు దయచేయుటచే నా కోరికతో పాటు నా మనస్సు సంతోషించినిది. ఇప్పుడు నిన్ను పూజించుట మరియు సేవించుట వలన నేను పునీతుడు నయ్యెదను. (శ్రీకృష్ణపరమాత్మడు తన లోకములో అడుగుపెట్టిన కృష్ణుని చూచి భక్తితో వరుణుడు అన్న మాటలివి.)

వరుణుడైనా, నిరుపేద అయినా భక్తిమటుకు అందరికి సమానమే. అలనాడు వరుణుడు కృష్ణపరమాత్మ రాకను చూచి ఆనందముతో పలికిన పలుకులివి. అయితే శ్రీగురుమూర్తిని చూచిన ఆనందముతో ఆ బీద విప్రుడు తన మనస్సున వరుణునివలె ఈనాటికి తన ఇంటికి శ్రీగురుమూర్తి వచ్చెనని తానెంతో ధన్యుడని శ్రీగురుమూర్తి పాదపద్మముల యందు తన జీవితమును సమర్పణ చేసికొనవలెనని అట్లు సమర్పించినచో తన జీవితము ధన్యమని మరియు ఎనలేని ఆనందము పొందవచ్చునని శ్రీగురుమూర్తి రాకచే తన కోరిక మరియు

తన మనస్సు సంతోషముతో నిండెనని తలంచి ఆ విప్రుడు శ్రీగురుమూర్తికి పూజచేయవలెనని తలంచెను. శ్రీగురుమూర్తిని లోనికి తెచ్చి గౌరవముతో పూచించి తన ఇంటిలో కాచే చిక్కుడు కాయలతోనే భోజనము పెట్టి శరణువేడెను. శ్రీగురుమూర్తి అతనిని ఆశీర్వదించి తిరిగి వెళ్తూ వాకిట ఉన్న చిక్కుడు పాదును ఛేదించి వెళ్ళిపోయెను. శ్రీగురుమూర్తి చర్యను చూచిన ఆ విప్రవనిత మటుకు దుఃఖించెను. విప్రుడు మటుకు అది దైవసంకల్పముగా తలంచెను. ఆ విప్రుడు మిగిలిన పాదు మొదలంతా తీసివేసి పారవేసెను. అంత ఆ విప్రునకు ధనముతో నిండిన ఒక ఘటము అందులో కనిపించెను. ఆ దంపతులు అది సాక్షాత్తు శ్రీగురుమూర్తి యొక్క కరుణయే అని గ్రహించి శ్రీగురుమూర్తి కడకు వెళ్ళి జరిగినదంతయు చెప్పి కాళ్ళపై పడెను. ఇంత అద్భుతములు చేసిన గురుమూర్తి మటుకు మౌనముననే ఉండి జరిగిన అద్భుతములను ఇతరులకు చెప్పవద్దని గురుమూర్తి ఆ దంపతులకు కూడా ఆజ్ఞాపించెను.

శ్రీగురుమూర్తి గోప్యముగా ఉండవలెనని తలచి కృష్ణపంచనదీ సంగమమున గల అమరేశ్వరస్వామిని వీడుకొలిపి, గంధర్వనగరమునకు వెళ్ళుటకు సిద్ధమయ్యెను. అంత ప్రతిదినము 64 మంది యోగినులు కొలిచేవాళ్ళు గురుమూర్తి నిర్ణయమునకు వ్యతిరేకించెను. వారిని వదిలి వెళ్ళవద్దని వేడుకొనెను. అంత శ్రీగురుమూర్తి అక్కడ ఔదుంబర వృక్షమును చూపి సదా ఆ వృక్షము నందే నివసింతునని అదే తన నివాసమని ఆ వృక్షమునే పూజించమని అట్లు పూజించినవారికి కోరికలు నెరవేరునని చెప్పెను. అట్లు యోగినులు తెలిపి శ్రీగురుమూర్తి అమరజ మరియు భీమా నదుల సంగమ స్థానమైన గంధర్వనగరమునకు బయలుదేరెను.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 16

**(గంగాధరుడు, సుశీల దంపతులను ఆశీర్వదించుట - వారి పుత్రుడును తిరగి బ్రతికించుట - ఔదుంబర వృక్షమహిమ ఎఱుంగుట - గంధర్వనగరమునకు శ్రీ గురుమూర్తి ప్రయాణము)**

గత అధ్యాయములో అమరాపురసమీపము నందలి ఔదుంబర వృక్షమందు శ్రీగురుమూర్తి గుప్తరూపమున ఉండెనని తెలుసుకుంటిమి. శ్రీగురుమూర్తి తమ గంధర్వనగరమునకు ప్రయాణము కావింపక ముందు ఒక అద్భుత సంఘటన జరిగెను. ఈ సంఘటన ద్వారా శ్రీగురుమూర్తి వారు యోగినులకు అదృశ్యరూపమున ఔదుంబర వృక్షమందు ఉండుననే ఇచ్చిన వరము ఋజువుచేసెను. ఈ సంఘటన ఏమనగా శిరోల గ్రామనివాసులు గంగాధరుడు మరియు అతని భార్య సుశీల కలరు. వారికి సంతానము జన్మించినప్పటికి వెంటనే మృతిచెందుట జరుగుచుండెను. వారు ఆ బాధ తట్టుకొనలేక ఒక విద్వాంసుని సంప్రదించగా ఆ విద్వాంసుడు గంగాధరుని భార్య అయిన సుశీల పూర్వజన్మము నందు ఒక విప్రుని మోసగించి ధనము అపహరించెనని ఆ విప్రుడు ఆ మోసానికి తట్టుకొనలేక ఆత్మహత్య చేసుకుని ఒక పిశాచిగా మారి ఈ జన్మలో సుశీల గర్భమును పతనము చేయుచున్నాడని ఆ పాపానికి పరిహారము అమరాపురసమీపమున గల కృష్ణానదీ సమీపమున నున్న ఔదుంబర వృక్షమునకు ప్రదక్షిణలు, పూజలు కావిస్తూ, ఒక మాసం ఉపవాసమున్నచో మరియు ఆ వృక్షము కడ శ్రీగురుమూర్తి పాదుకలకు భక్తి శ్రద్ధలతో అభిషేకించి ఔదుంబర వృక్షమును నమ్ముకున్నచో పాపపరిహారమగునని ఆ విద్వాంసుడు ఆ బ్రాహ్మణదంపతులకు ఉపదేశించెను. దీనిని బట్టి ఈ జన్మలో కొన్ని కార్యములు మనకు నెరవేరుట లేదు అని దుఃఖించే బదులు పూర్వజన్మము నందు మనము ఏ పాపము చేసితిమో కదా అని, కావుననే ఈ జన్మమందు అనుభవించుచున్నామని ప్రతి ఒక్కరు తనకు తానే ప్రశ్నించుకుని ఈ జవాబు కూడా తానే చెప్పుకొనినయెడల ఏ కార్యము విరుద్ధమైనను దుఃఖము ఎదురైనను, బాధలు కలిగినప్పటికి మనస్సు స్థిరమగును, దీనివల్ల ఎదుర్కొనే శక్తి లభించును. కనీసము ఈ జన్మము నందైనా పుణ్యకార్యములు చేసినచో వచ్చే జన్మమునందు ఎటువంటి ఆటుపోట్లు ఎదురవ్వవు కదా!

విద్వాంసుని సలహాపై ఆ దంపతులు అమరాపుర సమీపమున గల ఔదుంబర వృక్షసమీపమున చేరి భక్తిశ్రద్ధలతో ఆ ఔదుంబర వృక్షమును పూజించి ప్రదక్షిణలు చేస్తూ కొన్ని దినములు గడిపెను. సుశీలకు స్వప్నములో పూర్వ జన్మమున ధనము పోగొట్టుకున్న బ్రాహ్మణుడు పిశాచరూపములో కనబడి బెదిరించెను. అదే స్వప్నములో శ్రీ గురుమూర్తి దర్శనమిచ్చి ఆ పిశాచమును మందలించి, ఆమె ఏ మాత్రమూ ద్రవ్యము ఈ జన్మనందు ఇవ్వగలదో ఇవ్వమని, ఆ పిశాచమును దానిని స్వీకరించమని ఆజ్ఞాపించెను. మరియు అట్లు చేసినచో సద్గతి కలుగునని ఆ పిశాచానికి శ్రాద్ధకర్మ చేయమని శ్రీ గురుమూర్తి స్వప్నములో ఆదేశిస్తూ రెండు కొబ్బరి కాయలను ఆమెకు ప్రసాదిస్తున్నట్లు చూపెను. మర్నాడు తన స్వప్నమును తలుచుకుని సుశీల శ్రీగురుమూర్తిని భక్తిశ్రద్ధలతో ధ్యానించుకొని శ్రీగురుమూర్తి ఆదేశానుసారం ప్రేతకర్మ చేయించెను. శ్రీగురుమూర్తి

ఆశీస్సులచే ఆమెకు ఇద్దరు పుత్రులు కలిగిరి. పెద్దకుమారుడు వ్యాధిగ్రస్తుడై మరణించెను. సుశీల దుఃఖము చెందెను. తనకు స్వప్నములో దర్శనమిచ్చిన శ్రీగురుమూర్తిని నిందించెను. తన పుత్రునితో పాటు తాను కూడా ప్రాణత్యాగము చేయదలచెను. అచ్చట జనులు సుశీలను ఎంత ఓదార్చినప్పటికి లాభము లేకపోయెను. తన పుత్రుని శవమును దహనము చేయుటకు ఇవ్వక మొండికేసెను. ఆ సమయమున ఒక విద్వాంసుడు ఆ ప్రదేశమునకు వచ్చి సుశీలకు ఆత్మజ్ఞానమును బోధించెను. ఆ విద్వాంసుడు మరెవరో కాదు. సాక్షాత్తు శ్రీదత్తుని అవతారమగు నృశింహసరస్వతియే. శ్రీగురుమూర్తి ఉపదేశము విన్నను సుశీల మనస్సు స్థిరము కాలేదు. బంధము చాలా బలమైనది కావున ఆ సమయమున భగవంతుడు వచ్చినను బంధమునకే సామాన్యమైన జీవులము మనము బంధానికే ప్రాధాన్యత ఇస్తాము. కాని భగవంతుడు చెప్పే మాటలు జ్ఞప్తికి రావు. ఆ సమయములో మాయ కనులను కప్పివేయుటచే అకస్మాత్తుగా అక్కడ ఒక విప్రుడు వచ్చి ఆత్మజ్ఞానము బోధించినప్పటకి మారువేషములో ఉన్న భగవంతుడనే ఆలోచన ఆ సమయమున ఒక్క సుశీలకే కాదు మనలాంటి వారందరికి కూడా కలుగదు. బంధం అంత గట్టిది.

సుశీల ఆ విద్వాంసునితో తాను శ్రీగురుమూర్తిని ఆశ్రయించినప్పటికి తనకు శ్రీగురుమూర్తి వరముచే పుట్టిన తన బిడ్డ ఏల మరణించవలెనని ఆ విద్వాంసునితో వాదించెను. అంత ఆ విద్వాంసుడు సుశీలకు తన పుత్రుని మృతదేహముతోకలిసి కృష్ణపంచనదీ తీరమున ఔదుంబర వృక్షముకడ ఉన్న శ్రీగురుమూర్తి సన్నిధికి పొమ్మని ఆదేశించెను. ఆ విద్వాంసుని ఆదేశానుసారము సుశీల తన పుత్రుని కళేబరముతో సహ ఔదుంబర వృక్షసమీపమునకు చేరెను. ఆ వృక్ష సమీపమున రెండు రోజులు నిద్రాహారములు మాని శవమును దహనము చేయక ఉండెను. మూడవరోజు సుశీల స్వప్నమందు శ్రీదత్తుడు దర్శనమిచ్చి తనను ఏల నిందించుచున్నావని ప్రశ్నించెను. శ్రీగురుమూర్తి అభయమిచ్చి ఆ కళేబరముపై భస్మము పూసెను. ఆమె కలయో నిజమో తెలియక భ్రాంతి చెందెను. తన కుమారుడు లేచి కూర్చొనుట చూసి ఆశ్చర్యపోయెను. జరిగిన వృత్తాంతము తన భర్తకు మరియు అక్కడ జనులకు చెప్పి శ్రీగురుమూర్తికి మనస్సులో క్షమాపణ చెప్పుకుని తాను నమ్ముకున్న ఔదుంబర వృక్షమును పూజించి శ్రీగురుమూర్తి పాదుకలకు అభిషేకించెను. ఈ సంఘటన బట్టి శ్రీగురుమూర్తి ఔదుంబర వృక్షమునందు సాక్షాత్తు ఉన్నారని ఋజువైనది.

శ్రీగురుమూర్తి భీమ అమరజానదుల సంగమము గల గంధర్వనగరమునకు బయలుదేరెను. ఆ నగరము మహాపుణ్యక్షేత్రము. ఆ నగర విశిష్టత మొదటి అధ్యాయములో తెలుసుకుంటిమి. అట్టి అష్టతీర్థములు గల ఆ గంధర్వనగరమునకు శ్రీగురుమూర్తి వచ్చి తన దివ్యపాదములను మోపెను.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 17

### (సంగమస్థానమందు శ్రీగురుమూర్తి నివశించుట - భిక్షకై గంధర్వనగరమునకు పోవుట - గొడ్డుగేదె పాలిచ్చుట)

శ్రీ గురుమూర్తి అమరజ మరియు భీమనదుల సంగమ స్థానమైన గంధర్వనగరమునకు చేరెను. ఆ సంగమ స్థానమున గల అశ్వత్థవక్షమున ధ్యానరూపుడై ఉండెను. ప్రతిదినము మధ్యాహ్నవేళకు భిక్షకై గంధర్వనగరమునకు వెళ్ళుచుండెను. ఆ నగరములో ఎన్నో గృహములు ఉండగా ఒక దరిద్రబ్రాహ్మణదంపతుల ఇంటిని ఎంచుకొని శ్రీ గురుమూర్తి ఆ యింట తమ కాలు పెట్టి భిక్ష యాచించెను.

పావనమయ్యె నా కులము, పండె దపంబు గృహంబు లక్ష్మికిన్
సేవితమయ్యె, నిష్టములు సెకుతె విశ్వనిదాన మూర్తులై
భూవలయంబు గావ నిటు పుట్టిన మిరలు రాకజేసె, నే
నే విధ మాచరించు బను లెయ్యవి, బంట నెఱుంగ జెప్పరే !

(శ్రీమద్భాగవతము)

అర్థం : మీరాకచే నా యిల్లు లక్ష్మీనివాసస్థానమైనది. పావనమైనది. నా తపస్సు ఫలించి మనస్సు తృప్తి పొందినది. లోక కళ్యాణమునకై మీరు మానవులై పుట్టిన భగవంతులు. నేను నీ సేవకుడను. ఏమి చేయవలెనో ఆజ్ఞాపించుము. (బలరామకృష్ణులు సుదాముని ఇంటిలో ప్రవేశించినప్పుడు ఆ సుదాముడు భక్తి శ్రద్ధలతో బలరామకృష్ణులకు నమస్కరించి అనిన మాటలు)

శ్రీగురుమూర్తి రాకను చూచి ఆ కటిక దరిద్ర బ్రాహ్మణుడు విస్మయమొందిరి. వారి ఇంట ఏమీ లేవు. ఒక్క గొడ్డుగేదె తప్ప. ఆ గేదె ఒక్క ఒంద్రు మట్టి తెచ్చుటకు తప్ప ఆ ఒంద్రు మట్టి తెచ్చి ఇచ్చినందుకు ఆ ఊరిరైతులు స్వల్పధనమును ఆ దంపతులకు ఇచ్చుచుండెడివారు. వారి జీవనాధారము ఆ గొడ్డుగేదె చేసే ఆ పని ఒక్కటే. కనీసం పాలైనను ఇవ్వలేని ఆ గొడ్డుగేదె పరిస్థితి చూచి ఆ దంపతులు బాధపడుచుండెడివారు. ఆ గంధర్వనగరమున శ్రీగురుమూర్తి 101 ఇళ్ళు ఉన్నప్పటికి ఎందరో ధనవంతులున్నప్పటికీ ఆ దరిద్ర దంపతుల యింటిని మాత్రమే ఎన్నుకొనెను. శ్రీవారి లీలలు అలాగే ఉంటాయి. కావుననే శ్రీకృష్ణపరమాత్ముడు ఒక్కసారిగా సుదాముని ఇంట అతిథిగా వచ్చెను. ఆ నారాయణుడే శ్రీదత్తుని అవతారమగు శ్రీగురుమూర్తి రూపమున ఆ దంపతుల యింటికి కూడా వచ్చెను. శ్రీగురుమూర్తి భిక్షకోరగా ఆ యింటి ఇల్లాలు తన భర్త ధాన్యమునకై వెళ్ళెనని తాను రాగానే భిక్ష ఇచ్చెదనని అనగా శ్రీ గురుమూర్తి ఆ గొడ్డుగేదెను చూచి ఆ గేదెపాలను కోరెను. అంత ఆ యింటి ఇల్లాలు ఆ గేదె పాలు ఇవ్వదని అది గొడ్డు గేదె అని చెప్పగా శ్రీ

గురుమూర్తి ఆ ఇల్లాలిని పాలు పిండమని ఆజ్ఞ ఇవ్వగా శ్రీగురుమూర్తి ఆజ్ఞా పాటించి ఆ యింటి ఇల్లాలు పాలు పితుకగా గిన్నెడు పాలు ఇచ్చెను. ఆ ఇంటి ఇల్లాలు ఆశ్చర్యపడి తన ఇంటికి వచ్చినది సాక్షాత్తు భగవంతుడేనని గ్రహించెను. ఆ గిన్నెడు పాలను శ్రీ గురుమూర్తి త్రాగి ఆ ఇల్లాలిని ఆశీర్వదించి సంగమస్థానమునకు వెడలిపోయెను. తరువాత ఆ ఇల్లాలు జరిగిన విషయము తన భర్తకు చెప్పి సంగమస్థానమున గల శ్రీగురుమూర్తి వద్దకేగి సాష్టాంగదండప్రణమములు చేయగా గురుమూర్తి వారిని ఆశీర్వదించగా వారు పుత్రపౌత్రాది సంపదలతో వర్థిలెను.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 18

**(శ్రీగురుమూర్తి మహిమ తెలుసుకొనుట - మహారాజు కోరికపై గురుమూర్తి గంధర్వనగరమున ఉండుట - మహారాజు మఠము నిర్మించుట - బ్రహ్మారాక్షసిని విముక్తి కలిగించుట)**

పై అధ్యాయములో శ్రీగురుమూర్తి గంధర్వ నగరము చేరిన వెంటనే ఒక దరిద్ర బ్రాహ్మణుని ఇంటకాలు మోపి ఒక గొడ్డు గేదె పాలిచ్చునట్లు తమ లీలలను చూసి ఆ దంపతులను ఆశీర్వదించి వెడలిపోయెనని తెలుసుకుంటిమి. శ్రీగురుమూర్తి సాక్షాత్తు దత్తాత్రేయుల వారు. వారికి అవధులు ఉండవు. కావుననే ఒక అవధూతరూపమున శ్రీగురుమూర్తి నృసింహసరస్వతి నామముతో అవనిపై అవతరించి తమ లీలలను అవధులు లేవని చాటి చెప్పెను. వారిని గురించి తెలుసుకొనుట అసాధ్యము. ఆది మధ్యాంతములు కనుగొనుటకు మనబోటివారికి ఊహించుట కూడా తగనిది. అలాంటి అవధూతలు అవనిపై ఒక సామాన్య మానవరూపము దాల్చి ఎక్కడ ఏయే కార్యములు చేయవలెనో ముందుగానే వారికి తెలుసును కాబట్టి ఆయా కార్యములు నిర్వర్తించి కొన్ని లీలలను చూపుతూ ఒక ఊరి నుండి మరియొక ఊరికి సాగిపోతూ ఉండెదరు. పరమాత్మ అయిన శ్రీగురుమూర్తి ఎటువంటి చమత్కారములు చూపనవసరము లేదు. కాని వారు ఒక సామాన్య రూపమున లోకకళ్యాణార్థమునకై అవనిపై అవతరించినప్పుడు సామాన్యమైనటువంటి మనబోటి జనులకు చమత్కారములు చూపవలసిన అవసరము ఉన్నది కావుననే శ్రీగురుమూర్తి గంధర్వనగరమున కాలుమోపిన మొట్టమొదటి ఇంటిలో గొడ్డుగేదెకు పాలు వచ్చునట్లు ఒక చమత్కారము చూపెను. ఆ చమత్కారము వల్ల గంధర్వనగరమున కల మహారాజు చెవిలో శ్రీగురుమూర్తి చేసిన చమత్కారము పడినది. ఆ రాజు ఆశ్చర్యపోయి శ్రీగురుమూర్తికై వెతికెను. శ్రీగురుమూర్తిని కాంచిన వెంటనే ఆ మహారాజు ఆ యతి పాదములపై పడి శ్రీగురుమూర్తిని శరణువేడెను. ఆ మహారాజు భక్తిశ్రద్ధలతో శ్రీగురుమూర్తిని గంధర్వనగరమునకు విచ్చేయమని శ్రీవారి కొరకు ఒక మఠమును ఆ రాజు నిర్మించి ఇచ్చెదనని ఆ నగరమునందే ఎల్లప్పుడు ఉండమని యాచించెను. అందులకు శ్రీగురుమూర్తి ఆ రాజు భక్తి శ్రద్ధలకు ముగ్ధుడై అంగీకరించెను. శ్రీగురుమూర్తిని పల్లకి యందు కూర్చుండబెట్టి నగరమునకు తీసుకుని వచ్చెను. ఆ ఊరికి అవతల ఒక అశ్వత్థవృక్షమందు బ్రహ్మారాక్షసుడు ఒకడు కలడని ఆ వృక్షసమీపమున ఆ రాక్షసుని భయమువల్ల జనులు సంచరించక ఖాళీప్రదేశముగా ఉండెను. ఆ సమీపమున శ్రీగురుమూర్తి వచ్చెను. అంత బ్రహ్మ రాక్షసుడు శ్రీ గురుమూర్తి దివ్యతేజస్సును చూచి చెట్టుపై నుండి దిగి సాష్టాంగప్రణామము చేసెను. శ్రీ గురుమూర్తి ఆ బ్రహ్మారాక్షసుని ఆశీర్వదించి సమీపమునగల సంగమమునకు చేరి స్నానము చేయమని దానివల్ల శుభము కలుగునని ఆశీర్వదించగా బ్రహ్మారాక్షసుడు గురుమూర్తి ఆజ్ఞను పాటించి మోక్షమును పొందెను. శ్రీగురుమూర్తికి ఒక మఠము మహారాజు నిర్మించి గంధర్వనగరమున ఆ

మఠములో శ్రీగురుమూర్తి ఉండునట్లు  ఆ రాజు చేసెను. ఆ మఠములో గురుమూర్తిని దర్శించుటకు ఎందరోవచ్చిపోవుచుండిరి. శ్రీ గురుమూర్తి నిత్యము సంగమమునకు అనుష్టానమునకై పోవుచుండెడివారు.

యావత్ జగత్తే పరమాత్ముడు అయినప్పుడు శ్రీగురుమూర్తిని మహారాజు గంధర్వనగరమునకు రమ్మని అహ్వానించుట శ్రీగురుమూర్తికై ఒక మఠమును నిర్మించి ఇచ్చుట అందు శ్రీగురుమూర్తి ఉండుట అనునది ఒక మాయ తప్ప మరియొకటి కాదు.

నీవారై నీదెస దమ
భావంబులు నిలిపి ఘనులు భయవిరహితులై
యే విఘ్నంబుల జెందక
నీ వరమయగమేటి చీట నెగడుదు రీశా !
(శ్రీమద్భాగవతము)

అర్థం : సర్వభావములు నీయందు నిలిపి శరణాగతి కోరి నీ వారుగా జీవించువారికి ఇక భయమేల? నీవు వారిని కాపాడుచూ నీ కరుణ చూపి వారిని ఉత్తమలోకములో జీవించునట్లు చేసెదవు.

శ్రీగురుమూర్తి ఆనాటి నుంచి గంధర్వనగరమున ఉండిపోయెను. ఎందరో భక్తులు తమ సర్వభావములను శ్రీగురుమూర్తి చరణములపై నుంచి అనన్య శరణాగతి వేడుచూజీవింపసాగిరి. ఎప్పుడైతే సర్వశ్యశరణాగతి కోరెనో ఆ భక్తులకు భయమంటే ఏమిటో మరచిపోయినారు.  వారికి విఘ్నములు కూడా లేకపోయినవి. అటువంటి వారికి అటువంటి స్థితి కలిగినదనుటకు కారణం శ్రీగురుమూర్తి యొక్క కరుణాకటాక్షమే. వారిని శ్రీగురుమూర్తి తమ కళ్ళల్లో పెట్టుకుని కాపాడుకొనుచుండెను. అటువంటి భక్తులు లౌకికలోకములో జీవింపక శ్రీగురుమూర్తి ప్రేమ, కరుణ మరియు దయ వల్ల ఒక ఉత్తమమైన లోకములో జీవించుచున్నారు. ఏనాడైతే శ్రీగురుమూర్తి గంధర్వనగరమున కాలు మోపెనో నిజముగా ఆ నగరము గంధర్వమయ్యెను. అవనిపై ఒక దేవతల లోకము ఉద్భవించినట్లు ఒక  కొత్త లోకముగా శ్రీగురుమూర్తి రాకచే మారిపోయెను.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే



## అధ్యాయము - 19

**(త్రివిక్రమభారతికి కనువిప్పు కల్గుట - వేదశాస్త్ర నిపుణులైన ఇద్దరు ద్విజులకు కనువిప్పు కల్గుట)**

శ్రీ గురుమూర్తి గంధర్వ నగరమున ఉండెనని పై అధ్యాయము ద్వారా తెలుసుకుంటివి. వారి మహిమలు అంతట వ్యాపించుటచే వారిపేరు అంతట తెలిసి జనులు తండోపతండాలుగా స్వామి దర్శనానికై వచ్చి వారి మహిమలను, చమత్కారములకు ముగ్ధులైపోయిరి. సామాన్యముగా ఒకరికి మంచిపేరు ప్రఖ్యాతులు వచ్చినప్పుడు వారిపై నిందకూడా నీడవలె వెంటాడుట సహజము. అలాంటి నింద సాక్షాత్తు పరమేశ్వరుడైన శ్రీ గురుమూర్తిపై కూడా మోపబడినది. "కుమసి" గ్రామమందు త్రివిక్రమ భారతి అను ఒక యతి శ్రీ గురుమూర్తి మహిమలు విని నిందమోపెను. ఒక సన్యాసి అయివుండి డాంబికముగా జీవించుట తగదని త్రివిక్రమ భారతి తలచెను. ఆ త్రివిక్రమ భారతి శ్రీహరి భక్తుడు. అనునిత్యము వారు తన మనస్సులో 'హరి'ని దర్శింప చేసుకుని పూజించే శక్తిసామర్థ్యము గల గొప్ప యతి అతడు. గంధర్వ నగరమున ఉన్న శ్రీ గురుమూర్తికి ఆ నింద తెలిసెను. పరమాత్మ అయిన శ్రీ గురుమూర్తి ఒక సామాన్య యతివలె స్వయముగా కుమసి గ్రామమునకు వెళ్ళి త్రివిక్రమ భారతి ఉన్న చోటుకు వచ్చుచుండగా ఆ సమయమున అనునిత్యము శ్రీహరిని తన మనస్సులో చూచే త్రివిక్రమ భారతికి ఆ రోజు హరిదర్శనము కలుగలేదు. తన మానస అర్చనలో ఒక పెద్ద సైన్యము దానిని నడిపించు ఒక దండదారిని చూచెను. ఈ విచిత్ర సంఘటనను కాంచినంతనే త్రివిక్రమ భారతి ఆశ్చర్యము చెంది శ్రీ గురుమూర్తికి ఎదురేగి సాష్టాంగము చేసెను. అతను ఏ జీవిని చూచినా దండదారులై యతిరూపులై త్రివిక్రమ భారతికి కనిపించెను.

బాలమాత్రుడగు సలీలుని ముఖమందు
విశ్వమెల్లనెట్లు వెలసియుండు?
బాలుభంగి నితడు భాసిల్లు గాని స
ర్వాత్ముడాది విష్ణుడగుట నిజము (శ్రీమద్భాగవతము)

అర్థం: ఈ బాలుని ముఖములో సర్వజీవులు మరియు సమస్త విశ్వము కనిపించుచున్నది. నా భర్త, నేను, గోప బాలకులు, గోపికలు, గోవులు మొదలగు సమస్తము కనబడుచున్నది. ఇతడు నా కొడుకని భ్రమపడితిని గాని మా ప్రభువని తెలుసుకొనలేకుంటిని. (ఈ సంఘటన బాలకృష్ణుడు మన్ను తిన్నప్పుడు ఆ దేవాదిదేవుడిపై నిందమోపి తల్లియైన యశోదకు ఫిర్యాదు చేయగా తల్లి యశోద శ్రీ కృష్ణుని మందలించి నోరు చూపమని అనగా ఆ పరమాత్మ తన చిన్ని నోరు తెరిచి చూపగనే సృష్టి అంతయు కృష్ణుని నోటిలో కనిపించినది. తల్లి యశోదకు తన పుత్రుడైన కృష్ణుని ముఖమునందు సమస్త విశ్వము కనిపించుటయే కాక తన భర్త, తాను (యశోద) గోపగోపికలు, గోవులు సమస్తము దర్శించినది).

శ్రీహరి రూపుడైన శ్రీ గురుమూర్తి నిందమోపిన త్రివిక్రమ భారతి ఎదుట వచ్చినప్పుడు ఆ త్రివిక్రమ భారతికి ప్రాణికోటి అంతయు దండధారులై యతిరూపులై కానవచ్చిరి. పరమాత్మ తలచుకున్నచో తన రూపములో సమస్త విశ్వముతోపాటు భర్త, భార్య, తల్లి, తండ్రి మొదలగు వారి రూపములను చూపగలరు. అట్లే సమస్త ప్రాణికోటి అంతయు ఒకే రూపముగా మార్చి చూపగలరనే నిజం దీని ద్వారా తెలిసినది.

త్రివిక్రమ భారతి తన తప్పును మన్నించమని నిజ రూపమును చూపమని శ్రీ గురుమూర్తిని శరణుకోరెను. అంత శ్రీ గురుమూర్తి ప్రసన్నుడై తన నిజస్వరూపము చూపి ఆశీర్వదించెను.

వేదశాస్త్ర నిపుణులైన ఇద్దరు ద్విజులు వారితో సమానమైన వారు ఎవ్వరు లేరని గర్వముతో వైఢూర్య నగరమునకు వచ్చి అచ్చటి రాజు వద్ద తమ ప్రగల్భములు తెలిపి ఆ రాజదర్బారులో ఎందరో వేదశాస్త్ర పండితులను పిలిపించి వారిని ఓడించి చివరకు గ్రామ గ్రామములో తమతో వాదించువారు ఎవరైనా ఉన్నారేమోనని అన్వేషించుచుండగా చివరకు త్రివిక్రమభారతి కనిపించెను. వారి వాదనను విన్న త్రివిక్రమభారతి శ్రీ గురుమూర్తి కడకు తీసుకువెళ్ళెను. శ్రీ గురుమూర్తి వారి గర్వమును అణుచుటకై అక్కడకు వచ్చిన ఒక సామాన్య మానవుడిని ఆశీర్వదించి అతనిపై దృష్టిని నిలిపి శ్రీ గురుమూర్తి ఏడు రేఖలు గీయించెను. ఆ ఏడు రేఖలలో ఒక్కొక్కటి దాటి రమ్మని శ్రీ గురుమూర్తి ఆదేశింపగా ఆ సామాన్య మానవుడు ఒక్కొక్క రేఖ దాటుతూ తన పూర్వ జన్మ వివరాలు చెప్పసాగెను. అలా ఆరు రేఖలు దాటి ఏడవరేఖలో కాలుపెట్టి వేదశాస్త్ర నిపుణుడై అక్కడకు వచ్చిన ఆ ఇద్దరి ద్విజులతో వాదించి ఓడించెను. ఆ ఇద్దరు విప్రులు గర్వమణిగి శ్రీ గురుమూర్తి పాదములపై పడి శరణువేడెను. శ్రీ గురుమూర్తి ఆ ఇద్దరు చేసిన పాపముల వలన వారు ఉత్తరోత్తర రాక్షస జన్మ ఎత్తెదరు అని. 12 సం॥లు పిదప ఆ రాక్షస జన్మ అంతరించునని హరినామ స్మరణ చేయువాని వల్ల ఆ ఇద్దరి పాపములు అంతరించి సద్గతి చెందెదరని శ్రీ గురుమూర్తి భవిష్యత్తు ముందుగానే చెప్పెను.

మానవుడు ఎంత జ్ఞాని అయినప్పటికి తాను పొందిన ఆ జ్ఞానము పరమాత్మని యొక్క అనుగ్రహము వలననే అని ఎరుక ఎల్లప్పుడు ఉండవలెను. లేనియెడల దర్పము వచ్చి మానవుని పెనవేసుకొనుటచే చేతన కళ్ళు బైర్లు కమ్మి చెలరేగుట జరుగును. కావున ఇంద్రియ నిగ్రహము కలిగి కోపతాపములను అదుపులో ఉంచి ఎంత ఎదిగినను సత్వగుణముతో ఉండి సహజముగా సామాన్యముగా ఉంటూ డాంబికము ఏ మాత్రము చూపకూడదని పరమాత్మ ఆడే ఆటలో ఒక జ్ఞాని ఒక పరమశుంఠగా మార్చవచ్చునని అలాగే ఏ వేదశాస్త్రములు ఎరుగని ఒక సామాన్యుడు, జాతిహీనుడు అయిన పరమశుంఠ కూడా ఒక వేద శాస్త్రనిపుణుడై పండితుడు కావచ్చునని గ్రహించవలెను. ఆ పరమాత్మని ఆటలో మనము ఒక కీలుబొమ్మలను మాత్రమే అని నిత్యము ఎరక ఉండవలెను.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము 20

### (శ్రీ గురుమూర్తి మరియొక లీల)

శ్రీ గురుమూర్తి గంధర్వ నగరమున ఉన్న రోజులలో మహూరిపురమందు గోపీనాథుడనే ధనికునికి శ్రీ దత్తాత్రేయుని ఆశీస్సులచే ఒక పుత్రుడు జన్మించెను. ఆ ధనిక బ్రాహ్మణుడు తన పుత్రుడు దత్తుని వరముగా భావించి అతనికి దత్తుడని పేరు పెట్టెను. అతనికి వివాహము కూడా చేసెను. దత్తుడు తన భార్యతో ఎంతో ఆనందముతో గడుపుచున్న రోజులలో అకస్మాత్తుగా దత్తుడు వ్యాధిగ్రస్తుడయ్యెను. తన పతిని తన ప్రాణముకన్న మిన్నగా దత్తుని భార్య చూచుకొనుచుండెను. దత్తుని తల్లిదండ్రులు తన కుమారుడైన దత్తుని రోగమును చూచి చింతించెను. వైద్యులను, జ్యోతిష్కులను సంప్రతించినను లాభము లేకపోయెను. తన కులదైవమైన దత్తాత్రేయుని చివరకు వేడుకొనెను. తన కుమారుడు మటుకు నిబ్బరముగా ఉంటు అంతా ఈశ్వరేచ్ఛగా భావించుచుండెను. తను ఇక బ్రతుకుట కష్టమని తన భార్యను తన పుట్టింటికి వెడలి పొమ్మని వేడెను. అయినా దత్తుని భార్య భర్తను వదలక గంధర్వ నగరమున ఉన్న శ్రీ గురుమూర్తిని దర్శించిన తన బాధ తొలగునని భర్తతో సహా బయలుదేరెను. భీమానదీ తీరము ప్రవేశించిన పిదప తన భర్త తన ప్రాణములను విడిచెను. గురుమూర్తి దర్శనము కాకమునుపే ఆ సంఘటన జరుగుటచే ఆ పతివ్రత మిక్కిలి దుఃఖించెను. ఇక తాను జీవించుట వ్యర్థమని భావించెను. ఆ దుఃఖ సమయమున పరమేశ్వరుని రూపమున అనగా భస్మభూషితుడై జటాధారి రుద్రాక్షలు ధరించిన త్రిశూలము పట్టిన ఒక యోగి అచ్చటకు వచ్చి దుఃఖించుచున్న దత్తుని భార్యను ఓదార్చెను. జరిగిన సంగతి అంతా తెలుసుకొనెను. ఆ పతివ్రతకు ఆత్మజ్ఞానమును బోధించెను.

జనకుండెవ్వడు జాతుడెవ్వడు ? జనస్తానంబు లెచ్చోటు సం
జననం బెయ్యది? మేను లేకొలది ? సంసారంబు లే రూపముల్ ?
వినుమా, యంతయు విష్ణుమాయదలపన్ వేఱేమియున్ లేదు యో
హ నిబంధంబు నిధానమింతటికి జాయా! విన్నబో నేటికిన్? (శ్రీమద్భాగవతము)

అర్థం: పుట్టుట, శరీరము అనగా ఏమి? పుట్టెడివాడు పుట్టించే వాడెవడు? సంసారములో గల బంధములున్నవా? ఇదంతయు విష్ణుమాయె. మోహములో చిక్కుబడుటయే ఆ విష్ణుమాయ విధానము. అట్టి సంబంధములను బంధములుగా తలచి దుఃఖపడుటయేల? (కశ్యపుడు తన భార్య అయిన అదితితో పలికిన పలుకులు)

సుఖము వచ్చినా, కష్టము వచ్చినా మనిషి మురిసిపోవుట లేదా దుఃఖించిపోవుట జరుగుట సహజము. కాని సుఖానికి తబ్బిబ్బు అవకుండా దుఃఖానికి కృంగిపోకుండా స్థిత ప్రజ్ఞతను సంపాదించుకోవాలి. నిజానికి మనిషి ఎక్కడినుండి వచ్చాడో అక్కడికే వెళ్ళిపోవుట సత్యము. ఈ రాకపోకల మధ్య జరిగేదంతా విష్ణుమాయే. పుట్టిన ప్రతిజీవి తన శరీరము చూచి భ్రాంతిచెంది శరీరమే సత్యమని శాశ్వతమని తలంచి సంసారములో ఇరుక్కుని బంధమనే రోగముతో ఉన్నంతవరకు ఆ రోగమును అనుభవిస్తూ దానికి నివారణమునకై అన్వేషించక

ఇంకా ఎన్నో బంధములలో చిక్కుకుని ఆ బంధ సంబంధముల మోహములో ఇరుక్కుంటాడే తప్ప ఆ చిక్కునుండి బైటపడుటకు ఆలోచన చేయడు. ఎన్నో సంబంధాలను పెట్టుకుని ఆ సంబంధము వలన బంధము తగుల్చుకుని దుఃఖపడతాడే తప్ప నిజానికి అదంతా విష్ణుమాయ అని తెలుసుకొనలేడు. జ్ఞాని అయినవాడు అది విష్ణుమాయే అని తలచినప్పుడు వానికి ఎటువంటి దుఃఖము ఉండదు. జరిగేది విష్ణుమాయ అని ఎరుక ఉండుటచే దుఃఖం వచ్చినా దుఃఖించడు. సుఖం వచ్చినా సంతోషించడు. దత్తుని భార్యకు యోగి ఆత్మబోధన చేసెను. ఆ యోగి స్త్రీలకు ధర్మబద్ధమైన ఆచారములు కూడా తెలిపెను. ఆ యోగీశ్వరుని ఉపదేశములన్నియు విన్న పిదప ఆ పతివ్రత తన పతితో సహగమనము చేయుటకు అనుమతి ఇమ్మని కోరెను. అంత ఆ యోగిశ్వరుడు ఆ పతివ్రత యొక్క సమస్యకు శ్రీగురుమూర్తియే పరిష్కరించగలడని మరణము ప్రతిజీవికి సహజమని దానిని ఎదిరించుట ఎవరి తరం కాదని బోధించెను.

కాలము ప్రబలులకును బలి
కాలాత్మం డీశ్వరుండగణ్యుడు, జనులకున్
గాలవశులుగా జేయును,
గాలము గడవంగ లేరు ఘను లెవ్వారున్ (శ్రీమద్భాగవతము)

అర్థం : ఎంతటి వారికైనా వారికన్నా కాలము గొప్పది. పుట్టిన వారిని కాలవశులుగా చేసి కాలమే తానుగా ఉన్న ఈశ్వరుడు అంతయు చేయును.

ఆ యోగీశ్వరుడు దత్తుని భార్యకు శ్రీ గురుమూర్తి దర్శనము చేసుకొనమని సలహా ఇచ్చి దత్తుని శవముపై భస్మముతో అద్దెను. నాలుగు రుద్రాక్షలు ఆ పతివ్రతకు ఇచ్చి రెండు రుద్రాక్షలు కంఠమునకు కట్టమని మరి రెండు రెండు చెవులకు కట్టి వహ్ని ప్రవేశము చేయమని ముందుగా గురుమూర్తిని దర్శించి గురుమూర్తి పాద తీర్థము స్వీకరించి తన దేహముపైన మరియు శవముపైన చల్లమని సలహా ఇచ్చెను. దత్తుని భార్య యోగీశ్వరుని ఆజ్ఞ పాటించుటకై గురుమూర్తి దర్శనమునకై వెళ్ళెను. గురుమూర్తి దత్తుని భార్యను చూసి తనకు సౌభాగ్యము కలుగునని దీవించెను. అచ్చటి జనులు జరిగినదంతయు గురుమూర్తికి వివరించి ఆమె భర్త మరణించెనని కావున గురుమూర్తి ఆశీర్వచనములు ఎట్లు ఫలమగునని గురుమూర్తిని ప్రశ్నించెను. అంత ఆ గురుమూర్తి శవమును తన కడకు తెమ్మని ఆజ్ఞాపించగా జనులు ఆ శవమును గురుమూర్తి కడకు తెచ్చెను. గురుమూర్తి తీర్థ జలమును ఆ శవముపై ప్రోక్షించెను. తన దివ్యదృష్టితో శవమును గురుమూర్తి చూడగనే శవము లేచి కూర్చొనెను. ఆ దంపతులిరువురు ఆశ్చర్యచకితులై గురుమూర్తి పాదములపై పడెను. అంత గురుమూర్తి వారిరువురిని ఆశీర్వదించెను.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము 21

### (బ్రహ్మ రాసిన రాతను తారుమారు చేయుట - గురుమూర్తి మహిమలో గల రహస్యము)

పై అధ్యాయమున మహూరి నివాసియగు గోపీనాథుని పుత్రుడైన దత్తుడు మరణించిన పిదప దత్తుని భార్య భక్తి శ్రద్ధలకు మరియు పతివ్రత వలన శ్రీ గురుమూర్తి ముగ్ధుడై చనిపోయిన దత్తుని తన మహిమచే బ్రతికించెనని తెలుసుకుంటిమి.

మన నిత్య జీవితములో భగవంతుడు ఏదో రూపమున మన కంటికి కనిపించి ఏదో ఒక మేలు చేసి వెళ్ళి పోవుచుండును. ఆ మేలు ఒక రూపము దాల్చిన జీవి ద్వారా చేయవచ్చును. లేదా ఏ రూపమూ లేకుండానే మనకు తెలియకుండానే పనులు జరిగిపోవుచుండును. కాని సామాన్యులమైన మనము వాటిని గుర్తించలేకపోవుచున్నాము. అలాంటి ఘటనే దత్తుని భార్యకు కూడా జరిగినది. దత్తుడు మరణించిన పిదప తన భార్య దుఃఖముతో శోకించుచుండగా అక్కడికి ఒక యోగీశ్వరుడు భస్మధారి రూపుడై వచ్చెనని తెలుసుకుంటిమి. దత్తుని భార్యకు నాలుగు రుద్రాక్షలు ఇచ్చెనని మరియు దత్తుని కళేబరముపై విభూది చల్లి దత్తుని భార్యను ఒక్కసారి శ్రీగురుమూర్తి దర్శనం చేసుకొనమని సలహా ఇచ్చెనని తెలుసుకుంటిమి. ఆ యోగీశ్వరుని సలహా పాటించుటచే దత్తుని భార్యకు శ్రీ గురుమూర్తి దర్శన భాగ్యము లభించుటయేకాక ప్రాణములు కోల్పోయిన తన భర్త గురుమూర్తి ఆశీస్సులచే తిరిగి బ్రతికెను. ఐతే దత్తుని భార్యకు గురుమూర్తి దర్శనం చేసికొనమని చెప్పిన ఆ యోగీశ్వరుడు మరెవరో కాదు సాక్షాత్తు శ్రీ గురుమూర్తియే ఆ రూపమున వచ్చి ఆ దంపతుల కష్టమును నివారించుటకై అట్లు సలహా ఇచ్చినారు. ఈ సంఘటన బట్టి తెలుసుకొనవలసినది భగవంతుడు మన నిత్యజీవితములో ఏ రూపములోనైనా ఏ క్షణములోనైనా ఎవరినైనా కరుణించుటకు రావచ్చును. వచ్చినవారిని చులకన చేయక జాగ్రత్త వహించవలెను.

పరమాత్మకు అతీతమైనటువంటి శక్తులుండును. వారు తలచుకొనినచో చనిపోయిన వారిని కూడా బ్రతికించగలరు. కాని అలాంటి శక్తులను చాలా అరుదుగా చేసెదరు. కారణం శ్రీ గురుమూర్తి సాక్షాత్తు తన నోటితో చెప్పినదేమనగా ఒక జీవిని ఒక జన్మయందు అతను అల్పాయుష్షు అయివున్నచో విధిరాత ప్రకారము అతను కాలానుగుణముగా చనిపోవును. అట్టి అల్పాయువును తిరిగి ఈ జన్మయందు బ్రతికించవలెనన్న తమ శక్తులతో బ్రతికించినను ఆ జీవి రాబోవు జన్మయందు శతాయుష్షు ఉన్నను ఆ జీవి విధిరాత ప్రకారము వందేళ్ళు బ్రతకక అల్పాయుష్కుడగును. కావుననే ఇటువంటి వ్యత్యాసములు ఎదుర్కొనవలసిన వచ్చుటచే పరమ పురుషులు వారికి చనిపోయిన వారిని తిరిగి బ్రతికించే శక్తి ఉన్నప్పటికీ వారు అట్టి శక్తిని వాడరు. వాడినచో ఇటువంటి ప్రమాదములుండును. ఇట్టి రహస్యమును శ్రీ గురుమూర్తి చెప్పెను.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము 22

**(పరాన్నము వలన సుఖము కలదనే భావనగల విప్రుని భార్యకు కనువిప్పు మరియు పరాన్నము గ్రహింపరాదనే విప్రుని సంకల్పమును తారుమారు చేయుట)**

శ్రీ గురుమూర్తి గంధర్వ నగరమున ఉన్న రోజులలో ఒక నిష్ఠగల విప్రుడు ఉండెను. అతనికి గల నిష్ఠ ఏమిటంటే పరాన్నము భుజింపడు. కాని అతని భార్యకు వ్యతిరేక బుద్ధి కలదు. తన భర్త నిష్ఠను పాటింపక పరాన్నమును భుజించుటకు యాచించుచుండెను. సర్వవ్యాపియగు శ్రీ గురుమూర్తికి తెలయనిది ఏది ఈ సృష్టియందు యావత్ జగత్తులోని జీవులందరు కలిసి వారి నేత్రముల ద్వారా శ్రీ గురుమూర్తిపై దృష్టిని ఉంచినను ఆ దివ్య తేజోమయమైన, ఆనందమయమైన, శాంతి స్వరూపుడైన, సూర్యకాంతికన్న తేజస్సుకన్న ఆ గురుమూర్తి దివ్య రూపమును యావత్ జగత్‌లోని జీవులందరు ఏకమై చూచుటకు ప్రయత్నించినను శ్రీ గురుమూర్తి యొక్క ఆధి మధ్యా మరియు అంతము తెలుసుకొనుటకు సాధ్యంకాదు. ఎంత చూచినను తనివి తీరని ఆ సుందర స్వరూప దత్తాత్రేయ అవతారుడైన శ్రీ గురుమూర్తిని చూచినప్పటికి తిరిగి మన మనస్సులో ఏదో ఒక అసంతృప్తి ఆ పరమాత్మను సరిగ్గా చూడలేదనే సంశయము కలుగుచునే ఉండును. కాని కేవలము రెండు కళ్ళుమాత్రమే కల్గియున్న ఆ గురుమూర్తి చూచుటకు సామాన్యునివలె ఉన్నప్పటికీ వారి దృష్టి మట్టుకు అనంతము. ఆ దృష్టి అనంతకోటి బ్రహ్మాండములో గల ఎంత చిన్న జీవి అయినను ఒకే సమయములో అనేక జీవులపై యావత్ ప్రపంచమంతా ఆ దృష్టి వ్యాపించి ఏ మూల ఏమి జరుగుచున్నదో తెలుసుకొనగల శక్తి సామర్థ్యము కలిగివుండును. కావుననే గురుమూర్తి గంధర్వ నగరమున ఉన్నప్పటికి ఎక్కడో ఒక గృహమున గల విప్రుని గుణమును మరియు ఆ విప్రుని భార్య గుణమును కూడా తెలుసుకునే సామర్థ్యము కలిగినవారు. ఆ గ్రామమున ప్రతిరోజు విప్రులందరికి భోజనము పెట్టుట ఆనవాయితీ. అందరూ ఆ మృష్టాన్నమునకు వెళ్ళిరి. కాని నిష్టగల విప్రుడు మాత్రము అందులకంగీకరంపక పరాన్నము భుజించుట తప్పని మొండికేసెను. కాని అతని భార్య ఆ మృష్టాన్నమునకు వెళ్ళవలెనని కోరిక ఉన్నప్పటికీ తన కోరికనను భర్త యొక్క పట్టుదల వల్ల అణచుకొనెను. ఒకసారి ఆ గ్రామమున గల ధనికుడు ఆ నిష్ఠగల బ్రాహ్మణుని తన భార్యతో కూడా సంతర్ప భోజనమునకు ఆహ్వానించెను. ఆ విప్రుని భార్య తన కోరికను శ్రీ గురుమూర్తి కడ విన్నవించుకొనెను. అంత శ్రీ గురుమూర్తి ఆ విప్రుని పిలిచి తనను ఆహ్వానించిన ధనికుని ఇంట తన భార్యతో కలిసివెళ్ళమని ఆజ్ఞాపించెను. విప్రుడు గురు వాక్యమును ఉల్లంఘించుట తగదని ఉద్దేశ్యముతో భార్యతోకలిసి ధనికుని ఇంట సంతర్ప భోజనమునకై వెళ్ళెను. అక్కడ ఒక చమత్కారము శ్రీ గురుమూర్తి చూపెను. భోజన సమయమందు ఆ విప్రుని భార్య పంక్తిలో కుక్కలు మరియు పందులు వచ్చి భోజనము భుజించుట ఆ సంఘటన విప్రుని భార్య కంటపడి అంతవరకు తన మనస్సులో ఉన్న కోరిక ఒక్కసారిగా చెదిరిపోయేటట్లు పంక్తి నుండి లేచి వెళ్ళిపోయెను. జరిగిన సంఘటన తన భర్తకు చెప్పగా ఆ విప్రుడు తన భార్యవలన పరాన్నము విడిచిపెట్టినను చివరకు కుక్క మరియు పందుల ఎంగిలి తినవలసిన వచ్చెనని బాధపడెను. వారిరువురు గురుమూర్తి కడకు

వెళ్ళి జరిగిన వైపరీత్యము తెలుపగా శ్రీ గురుమూర్తి చిరునవ్వు నవ్వెను

మానవేంద్ర! సత్యమతికి దుష్కర మెయ్య,

దెఱుగ నేర్చువాని కిష్టమెయ్య,

దీశభక్తి రతున కీరాని దెయ్యది,

యెఱుకలేని వానికేది కీడ? (శ్రీమద్భాగవతము)

అర్థం: సత్యము, మిథ్య అనే భేదమెరిగిన జ్ఞానికి దేనిపైనను ప్రత్యేకమైనటువంటి ఆసక్తి ఉండదు. పరమాత్మునిపై భక్తి గలవానికి త్యాగము చేయలేని వస్తువేదియు ఉండదు. అజ్ఞానికి ఏది మేలో ఏది కీడో తెలిసికొనలేడు. (వసుదేవుడు తను ఇచ్చిన మాట నిలబెట్టుకొనుటకు దేవకీదేవి ప్రథమ పుత్రుడు ప్రసవించినప్పుడు తన బిడ్డను కంసునికి అప్పగించెను. తన బిడ్డపై ఎటువంటి ఆశ పెట్టుకొనక ఇచ్చినమాట నిలబెట్టవలెనని మోసగించవలెననే దుర్బుద్ధి కూడా కలుగకుండా తన బిడ్డను చంపమని తన శత్రువుకే ఇచ్చెను).

శ్రీ గురుమూర్తి ఆ విప్ర దంపతుల పరిస్థితులను గ్రహించి ఆ విప్రుని భార్యకు పరాన్నము వలన సుఖమెట్లుండునో రుచి చూపించెను. అలాగే ఆ విప్రుని నిష్ఠ పరాన్నము భుజింపననెడి సంకల్పమును ఎట్లు మార్చెనో కూడా గురుమూర్తి రుచి చూపెను. పరాన్నము భుజింపనిచో దైవ మరియు పితృకార్యములకు ఆటంకము కలుగునని శ్రీ గురువు బోధించెను.

పై సంఘటన ద్వారా వేటిపైనను ఇష్టాయిష్టములను పెట్టుకొనరాదని అటువంటివి పెట్టుకొనినను అవి మన చేతిలోనివి కాదని భగవంతుడు వాటిని తారుమారు చేయగలడని గ్రహించవలెను. వసుదేవుడంతటివాడు తన బిడ్డపైనే ఎటువంటి మమకారము పెట్టుకొనక ఇచ్చిన మాట నిలబెట్టుటకు తన బిడ్డనే శత్రువునకు దానము చేసెను. సత్యమంటే భగవంతుని తెలుసుకొనుటయే. మిగిలినవన్నీ మిథ్యయే. సత్యము మరియు మిథ్యకు గల భేదము తెలిసిన జ్ఞానికి ప్రత్యేకముగా వేటిపైనను ఆసక్తి ఉండదు. పరమాత్మపై అనన్యమైన భక్తి ఉన్నవారికి త్యాగం చేయలేని వస్తువేదియు ఉండదు. కాని అజ్ఞానికి మటుకు తనకేది మేలో ఏదికీడో కూడా తెలుసుకొనలేడు. పై సంఘటనలో విప్రుని నిష్ఠ పరాన్నము భుజింపరాదని. కాని తన భార్యకు మటుకు పరాన్నము భుజింపవలెనని ఆశ. అటువంటి మిథ్యలోనున్న వారిరువురికి శ్రీ గురుమూర్తి సత్యమేదో సూచించెను. మరియు వారిరువురికి దేనిపైనను ఆసక్తి ఉండకూడదని కూడా ఋజువుచేసెను. ఆ విప్ర దంపతులకు పరమాత్మునియందు అచంచలమైన భక్తి ఉన్నచో త్యాగము చేయలేని వస్తువేదీ ఈ ప్రపంచమున ఉండదని కూడా ఋజువుచేసెను. కావుననే విప్రుని భార్య తన మనసులో ఎప్పటినుంచో పరాన్నము భుజించవలెననే కోరిక ఉన్నప్పటికీ ఆ సంఘటన ద్వారా కోరిక త్యాగము చేసెను. అట్లే తన భర్తయైన విప్రునికి కూడా పరాన్నము భుజించుట కూడా నిష్ఠగల బ్రాహ్మణునికి త్యాగం చేయించి అదే పరమాత్మ పరాన్నము భుజించేటట్లుచేసెను.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

# అధ్యాయము - 23

**(శ్రీ గురుమూర్తికి భిక్షనిచ్చుట - గురుమూర్తి మహిమచే భాస్కరుడను అతడు 4000 మందికి పైగా భోజనము పెట్టుట)**

పూర్వాధ్యాయమున పరాన్నము తినుటకు ఇష్టంలేని వానిచే పరాన్నము తినుట మరియు పరాన్నము భుజించుట యందు ప్రీతియున్న వానిచే పరాన్నమును మాన్పించుట చిత్రమైన గురుమూర్తి లీలను చూచితిమి. మరి ఈ అధ్యాయమున ఒక దరిద్ర విప్రుడు శ్రీ గురుమూర్తికి భిక్ష ఇవ్వదలచి గురుమూర్తి చిత్రమైన లీలచే గురుమూర్తితో కూడి సుమారు 4000 మందికి పైగా బ్రాహ్మణులకు భోజనము పెట్టించుట చూచెదము.

గంధర్వ నగరమున ప్రతిరోజు బ్రాహ్మణులకు భోజనము పెట్టుచుండిరని ఆ బ్రాహ్మణుల సమారాధన కానిదే మరేదీ భుజించరని అది ఒక నియమముగా సాగుచుండెను. భాస్కరుడనే ఒక దరిద్ర విప్రుడు శ్రీ గురుమూర్తిపై అనన్య భక్తి ఉండుటచే శ్రీ గురువునకు భిక్ష ఇవ్వవలెనని సంకల్పించెను. బియ్యము మరియు ఆయా పదార్థములను ఒక మూట కట్టి గురుమూర్తి ఆజ్ఞకై వేచియుండెను.

లౌకిక మొల్లగనన్నా

లోకించు ప్రపన్నులకును లోబడి కరుణా

లోకములం బోషింతును,

నా కాశ్రితరక్షణములు నైసర్గికముల్ (శ్రీమద్భాగవతము)

అర్థం: లౌకకిమైన జీవితమున గల సమస్త సుఖములను వదిలి తమ చూపును నాపై పెట్టి శరణువేడిన భక్తులను చూచి నేను లొంగిపోయెదను. అట్టివానిని రక్షించుటయే నా కర్తవ్యము. (కృష్ణపరమాత్ముడు ఉద్దవునితో పల్కిన పల్కులు)

భాస్కరుడు తాను తెచ్చిన మూట విప్పక తన మనస్సులోని మూట చెప్పక ప్రతిరోజు బ్రాహ్మణ సమారాధనకు పోయి భోజనము చేస్తూ ఉండుట తక్కిన బ్రాహ్మణులు ఆ భాస్కరుని నిందించి స్వయంపాకము చేసి బ్రాహ్మణులకు పెట్టమని భాస్కరుని దరిద్ర పరిస్థితిని చూసి కూడా తక్కిన బ్రాహ్మణులు ఎగతాళి చేసిరి. అట్టి పరిహాసము చివరకు శ్రీ గురుమూర్తి చెవిన పడెను. శ్రీ గురుమూర్తి భాస్కరుని జీవితమును మరియు అతని లౌకికమైన జీవితమును అందు సర్వ సుఖములు విడిచిపెట్టి భక్తి ప్రేమలతో భాస్కరుని చూపులన్నియు శ్రీ గురుమూర్తిపై కనిపెట్టుకుని శరణువేడుచు ఆ భాస్కరుడు స్వయముగా తనకున్న శక్తితో స్వయంపాకము శ్రీ గురుమూర్తికి అర్పించవలెనన్న ఆకాంక్షతో మూడు మాసముల నుండి వేచియుండుట గమనించిన శ్రీ

గురుమూర్తి ఆ భాస్కరుని భక్తికి లొంగి తన కరుణను ప్రసాదించుటకు మరియు బ్రాహ్మణుల పరిహాసమును నిజము చేసి తన భక్తుని రక్షించుకొనుటకు సిద్ధమయ్యెను. పరమాత్ముని ఆశ్రయించిన భక్తులను రక్షించుట పరమాత్మ యొక్క సహజ కర్తవ్యము అని ఋజువు చేయుటకు గురుమూర్తి సంసిద్ధుడయ్యెను. ఒకరోజు శ్రీ గురుమూర్తి భాస్కరుని పిలిచి తనకు స్వయంపాకము చేసి భిక్ష నిమ్మని కోరుటయేగాక ఆ గంధర్వ నగరమున గల అందరిని సకుటంబముగ భోజనమునకు పిలువమని శ్రీ గురుమూర్తి భాస్కరునికి ఆజ్ఞాపించెను. భాస్కరుడు తన మనస్సులోని కోరిక నెరవేరుతున్నదని సంబరపడవలెనో లేదా తన శక్తికి మించిన కార్యమును గురుమూర్తి తన పరిస్థితి తెలిసికూడా అప్పగించినందుకు బాధపడవలెనో తేల్చుకొనలేకపోయెను.

రక్షణము లేక సాధుడు

రక్షితుడగు సమత జేసి రాయిడులందున్

రక్షణములు వెయి కలిగిన

శిక్షితుడగు ఖలుడు పాపచిత్తుండగుటన్ (శ్రీ మద్భాగవతము)

అర్థం: సజ్జనుడికి ఆపదలు వచ్చినను రక్షణ లభించును. అటువంటి రక్షణ ప్రత్యేకముగా అతనికి ఎవ్వరును ఏర్పాటు చేయనవసరము లేదు. అతని సజ్జనత్వమే అతనిని రక్షించును. దుర్మార్గులకు స్వయముగా రక్షణ ఏర్పాటు చేసుకొనినను వాని పాపబుద్ధి అతనిని శిక్షించును. భాస్కరుని గురుభక్తి ఎంతో గొప్పనయినది. అతని పరిస్థితి ఎరిగినను గురువాక్యములపై అనన్యమైన నమ్మకము కలిగియుండుటచే జరగబోవునదాని గురించి ఆలోచించక వంటచేసి గంధర్వనగరమున గల విప్రులందరిని గురువాజ్ఞను శిరసావహించి భోజనమునకు ఆహ్వానించెను. విప్రులందరు భాస్కరునిపై ద్వేషమున్నను గురువాజ్ఞను పాటించుటకు భాస్కరుని ఆహ్వానమును మన్నించి వచ్చెను. సుమారు 4000 మందికి పైగా ఆకులను శ్రీ గురుమూర్తి వేయించెను. శ్రీ గురుమూర్తి భాస్కరుడు చేసిన వంటను తెప్పించి ఒక చక్కటి వస్త్రమును పదార్థములపై కప్పెను. శ్రీ గురుమూర్తి మంత్రజలమును ఆ వంటపై చల్లెను. భాస్కరుని పిలిచి తాను వండిన పదార్థములను వేరొక పాత్రలో తీసుకుని వడ్డించమని ఆజ్ఞాపించెను. నిజానికి భాస్కరుడు తనకున్న శక్తితో చాలా కొద్ది అన్నమును చేసెను. కాని గురువాక్యములపై దృఢ విశ్వాసముతో, భక్తితో తాను వండినది చాలా కొంచెమైనను గురువు చెప్పినట్లుగా ధైర్యముతో గ్రామ ప్రజలంధరిని భోజనమునకు పిలిచెను. గురువాజ్ఞ ప్రకారము మరొక గిన్నెలోని పదార్థములను వడ్డించుట ప్రారంభించెను. బ్రాహ్మణులు తృప్తి చెందేంత వరకు వడ్డించుట సాగుతునే ఉన్నది. అన్ని పంక్తులు భుజించిన పిదప మిగిలిన స్త్రీలను పిల్లలను గ్రామస్థులను శూద్రులతో సహా చివరకు కడజాతి వారు కూడా

గురుమూర్తి ప్రసాదము భాస్కరునిచే తినే అవకాశము దొరికినది. ఆ రోజు ఏ ప్రాణికూడా ఉపవశించలేదు. అంతమంది తిన్నను ఇంకా ఎంతో అన్నము మిగిలినది. చివరకు వాటిని జలచరములకు కూడా భాస్కరునిచే గురుమూర్తి పెట్టించెను. అందరూ గురుమూర్తి మహిమను చూచి ఆశ్చర్యము చెందిరి. తన భక్తుడి కోరిక స్వచ్ఛమైనది మరియు భక్తితో కూడినది కావుననే శ్రీ గురుమూర్తి తన భక్తుడైన భాస్కరుని రక్షించుటకు తనపైగల పరిహాసమును తొలగించుటకు పరమాత్ముని అండ ఉన్నచో శక్తిలేని వాడు కూడా కొండంత బలం ఆ పరమాత్ముని లీలచే పొందగలడనే సత్యం ఋజువైనది.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే.

## అధ్యాయము 24

**(రాబోవు జన్మయందు పుత్రప్రాప్తి కల్గించమని 60 సం॥లు నిండిన గంగ అనే గొడ్రాలి కోరికను శ్రీ గురుమూర్తి ఈ జన్మమునందే తీర్చుట - అశ్వత్థ వృక్ష పూజ మరియు మహిమ)**

సోమనాధుడు మరియు గంగ అనే దంపతులు కలరు. సోమనాథుని భార్యపేరు గంగ. ఆమెకు 60 సం॥లు నిండినను పుత్రప్రాప్తి లేక నిరాశతో కాలము గడుపుచుండెను. ఆ దంపతులిరువురు గంధర్వ నగరమునందలి ప్రజలు గొడ్రాలని గంగను హేళన చేయుట కారణంగా దుఃఖించుచుండిరి. వారి బాధను శ్రీ గురుమూర్తి కడ విన్నవించుకొనుటకు ఆశతో బయలుదేరిరి. గంగ శ్రీ గురుమూర్తి పాదములపై పడి అనునిత్యము నీరాజనముతో ఉపచారములు చేయుచు కాలము గడిపెను. ఒకనాడు శ్రీ గురుమూర్తి గంగ మనోభావమును మరియు గంగ చేసే ఉపచారములకు గల కారణమును ప్రశ్నించెను. అంత గంగ తనకు 60 సం॥లు నిండినను పిల్లలు లేరని తన మనోవాంఛ కనీసం వచ్చే జన్మలోనైనా నెరవేర్చమని సద్గుణములు గల గంగ శ్రీ గురుమూర్తి కడ వేడుకొనెను.

"కర్మతంత్రుడగుచు; గమలాక్షుగొల్చుచు
నుభయ నియత వృత్తి నుండెనేని,
జెడును కర్మమెల్ల శిథిలమై మెల్లనఁ
బ్రబలమైన విష్ణుభక్తి చెడదు" (శ్రీమద్భాగవతము)

అర్థం: దుర్బుద్ధితో ఉన్నవారికి దారా పుత్రాదులతోపాటు సర్వ ఐశ్వర్యములు తొలగిపోవును. సద్గుణములతో జీవించు వారికి సకలైశ్వర్యములు నిలబడును. విష్ణుసేవచేయు సజ్జనులకు అసలు చెడిపోవుట అనేదే ఉండదు.

మానవులు తమ కర్మలను అనుభవింపక తప్పదు. అట్టి కర్మములను మాపుకొనుటకు తమ చిత్తమును శుద్ధి చేసుకుని శ్రీ మహావిష్ణువును స్మరిస్తూ సేవించినచో లౌకిక జీవితముతోపాటు భక్తిమయ జీవితము ఏర్పడి ఆ రెండు జీవితములను నిష్ఠగా ఆచరించువారికి తప్పక కర్మ బంధము సడలి భక్తి బలమవును. గంగ సద్గుణములతో జీవించినది. గంధర్వ నగర ప్రజలు ఆమెను గొడ్రాలు అని హేళన చేసినను అన్న వారిపై ఎటువంటి చర్యలనుగాని ప్రతిమాటకాని చెప్పక తనలో తాను బాధపడి విష్ణుస్వరూపుడైన శ్రీ గురుమూర్తియే శరణమని తలంచి అనునిత్యము శ్రీ గురుమూర్తిని నీరాజనముతో ఉపచారములు చేసెను. ఇంతటి సద్గుణములు గల గంగ శ్రీ గురుమూర్తి ఏ వరము కావలెనో కోరుకొమ్మని అడిగినప్పుడు నిస్వార్థ బుద్ధితో సద్గుణముగల ఆ గంగ తనకు కనీసము వచ్చే జన్మలో సంతానము కలుగచేయమని కోరిందే తప్ప స్వార్థముతో తనకు ఈ

జన్మమందే సంతానము కలుగవలెనని గురుమూర్తిని ఆశించలేదు. కావుననే శ్రీ గురుమూర్తి సంతుష్టుడయ్యెను. గంగ తన చిత్తమును శుద్ధి చేసుకుని శ్రీ గురుమూర్తినే సేవించుచు తన లౌకిక మరియు భక్తిమయ రెండు జీవితములను నిష్టగా ఆచరించుట చేత భక్తి బలవత్తరమగుటచే శ్రీ గురుమూర్తి గంగ కర్మను తీసివేయుటకు నిశ్చయించుకొనెను. గంగతో శ్రీ గురుమూర్తి తనకు ఈ జన్మమందే ఒక పుత్రుని మరియు పుత్రికను ప్రసాదించెదనని తన నివాసము, అశ్వత్థ వృక్షము కావున అశ్వత్థ పూజ చేయమని ఆజ్ఞాపించెను. శ్రీ గురుమూర్తి గంగతో అశ్వత్థ మహిమను బోధించెను. సాక్షాత్తు బ్రహ్మదేవుడు నారద మహర్షికి బోధించిన ఆ అశ్వత్థ మహిమను నారదుడు ఋషులకు వివరించెను.

1. అశ్వత్థ వృక్ష మూలమున బ్రహ్మ మధ్యమున విష్ణువు, అగ్రమున శివుడు నివశించెదరు.
2. త్రిమూర్తులు నివశించు మహావృక్షమిది.
3. ఉత్తర కొమ్మలలో బ్రహ్మ, పశ్చిమ శాఖలలో విష్ణువు మరియు దక్షిణ కొమ్మలలో శివుడు కలరు.
4. ఇంద్రాది దేవతలు తూర్పున గల కొమ్మలందు కలరు.
5. రుద్రులు మొదలగు దేవతలు అన్ని శాఖలందు కలరు.
6. చిగుళ్ళంతయు ఋషులు, బ్రాహ్మణులు, గోవులు మొదలగు వారు కలరు.
7. సప్త సముద్రములు కలవు.
8. అశ్వత్థ వృక్షము ప్రాతఃకాలమున భక్తిశ్రద్ధలతో పూజించవలెను.
9. పూజ చేయువారు శుచితో స్నానము చేసి అశ్వత్థ వృక్షమును ఏడు సార్లు స్నానము చేయించి పూజింపవలెను.
10. అశ్వత్థ వృక్షమునకు అష్టభుజములు కలవు.
11. వస్త్రమునుగాని, నూలుపోగుగాని ఆ వృక్షమునకు కట్టి కోరుకున్నచో కోరిక నెరవేరును.
12. అశ్వత్థ వృక్షమునకు ప్రదక్షిణ చాలా విశేషము.
13. శనివారము పూజించిన మృత్యువుని కూడా జయించవచ్చును.
14. గురువారం అశ్వత్థ వృక్ష నీడ పడిన జలమందు స్నానము చేసిన సమస్త పాపములు తొలగును.

“ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపలనుండు లీనమై,

యెవ్వనియందు డిందు బరమేశ్వరుడెవ్వడు మూల కారణం

బెవ్వ, డనాది మధ్యలయుడెవ్వడు సర్వము దానమైన వా

దెవ్వడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్"          (శ్రీమద్భాగవతము)

అర్థం: సృష్టి అంతటికి కారణం పరమాత్మయే పరమాత్మకు మొదలు, ఉండుట మరియు అంతరించుట ఉండవు. పరమాత్మ తనంతట తానే ఉండును. కనుక అన్నింటి యందును అన్ని స్థితులలోను ఆ పరమాత్మ వ్యాపించి యుండును. అట్టి పరమాత్మను శరణు కోరుచున్నాడు.

పరమాత్మ అన్నింటి యందును అన్ని స్థితులలోను వ్యాపించి ఉండేవారు కనుక పరమాత్మ స్వరూపుడైన శ్రీ గురుమూర్తి అశ్వత్థ వృక్షమందు కూడా కలడు. అట్టి పరమాత్మ తాను అంతట కలడనే సత్యాన్ని ఋజువు చేయుటకై పరమాత్ముడైన శ్రీ గురుమూర్తి గంగ యొక్క మనోవాంఛ తీరుటకు అశ్వత్థ వృక్షమును పూజించమని ఆజ్ఞాపించెను. గంగ గుర్వాజ్ఞను పాటించెను. భక్తి శ్రద్ధలతో కొన్ని దినములు చేసిన పిదప ఒక యోగి గంగ స్వప్నమందు దర్శనమిచ్చి, గంధర్వ నగరమున గల శ్రీ గురుమూర్తి కడకు వెళ్ళి తాను నిత్యము అశ్వత్థ వృక్షమునకు చేసే ప్రదక్షిణ గురుమూర్తికి చేయమని గురుమూర్తి ఏమి ఇచ్చినా ప్రసాదముగా స్వీకరించినచో తన మనోభీష్టం నెరువేరునని యోగి చెప్పి అదృశ్యుడయ్యెను. గంగ శ్రీ గురుమూర్తి కడకు వెళ్ళి స్వప్నములో యోగి చెప్పినట్లుగా చేసెను. శ్రీ గురుమూర్తి గంగకు రెండు ఫలములు ఇచ్చి ఆశీర్వదించెను. గంగ భక్తి శ్రద్ధలతో భుజించిన ఆ రెండు ఫలములే ఒక పుత్రుడు, ఒక పుత్రికలై జన్మించెను. 60 సం॥లు నిండిన వృద్ధురాలికి ఈ జన్మమందే శ్రీ గురుమూర్తి అనుగ్రహము కల్గుట ఎంత ఆశ్చర్యకర విషయమో కదా! శ్రీ గురుమూర్తి తలచినచో జరుగనిది ఏమున్నదీ సృష్టియందు.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము 25

**(భీమా నదీ తీరమున పూర్వ భాగమున శ్రీ గురుమూర్తి ఆజ్ఞచే నరహరి ఒక ఎండు కట్టెను నాటుట - నాటిన ఆ కట్టె చిగుళ్ళు వచ్చుట - నరహరికి కుష్ఠురోగము తగ్గుట)**

60 సం॥లు నిండిన ఒక గొడ్రాలికి సంతానము కల్గించెనని తెలుసుకున్నాము. ఈ అధ్యాయములో భయంకరమైన కుష్ఠువ్యాధితో బాధపడుచున్న భక్తుడికి అభయమిచ్చి శ్రీ గురుమూర్తి ఆ భక్తుడి వ్యాధిని ఒక చిత్రమైన పద్ధతిలో నివారించిన సంఘటన తెలుసుకుందాము. నరహరి అను ఒక ద్విజుడు కుష్ఠువ్యాధితో బాధపడుచు శ్రీ గురుమూర్తి యొక్క మహిమలను తెలుసుకుని ఆశతో గంధర్వ నగరము చేరి శ్రీ గురుమూర్తి పాదములపై పడి ఆర్తితో తన రోగమును గురించి వెల్లడి చేసుకొనెను. తనకు గల వ్యాధివల్ల గ్రామములోని జనులెవ్వరు తనను దరికి చేరనీయక వెలివేసినట్లుగా చూచుచున్నారని శ్రీగురుమూర్తికి విన్నపించుకొనెను. అంత శ్రీ గురుమూర్తి నరహరి పూర్వజన్మలో పెక్కు దోషములు చేయుట చేత ఈ జన్మమందు అనుభవించు చున్నాడని ఆ దోషము పోవలెనన్న ఒక ఎండు కట్టెను సంగమ స్థానమునకు (భీమా నదీతీరము) పూర్వభాగమున నాటమని అనునిత్యము నరహరిని సంగమ స్నానముచేసి ఆ ఎండుకట్టెకు మూడు వేళలా నీరుపోసి ఏ రోజైతే ఆ కట్టెకు చిగుళ్ళు వచ్చునో ఆ రోజే తన దోషములు తొలగి వ్యాధి నివారణ అగునని శ్రీ గురుమూర్తి నరహరికి చెప్పెను. ఎండుకట్టె ఏమిటి? చిగుళ్లు వేయుట ఏమిటి? ఊహించలేని విషయమిది. ఐనా నరహరి గురువాక్యములే సత్యమని శ్రద్ధతో శ్రీ గురుమూర్తిపై గల అనన్యమైన ప్రేమాభక్తితో గురుమూర్తి చెప్పినట్లుగా ఒక ఎండు కట్టెను సంగమ స్థానమున పూర్వభాగమున నాటెను. అనునిత్యము శ్రీ గురుమూర్తిని తలచుచు భక్తితో సంగమమునందు స్నానము చేసి ప్రతిరోజు మూడువేళలా ఆ ఎండుకట్టెను నీరుపోయుచూ ఓరిమి కలిగి ఆ కట్టె చిగుళ్ళు తప్పక వచ్చునని శ్రీ గురుమూర్తి వాక్యములపై పూర్తి విశ్వాసము కలిగి ఎంతో ఓరిమితో వేచియుండెను.

తాలిమి మనకును ధర్మము,

తాలిమి మూలంబు ధర్మతత్త్వంబునకున్,

దాలిమి గలదని యీశుం

డేలించును బ్రహ్మపదము నెల్లన్ మనలన్ (శ్రీమద్భాగవతము)

అర్థం: బ్రాహ్మణులకు ఓర్పు ఒక్కటే ధర్మము. ఈ ఓర్పు ప్రధాన లక్షణము. అది మనలో ఉన్నది కనుకనే పరమేశ్వరుడు బ్రహ్మ పదవిపై మనకు ఆధిపత్యమిచ్చినాడు. ఓరిమియున్నచోట సంపదలుండును. (పరశురాముడు కార్త్యవీరుని హతమార్చిన పిదప కామధేనువుతో తన తండ్రియైన జమదగ్ని ఆశ్రమమునకు తిరిగివచ్చినపుడు పరశురాముడు తన పరాక్రమమును తండ్రికి చెప్పగా తన తండ్రి జమదగ్ని పరశురామునితో పల్కిన పలుకులివి)

అమర(శేణికి నెల్ల జ(క్రి ముఖరుండా చ(క్రి ధర్మంబు నం
దమరున్ గోవులు భూమి దేవులు దితి క్షామ్నాయ కారుణ్య స
త్యములున్ యాగతపోదమంబులును (శద్ధా శాంతులున్ విష్ణు దే
హము, లిన్నింటిని సంహరించిన నతండంతంబు నుంరి బొందెడిన్ (శ్రీమద్భాగవతము)

అర్థం : గోవులు, (బాహ్మణులు, వేదములు, ఓరిమి, కరుణ, సత్యము, శాంతి, ని(గహము, (శద్ధ, యజ్ఞము మొదలైనవన్ని కలిసి మహావిష్ణువు శరీరముగా పనిచేయును. వీటిని నాశనము చేసినచో విష్ణువు కూడా అదృశ్యమవును.

శ్రీ గురుమూర్తి ఆజ్ఞ ఎంతో విడ్డూరముగా ఉన్నప్పటికి నరహరి గురుమూర్తి వాక్యములను ధర్మముగా పాటించి ఓర్పు ఒక్కటే ధర్మమని అటువంటి ఓర్పు (ప్రధాన లక్షణముగా తనలో ఉంచుకుని శ్రీ గురుమూర్తిపై విశ్వాసముంచి (బహ్మ పదవిపై ఆధిపత్యము లభించుటకు అర్హతను పొందినాడు. గంధర్వ నగర (ప్రజలు నరహరిచేసే మూఢ నమ్మకము చూసి నరహరిని ఒక మూర్ఖుడిగా భావించి ఎండు కట్టె చిగుళ్ళు వేయుట అసంభవమని తలచి నరహరి చేసే ఆ ఓర్పు యజ్ఞమును ఆపమని సలహా ఇచ్చిరి. కాని నరహరి తన ఓరిమి ధర్మమును విడువలేదు. విశ్వాసమును కోల్పోనూలేదు. ఒకరోజు శ్రీ గురుమూర్తి అతని భక్తికి ఓరిమికి సంతసించి సంగమస్థానమునకుపోయి కుష్ఠరోగియైన నరహరిని చూచి శ్రీ గురుమూర్తి తన కమండలములోని నీరుని తీసి ఎండు కట్టెపై చల్లెను. ఎండుకట్టెనుండి తక్షణమే చిగుళ్లు వచ్చెను. ఆ ఎండు కట్టె ఔదుంబర వృక్షమయ్యెను. గంధర్వ నగర (ప్రజలు గురుమూర్తి మహిమను మరియు నరహరి ఓరిమిని చూచి ఆశ్చర్యపోయెను. నరహరి తన ఓరిమి గురువాక్యములే సత్యమనే భావన మరియు అతని శమము దమము అన్నియు శ్రీ గురుమూర్తి యొక్క శరీరముగా పనిచేయుచుండెనని వాటిలో ఏ ఒక్కటైనను వదిలినచో శ్రీ గురుమూర్తి అదృశ్యమయ్యెదడని భావించి వేటిని వదలక విశ్వాసముతో ఉండెను. కనుకనే శ్రీ గురుమూర్తి కటాక్షము లభించెను. తన కుష్ఠరోగము ఒక్కసారిగ మాయమయ్యెను. పసిడి ఛాయతో కళకళలాడెను. గురుమూర్తి లీలను తలచి నరహరి శ్రీ గురుమూర్తి పాదములపై పడెను. అంత శ్రీ గురుమూర్తి సర్వసంపదలను నరహరికి (ప్రసాదించెను. ఓరిమి ఉన్నచోట సంపదలుండుననే సత్యాన్ని కూడా గురుమూర్తి ఋజువు చేసెను. ఆనాటినుండి నరహరి శ్రీ గురుమూర్తికి (ప్రియ భక్తుడయ్యెను. గురుమూర్తి ఆశీర్వచనముచే నరహరి వంశమున ఎవరు జన్మించినను వారుకూడా శ్రీ గురుమూర్తికి భక్తులయ్యెను.

శ్రీ గురుమూర్తి రాజం శరణం (ప్రపద్యే

## అధ్యాయము - 26

**(నాయందు దృఢమైన భక్తి ఉన్నయెడల నా దాస్యము అంగీకరింపుము అని సాయందేవుని శ్రీ గురుమూర్తి హెచ్చరించుట)**

శ్రీ గురుమూర్తి గంధర్వ నగరమున ఉన్నరోజులలోనే ఉత్తర కంచి నివాసియగు సాయందేవుడనే అతను శ్రీ గురుమూర్తి మహిమలను విని గంధర్వనగరము చేరి శ్రీ గురుమూర్తి పాదములపై పడి శ్రీ గురుమూర్తి చరణములను సేవింపవలెనని దృఢ నిశ్చయముతోను మరియు గురుమూర్తికి దాస్యము చేయుటకు సంకల్పించి తన కోరికను గురుమూర్తికి చెప్పెను.

నీ పాదకమల సేవయు,

నీ పాదార్చకుల తోడ నెయ్యమును, నితాం

తా పారభూతదయయును

దాపస మందార నాకు దయసేయగదే (శ్రీమద్భాగవతము)

అర్థం : నీ పాద పద్మములను అనునిత్యము సేవించుట ఆ పాదములనే నమ్మిన భక్తులతో నాకు స్నేహము కల్పించుట ఆపై అపారమైన భూతదయ నాయందు కల్పించమని కోరుచున్నాను. (శ్రీ కృష్ణపరమాత్ముడు సుదాముని వరము కోరుకొమ్మన్నపుడు సుదాముడు పలికిన పల్కులు)

సాయందేవుడు, సుదాముడు ఆ కృష్ణ పరమాత్మను కోరిన విధముగనే శ్రీ గురుమూర్తి చరణములను సేవింపవలెనని మరియు శ్రీ గురుమూర్తికి దాస్యము చేయవలెనని వరము కోరెను. శ్రీ గురుమూర్తి సాయందేవుని మాటలు విని తనకు సేవ చేయుట ఎంతో కఠినమని తన నివాసము స్థిరముగా ఉండదని కావున కష్టాలను ఎదుర్కొనవలెనని గురుమూర్తి సాయందేవునికి హితబోధ చేసెను. సాయందేవుడు తన పట్టును వదలకపోవుటచే శ్రీ గురుమూర్తి దృఢమైన భక్తి ఉన్నచో దాస్యము చేయవచ్చునని సాయందేవుని హెచ్చరించెను. కొన్నిరోజులు గడిచిన పిదప సాయందేవుని గురుమూర్తి పరీక్షింప దలచెను. భయంకరమైన గాలివీచగా ఆ గాలి దుమారము వలన వర్షము అకస్మాత్తుగా కురిసెను. సాయందేవుడు ఆ వర్షమును లెక్కచేయక గురుమూర్తిని ఒక వస్త్రముచే కప్పి గురుమూర్తి సేవకు భంగం కలుగకుండా రెండు ఝాములు వేచియుండెను. గురుమూర్తి సాయందేవుని మరియొక పరీక్ష పెట్టదలచి ఆ భయంకర చలి వర్షములో మఠమునకు పోయి అగ్నిని తెమ్మని తాను వెళ్లి వచ్చే మార్గములో ప్రక్కలు చూడరాదని హెచ్చరించి పంపెను. గురువాజ్ఞను అలాగే పాటించి సాయందేవుడు శ్రీ గురువుని ధ్యానించుచు ప్రక్కలు చూడకుండా వెళ్ళి మఠమునందు గల అగ్నిని తీసుకుని వచ్చి వచ్చే

దారిలో కొంతదూరము పయనించిన పిదప శ్రీ గురుమూర్తి తనకు ఇరుప్రక్కల ఎందుకు చూడరాదో అని ఆదేశించెనో గల కారణము తెలుసుకొనవలెననే కుతూహలముతో సాయందేవుడు వచ్చు మార్గములో రెండు ప్రక్కల చూడగా రెండు భయంకరమైన సర్పములు సాయందేవుని అనుసరించుచు వచ్చుచుండెను.

ధ్యానాకర్ణణ దర్శన

గానంబుల నా తలంపు గలిగిన జాలున్

బూనెదరు కృతార్థత్వము

మానవతుర్ చనుడు మరలి మందిరములకున్ (శ్రీమద్భావగవతము)

అర్థం : నా సాన్నిధ్యము అనుభవించవలెనన్న శారీరకముగా అక్కరలేదు. నన్ను ధ్యానించి నా మాటలు విని గొంతెత్తి నా గురించి గానము చేసి మొదలైన ఏ ఒక్క మార్గమైనను తన మనసులో నిలుపుకొన్న కృతార్థులగుదురు. (కృష్ణ పరమాత్ముడు గోపికలతో పలికిన పలుకులు)

సాయందేవుడు ఆ మహా సర్పములను చూచి భయపడి పరుగెత్తుతు అటువంటి స్థితిలో కూడా తాను కోరుకున్న శ్రీ గురుమూర్తి పాదములపై దృఢ విశ్వాసమునుంచి గురుమూర్తి పాదములను ధ్యానించుచు సంగమము కడ గురుమూర్తి కడకు వచ్చి తాను తెచ్చిన అగ్నిని వెలిగించెను. ఆ మహా సర్పములు కూడా శ్రీ గురుమూర్తి కడకు వచ్చి ప్రణామము చేసి వెళ్ళిపోయెను. సాయందేవుడు తాను నమ్ముకున్న శ్రీ గురుమూర్తి శారీరకముగా తనతోపాటు మఠమునుండి అగ్నిని తెచ్చుటకు రాకపోయినను సాయందేవుడు గురుమూర్తిని తాను వెళ్ళివచ్చు ప్రయాణములో ధ్యానించుటచే మరియు గురుమూర్తి పాదములను తన మనస్సులో నిలుపుకొనుటచే కృతార్థుడయ్యెను. కావుననే శ్రీ గురుమూర్తి అంతటి భయంకర గాలివానలో తన భక్తుడైన సాయందేవుని తన రాకపోకకు సహాయానికై ఆ మహాసర్పములను శ్రీ గురుమూర్తి స్వయముగా పంపెను. ఈ విషయము తన భక్తుడికి కూడా గురుమూర్తి చెప్పి సాయందేవునితో గురుమూర్తిని సేవించుటవల్ల ఇటువంటి కష్టాలు ఎదుర్కొనవలసి వచ్చునని గురుమూర్తి తన శిష్యుడైన సాయందేవునికి గురుభక్తిని గురించి ఉపదేశించెను. అంత సాయందేవుడు ఆనందముతో గురుమూర్తిని స్తుతించెను. అంత గురుమూర్తి సాయందేవుని ఆశీర్వదించి సిరిసంపదలు కలుగునని మ్లేచ్ఛ సేవ చేయవద్దని తన కుటుంబము సిరిసంపదలతో కళకళలాడునని శ్రీ గురుమూర్తి సాయందేవుని ఆశీర్వదించెను.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 27

### (గురుమూర్తి నివాసమే శ్రీశైలము - శ్రీ గురుమూర్తియే మల్లికార్జునుడు)

శ్రీ గురుమూర్తి మహావిష్ణువు అవతారమని విష్ణుతత్త్వమును చాలాచోట్ల శ్రీ గురుమూర్తి చూపించెనని తెలుసుకుంటిమి. అయితే శ్రీ గురుమూర్తి సాక్షాత్తు త్రిమూర్తి అవతారము అనగా బ్రహ్మ, విష్ణువు మరియు మహేశ్వరులు కలిసిన ఏకైక రూపమైన శ్రీ దత్తుడు మహూరి నివాసియగు గోపీనాథుని పుత్రుడైన దత్తుడను వానిని చనిపోయిన పిదప కూడా శ్రీ గురుమూర్తి తన మహిమచే బ్రతికించెను. తలరాతను మార్చి తిరిగి ప్రాణం పోసిన శ్రీ గురుమూర్తి బ్రహ్మదేవుడని ఋజువైనది. శ్రీ మహావిష్ణు అవతారముగా ఋజువు చేయుటకు ఎన్నో మహిమలను చూపుటయేకాక ఔదుంబర వృక్షమన్న శ్రీ గురుమూర్తికి ఎంతో ప్రీతి. కారణము మహావిష్ణు అవతారమైన నరసింహస్వామి తన భక్తుడైన ప్రహ్లాదుని రక్షించుటకు ఉగ్రరూపుడై హిరణ్యకశిపుడిని చీల్చినపుడు స్వామి చేతివ్రేళ్ళు విషపూరితమై మండుచుండగా ఔదుంబర ఫలాలు స్వామి వేళ్ళకు లక్ష్మీదేవి గ్రుచ్చి ఉపశమనము కలిగించెను. మహావిష్ణువు తనకు ఉపశమనము కలిగించిన ఔదుంబర వృక్షమంటే ఎంతో ప్రీతి. శ్రీ గురుమూర్తి సాక్షాత్తు విష్ణు స్వరూపుడు. కావుననే ఔదుంబరమన్న వారికి ప్రీతి. ఇక త్రిమూర్తులలో మిగిలిన శివుని గురించి మరియు శ్రీ గురుమూర్తి సాక్షాత్తు మల్లికార్జునుడే అని చూద్దాం.

శ్రీ గురుమూర్తి నివాసమును అనునిత్యము శుభ్రము చేయుటకు 'తంతుకుడు' అనే అతను కలదు. అతని పని ప్రతిరోజు గురుమూర్తి నివాసమును శుభ్రముచేసి స్వామికి నమస్కరించు చుండెడివాడు. గురుమూర్తి అనిన తంతుకుడికి అనన్యమైన భక్తి. ఒక శివరాత్రినాడు తంతుకుడి బంధువులు శ్రీశైలమునకు బయలుదేరుతూ తంతుకుడిని కూడా ఆహ్వానించెను. కాని శ్రీ గురుమూర్తి నివాసమే శ్రీశైలమని గురుమూర్తియే సాక్షాత్తు మల్లికార్జునుడని తలచిన తంతుకుడు బంధువులతో యాత్రచేయక గురుమూర్తి నివాసమునందే యుండెను.

సహస్రం వర్తంతే - జగతి విభుధాః క్షుద్రఫలదాః

నమన్యేస్వప్నే వా - తదను సరణం తత్కృత ఫలమ్ ।

హరిబ్రహ్మదీనా - మపి నికట భాజా మ సులభం

చిరం యాచేశంభో ! శివ తవ పదాంభోజ భజనమ్ (శివానందలహరి)

అర్థం : కలలోనైనా స్వల్ప ఫలమిలిచ్చెడి దేవతలను వారి సేవనుగాని వారిచ్చే ఫలములను గాని స్మరింపను. బ్రహ్మేంద్రాదులకును దొరకుటకు అతికష్టమైన ఓ శంకరా నీ పాద పద్మముల సేవనే చిరకాలము వేడుకొనుచున్నాడు.

గభీరే కాసారే – విశతి విజనే ఘోర విపినే

విశాలే శైలే చ – భ్రమతి కుసుమార్థం జడమతిః ।

సమర్ప్యైకం చేత – స్సరసిజ ముమానాథ! భవతే

సుఖేనా వస్థాతుం – జన ఇహ న జానాతి కిమహో (శివానందలహరి)

అర్థం : పుష్పముల కోసము అనేక ప్రదేశములలో చెరువులు, అరణ్యము కొండలు మొదలగున్న పరిసరములలో మనుజుడు కుతూహలముతో తిరుగుచున్నాడు. అదే మనుజుడు తన మనస్సనెడి ఒకే ఒక పుష్పము ఆ ఈశ్వరునికి సమర్పించి సుఖముగా ఉండుటను గమనింపలేకున్నాడు.

తంతుకుడు తన బంధువులు మహాశివరాత్రి పర్వదినమున శ్రీశైల క్షేత్రమునకు ఆహ్వానించినను తంతుకుడు వారి ఆహ్వానమును తిరస్కరించెను. కారణం శ్రీ గురుమూర్తి నివాసమే శ్రీశైల క్షేత్రమని శ్రీ గురుమూర్తియే సాక్షాత్తు మల్లికార్జునుడని అటువంటి గురుమూర్తి పాద పద్మములే సత్యమని బ్రహ్మేంద్రాదులకు కూడా దొరకని శ్రీ గురుమూర్తి పాదపద్మముల సేవనే తంతుకుడు కోరియున్నాడు. అటువంటి ఈశ్వరుని అవతారమైన గురుమూర్తికి తంతుకుడు తన మనస్సనెడి ఒకే ఒక పుష్పమును సమర్పించుకొనెను. ఎక్కడ ఉన్నవాడు అక్కడే ఉండి ఎటువంటి యాత్రలు కోరుకొనలేదు. కావుననే శ్రీ గురుమూర్తి తంతుకుని మనస్సులోని దాగియున్న సర్వయాత్రలను గురుమూర్తి పాదములే అన్న రహస్యమును ఎరింగిన శ్రీ గురుమూర్తి సంతసించి తంతుకుడిని స్వయముగా గురుమూర్తి కనురెప్ప తెరిచేలోపు శ్రీశైలమునకు తన మహిమచే తీసుకెళ్ళి మల్లికార్జుని దర్శనమిప్పించి శ్రీశైలములోని మల్లికార్జున స్థానమున తంతుకునికి గురుమూర్తి దర్శనము లభ్యమయ్యెను. మరుక్షణమే గంధర్వ నగరమును గురుమూర్తి తంతుకుని తిరిగి తెచ్చెను. తంతుకుని బంధువుల వచ్చులోపే ఇదంతా జరిగిపోయెను. శ్రీ గురుమూర్తి తంతుకుడికి పరమాత్మ అనేవాడు ఒక్కడేనని నిరూపించి కాని పుణ్యక్షేత్రము యొక్క స్థాన మహత్యము ఇలపై కాన వచ్చునని బోధించెను. గంధర్వ నగరమున గల కల్లేశ్వర దేవాలయమునకు అనునిత్యము పూజించమని గురుమూర్తి తంతుకునికి ఆదేశించెను. గురుమూర్తి తన మహిమతో తంతుకుడిని కనురెప్ప తెరచులోపు తిరిగి కలేశ్వర దేవాలయమునకు తీసుకుని వెళ్ళి ఈశ్వరదర్శనము కల్పించి తిరిగి తెచ్చెను. జరిగిన వృత్తాంతమంతయు తంతుకుని బంధుమిత్రులకు శ్రీశైల యాత్ర వెళ్ళి వచ్చిన పిదప తంతుకుని ద్వారా తెలుసుకుని తంతుకుని భక్తికి మెచ్చి గురుమూర్తి మహిమకు ఆశ్చర్యచకితులై అందరూ శ్రీ గురుమూర్తిని శరణువేడి పాదములపై పడెను.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము 28

### (కల్లేశ్వరుని స్తుతించే నాలుకతో నరస్తుతిని చేయనన్న ఒక కవి)

పూర్వాధ్యాయమున గురుమూర్తి సాక్షాత్తు పరమశివుడేనని ఋజువైనది. గురుమూర్తి శివుడే అనుటకు మరియొక నిదర్శనము కలదు. నరకేసరి అనే అతను తన పద్యములను శివునిపై వ్రాసి వాటిని కల్లేశ్వరునకు అర్పించు చుండెడివాడు. అతడు శివభక్తుడు. అతని పద్యములను విన్న జనులు సంతసించి తమ ప్రియ గురుమూర్తిపై కూడా పద్యములు వ్రాయమని నరకేసరిని వేడుకొనెను. అంత ఆ నరకేసరి కల్లేశ్వరుని స్తుతించే నాలుకతో నరస్తుతిని చేయనని చెప్పెను. ఒకరోజు నరకేసరి తన స్వప్నమందు శ్రీ గురుమూర్తిని శివలింగమందు ఉండుట కాంచెను. ఆ స్వప్నమునందే నరకేసరి శ్రీ గురుమూర్తిని అర్చించుచుండగా అక్కడి శివలింగము అదృశ్యమైనది. అంత శ్రీ గురుమూర్తి నరకేసరితో కల్లేశ్వరుని స్తుతించే నాలుకతో నరులను ఏల అర్పించుచున్నావని గురుమూర్తి ప్రశ్నించెను. నరకేసరికి వెంటనే మెలకువ వచ్చెను. శ్రీ గురుమూర్తి సాక్షాత్తు పరమశివుడనే సత్యాన్ని తెలుసుకొనెను.

ప్రభుస్త్వం దీనానాం – ఖలుపరమబంధుః పశుపతే!
ప్రముఖ్యో హంతేషా – మపికిముత బంధుత్వ మనయోః
త్వయైవక్షంతవ్యాః – శివమదపరా ధాశ్చ సకలాః
ప్రయత్నాత్కర్తవ్యం – మదవనమియం బంధుసరణిః (శివానందలహరి)

అర్థం : శంకరా! నీవు దీనులను రక్షించువాడవు. వారికి నీవు బంధుడవు. నేను ఆ దీనులలో మొదటివాడను. కావున మన బంధుత్వము చెప్పవలసిన పనిలేదు. నా యొక్క అపరాధమును మన్నించి నన్ను రక్షింపవలెను.

శివుడు బోళాశంకరుడు. అడిగిన వరమును కాదనక ఇచ్చే దయామూర్తి. తన ఆత్మ లింగమునే రాక్షసుడైన రావణాసురుని భక్తిమెచ్చి ఇచ్చి వేసెను. అలాగే భస్మాసురుడనే రాక్షసుడికి కూడా అతని భక్తిమెచ్చి ఇవ్వరాని వరమును కూడా ఇచ్చెను. దేవదానవులు యుద్ధమున పాలసముద్రమును మదించుచుండగా హాలాహలము పుట్టెను. పరమశివుడు జీవరాసులకు మేలు చేయవలెననే సంకల్పముతో ఆ హాలాహలమును మ్రింగివేసెను. ఆ గరళమును శివుడు తన కంఠములోనే ఉంచుటచేత నల్లనిమచ్చ ఏర్పడి అదియొక ఆభరణముగా ప్రసాదించెను.

అటువంటి పరమశివునకు నరకేసరి శివునిపై పద్యములు వ్రాసి శివుని కరుణకు పాత్రుడాయెను. శివుడు దీనులకు పరమ బంధువు. నరకేసరి శివభక్తుడు. కావున శివుని పూజించే దీనులలో మొదటివాడుగా

భావించినాడు కనుకనే ఈశ్వరుడు తప్ప ఇంకెవ్వరూ లేరని అట్టి ఈశ్వరుని స్తుతించే నాలుకతో నరులను స్తుతించననే దృఢ సంకల్పముతో ఉన్న ఆ పరమభక్తుడికి శ్రీ గురుమూర్తి తన స్వప్నమున దర్శనమిచ్చి శివుడు మరియు గురుమూర్తి ఒక్కరేనన్న నిజాన్ని చూపించుటచే నరకేసరి తాను చేసిన తప్పును మన్నించమని పరమశివుని వేడుకొనెను. తన అపరాధమునకు పశ్చాత్తాప పడి గురుమూర్తి కడకు వెళ్ళి గురుమూర్తి చరణములను పట్టుకుని జరిగిన విషయమంతయు శ్రీ గురుమూర్తికి విన్నవించుకొని తన అపరాధమును మన్నించమని శ్రీ గురుమూర్తిపై అనేక పద్యములతో స్తుతించెను. శ్రీ గురుమూర్తి అతని భక్తికి సంతసించి అనునిత్యము శంకరుడిని భక్తితో పూజించమని ఆ శంకరునిలో గురుమూర్తి కూడా ఉండెదడని అభయమిచ్చి ఆశీర్వదించెను. ఆనాటినుండి నరకేసరి గంధర్వ పురమున ఉండి శ్రీ గురుమూర్తి సాక్షాత్తు శివుడేనని గురుమూర్తిపై అనేక కీర్తనలను వ్రాసెను.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 29

**(శ్వేతకుష్టుతో బాధపడుతున్న నందిశర్మకు సాక్షాత్తు భవాని శ్రీగురుమూర్తిని దర్శింపమని ఆజ్ఞనిచ్చుట)**

శ్వేతకుష్టుతో బాధపడుచున్న నందిశర్మ అనే బ్రాహ్మణుడు తుల్జాపురమున భవానిని పూజిస్తూ తన వ్యాధి నివారణకై తన పూజను కొనసాగిస్తూ మూడు సంవత్సరముల కాలము గడిపెను. ఒకనాటి రాత్రి తుల్జాభవాని నందిశర్మ స్వప్నమునందు దర్శనమిచ్చి చందలాపరమేశ్వరి కడకు పొమ్మని ఆజ్ఞాపించెను. నందిశర్మ తుల్జాభవాని ఆజ్ఞమేరకు చందలాపరమేశ్వరి కడకు వెళ్లి ఏడు మాసములు ఘోరముగా ఉపవసించి, ఆ పరమేశ్వరిని పూజించెను. ఒకనాటి రాత్రి తుల్జాభవాని వలె చందలాపరమేశ్వరి కూడా నందిశర్మ స్వప్నమునందు దర్శనమిచ్చి, అతనిని గంధర్వనగరమున భిక్షవేషమునగల శ్రీగురుమూర్తి కడకు వెళ్ళమని ఆజ్ఞాపించెను. తుల్జాభవాని ఆజ్ఞమేరకు చందలాపరమేశ్వరి కడకు వచ్చెనని నందిశర్మ చెప్పూ దేవతను ఒదిలి ఒక మానవుని కడకు ఎట్లు వెళ్ళవలెనని నందిశర్మ సందిగ్ధపడెను. అందులో భిక్షువేషమున గల శ్రీగురుమూర్తిని దర్శించుటకు సంకోచించెను.

హరి హరి ! సిరి యురమున గల
హరి హరిహయు కొఱకు దనుజు నడుగన్ జనియెన్;
బరహిత రతమతియుతులగు
దొరలకు నడుగుటలు నొడలి తొడవులు పుడమిన్
(శ్రీమద్భాగవతము)

అర్థం : శ్రీ మహావిష్ణువవతారమైన వామనమూర్తి బలి చక్రవర్తిని యాచించుటకు వచ్చినప్పుడు విష్ణువును ఉద్దేశించి చెప్పిన పద్యమిది. పై శ్లోకమునకు అర్థం విష్ణువంతటివాడే ఒక దానవుని వద్ద ఇంద్రుని కొరకు యాచకుడై పోయెను. ఇతరుల మేలుకొరకు చేసే ఇటువంటి వైపరీత్యాలు అటువంటి మహాత్ములకు భిక్షాటనమైనా అలంకారమే యగును.

తుల్జాభవాని నందిశర్మకు చందలాపరమేశ్వరి కడకు వెళ్ళమని చెప్పెను. కాని చందలా పరమేశ్వరి స్వప్నమునందు నందిశర్మను గంధర్వనగరములోగల భిక్షువేషధారియైన సాక్షాత్తు త్రిమూర్తి అవతారమైన శ్రీగురుమూర్తి కడకు వెళ్లమనెను. ఇక్కడ తుల్జాభవాని మరియు చందలాపరమేశ్వరి వేరు కాదు. జగన్మాత ఆదిశక్తి పరాశక్తి. అటువంటి శక్తి సంపన్నురాలైన ఆ మాత వివిధ రూపాలను దాల్చినది కావున వివిధ నామాలతో వివిధ ప్రదేశాలలో ఉన్నది. కావున తుల్జాభవానికి చందలాపరమేశ్వరికి తేడా లేదు. తుల్జాభవానిని నందిశర్మను చందలాపరమేశ్వరి కడకు వెళ్ళుమనుటకు కారణం ఆ తుల్జాభవాని మరో రూపమైన చందలాపరమేశ్వరి ద్వారా నందిశర్మను శ్రీగురుమూర్తి కడకు వెళ్ళమని చెప్పుటకు కారణమయ్యెను.

నందిశర్మ దేవి ఆజ్ఞతో గంధర్వపురము చేరెను. అంత శ్రీగురుమూర్తి నందిశర్మతో మానవరూపమైన తన వద్దకు సందేహించి వచ్చినాడన్న నిజాన్ని చెప్పెను. నందిశర్మ తన అంతరంగములో దాగియున్న సందేహాన్ని చెప్పిన శ్రీ గురుమూర్తి మహిమ నెరింగి పాదములపై పడెను. గురుమూర్తిని స్తుతించెను. తనకు గల కుష్టువ్యాధిని గురించి శ్రీగురుమూర్తి కడ విన్నవించుకొనెను. తుల్జాభవాని మరియు చందలాపరమేశ్వరి యొక్క ఆజ్ఞను కూడా గురుమూర్తికి నందిశర్మ చెప్పెను. అంత గురుమూర్తి తన భక్తుడైన సోమనాధునితో నందిశర్మను సంగమమునకు పంపించి స్నానము చేయించి అశ్వత్థవృక్షమును పూజింపచేసి అతను కట్టిన తడి వస్త్రమును విడిచి పెట్టింపచేసి ఒక కొత్తవస్త్రమును నందిశర్మకు గురుమూర్తి కట్టించెను. వెంటనే నందిశర్మకు కుష్టువ్యాధి పోయి నూతన శరీరము వచ్చెను. మానవుడు తనకేమి చేయుననే సందిగ్ధముచే ఉన్న ఆ నందిశర్మకు ఒకచోట మాత్రము కొద్దిగా కుష్టువ్యాధి మిగిలెను. ఆ కొంచెము కూడా తొలగించుటకు శ్రీగురుమూర్తి తనను స్తుతింపమనగా నందిశర్మతనకు అక్షరములు రావని చెప్పగా గురుమూర్తి నందిశర్మ నాలుకపై విభూది చల్లగా గురుమూర్తి మహిమచే నందిశర్మ పండితుడయ్యెను. నందిశర్మకు తన సర్వాంగములలో ఎక్కడా కుష్టు కనిపించక నవశరీరధారియై శ్రీగురుమూర్తి దయతో పండితుడై కవీశ్వరుడనే బిరుదును పొందెను.

ఎన్నడు లోకపాలకుల నీ కృపజూడని నీవు నేడు న
న్ను న్నతుజేసి, నా బ్రతుకునోజయు నానతి యిచ్చి కాచి
మన్నన నీ దయారసము మాటల పెద్దతికంబు చాలదే ?
పన్నగ తల్ప ! నిన్నెఱిగి పట్టిన నాపద గల్గనేర్చునే ?
(శ్రీ మద్భాగవతము)

అర్థం : లోకపాలకులగు దేవతలను కరుణింపని నీవు నన్ను కరుణించినావు. తద్వారా నేను గొప్పవాడినై క్రొత్త జీవితము వచ్చినది. ఇంతటి దయ చాలదా! నిన్ను నమ్మినవానికి ఎట్టి ఆపదలు కలుగవు. (బలి చక్రవర్తి వామన దేవుని స్తుతిస్తూ అన్నమాటలు.)

నందిశర్మ తన మనస్సులో దాగియున్న సందిగ్ధమును ఎప్పుడైతే శ్రీగురుమూర్తి బయటపెట్టెనో, నందిశర్మ గురుమూర్తిని సాక్షాత్తు దేవునిగా భావించిఆ గురుమూర్తి దయతో తనకు వచ్చిన కొత్త జీవితమును తలచుకొని గురుమూర్తి వలలనే గొప్ప పండితుడయ్యెనని ఇన్ని కారణములకు గల కారణము గురుమూర్తిని తెలుసుకొనుటవలన మరియు శ్రీగురుమూర్తి అపార దయవలన అన్నీ సంకల్పించినవని నందిశర్మ సత్యాన్ని గ్రహించెను.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 30

**(ధనత్రయోదశినాడు గురుమూర్తి అష్టరూపుడై ఎనిమిది గ్రామములందకు కనిపించుట)**

పరమేశ్వరార్పణముగ

బరజనులకు భిక్షమిడిన బరమ పదమునన్

బరగెద రట తుది, సాక్షా

త్పరమేశ్వరు భిక్షసేయు ఫలమెట్టిదయో ?

(శ్రీమద్భాగవతము)

అర్థం : ఆకలితో నున్న వారికి పరమాత్మకు అర్పించినట్లే తలచి భిక్షపెట్టిన వారికి పరమపదము లభించును. సాక్షాత్తు ఆ పరమేశ్వరునికే భిక్ష పెట్టిన వారికి ఇంకెంత ఉత్తమ పదము లభించునో కదా!

అట్లే శ్రీగురుమూర్తికి ప్రియమైన సప్తశిష్యులు ఒకసారి దీపావళి సందర్భముగా వారి గృహములకు గురుమూర్తిని ఆహ్వానించుటకై వారి ఆతిథ్యములను స్వీకరించుటకై గంధర్వనగరమున గల గురుమూర్తి కడకు ఆ ఏడుగురు శిష్యులు ఒకే ఉద్దేశ్యముతో వచ్చిరి. కాని ఆ పరమాత్మ అయిన శ్రీగురుమూర్తి వారిలో ఎవరిని కరుణించెదరో అని సంశయించిరి. శ్రీగురుమూర్తి వారి మనసులో గల సంశయాలను గ్రహించి ఒక్కొక్కరిని దగ్గరకు పిలిచి వాని ఇంటికి వచ్చెదనని చెవిలో రహస్యముగా చెప్పెను. అలా ఏడుగురికి ఒకే సమాధానము వచ్చెదనని చెప్పెను. గురుమూర్తి యొక్క రహస్యమును ఆ ఏడుగురు ఒకరికొకరు చెప్పుకొనక మరియు తెలియక నాయింటికే స్వామి వచ్చెదరని మిగిలిన వాళ్ళింటికి కాదని అట్లు ఆ ఏడుగురు తలచిరి. గురుమూర్తి యధావిధిగా మఠమునకు తిరిగిపోయెను. ధన త్రయోదశి రానే వచ్చింది. గురుమూర్తి మఠము నందే ఉండి అష్టరూపుడై మిగిలిన ఏడు గ్రామములకు తమ ఏడుగురి శిష్యుల ఇంటికి వెళ్ళెను. శిష్యుల కోర్కెను తీర్చెను.

నను సేవింపుచు నున్న వారలకు నేనారూపముం జూప జూ

చిన చాలించి మదించి వారు మధినన్ సేవింపరో యంచు, ని

ర్ధనికుండాత్మ ధనంబు చెడ్డ నెపుడున్ దత్పారవశ్యంబు దా

ల్చిన భంగిన్ నను బాసి మత్ప్రియుండు దా జింతించు నా రూపమున్

(శ్రీమద్భాగవతము)

అర్థం : కృష్ణపరమాత్ముడు గోపికలతో అన్నమాటలు. నన్ను సేవించే వారికి నా రూపము ప్రదర్శింపను. నా రూపము చూడగలిగినచో కన్నులతో చూచి మనసులో మరచును. నా రూపము చూసిరనే అహంకారము, మనసులో నుండును. కావున నాకు ప్రియమైన భక్తుడు నా యీ రూపము కనిపించికున్నను అతనింకా నా

ధ్యానము చేయును.

శ్రీగురుమూర్తి సాక్షాత్తు విష్ణు అవతారమని ఎన్నోచోట్ల ఋజువైనది. భాగవత పద్యములు వాటిలోని సారాంశమును అర్థములను సేకరించి చూచినను గురుమూర్తి లీలలతో సరిపోయినవి. కావుననే పెక్కుచోట భాగవత పద్యములు వాటి అర్థములు చెప్పబడినవి. విష్ణువు అవతారమైన శ్రీకృష్ణ పరమాత్ముడు రాసక్రీడ సమయమున ఎందరో సుందరీమణులతో తన రాసక్రీడ ప్రదర్శించెను. ఆ సమయమున కృష్ణుడు ఒక్కడు. మరియు గోపికలెందరో కలరు. కృష్ణపరమాత్మడు తన మాయా ప్రభావముతో ఎంతమంది గోపికలున్నారో అంత మంది కృష్ణరూపములను ఆ పరమాత్మ ధరించి ఒకే సమయములో ఒక్కొక్క గోపిక ప్రక్క కృష్ణుడు తన రాసలీల ప్రదర్శించెను.

శ్రీగురుమూర్తి కూడా తన భక్తులు వారి ఇంటికి పిలిచినప్పుడు గురుమూర్తి యాధావిధముగా గంధర్వనగరమున గల మఠమునందు ఉండి సప్తరూపములను దాల్చి తన ఏడుగురిశిష్యుల ఇంటికి ఒకే సమయములో వెళ్ళెను. అనగా గురుమూర్తి అష్టరూపములు దాల్చెనని తెలిసినది. నిజానికి శ్రీగురుమూర్తిని శ్రద్ధాభక్తితో సేవించుచున్న భక్తుడికి తన రూపమును ప్రదర్శింపడు. కారణం అట్టి భక్తుడు గురుమూర్తిని ఒక ప్రియమైన వస్తువుగా చూచుకొనును. అట్టివానికి గురుమూర్తి రూపం కన్పించకపోయినను అతనికి బాధ ఉండక ఇంకా గురుమూర్తిపై ధ్యానము తప్ప మరియొకటి ఉండదు. ఎవరైతే గురుమూర్తి రూపము చూడవలెనని తలచునో అట్టివారు గురుమూర్తిని తమ కనులతో చూచి మనస్సులో మరచిపోయెదరు. ఒక్క రూపమును చూచితిమనే గర్వం వారి మనస్సులో నిండిపోవును. కాని శ్రీగురుమూర్తి ఉండదు. ఈ సత్యమును తెలుసుకున్న భక్తుడు ధన్యుడు.

పై సంఘటన జరిగిన కొద్దిరోజుల పిదప ఆ ఏడుగురు శిష్యులు గురుమూర్తి మఠము నందుండి తమ ఏడుగురి ఇంటికి ఒకేసారి విచ్చేసననే సత్యాన్ని తెలుసుకుని ఆశ్యర్యపడిరి.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 31

**(నా పరిహాసము నిజమని ఎట్లు అనుకొంటివి. అన్న గురుమూర్తి ప్రశ్నకు**

**మీ వాక్యములే మాకు శరణం అన్న ఒక భక్తుడు)**

అవధూతలు తమ భక్తులను రక్షించుటకు కొన్ని చిత్రమైన లీలలను చూపెదరు. అవి చూచుటకు వింతగా ఉన్నను మరియు అవధూతలు పలికిన వాక్యములు వినేవారికి పరిహాసముగా ఉన్నను అందులో అంతరార్థము కనుగొనుట చాలా కష్టము. అటువంటి విచిత్రమైన ఒక లీల శ్రీగురుమూర్తి ప్రదర్శించెను. ప్రతిదినము గురుమూర్తి సంగమమునకు అనుష్టానమునకై పోయెదరనే విషయము అందరికి తెలిసినదే. సంగమ దారిలో ఒక శూద్రుడు కలడు. అతని జీవనాధారము వ్యవసాయము. శ్రీగురుమూర్తి అను నిత్యము ఆ దారిలో వచ్చుచున్నప్పుడు ఆ రైతు భక్తిశ్రద్ధలతో గురుమూర్తికి నమస్కరించుచుండెడివాడు. అలా కొన్ని రోజులు గడిచిన పిదప ఒకనాడు గురుమూర్తి తన నమస్కారమునకుగల కారణము ఏమిటని రైతును ప్రశ్నించెను. అంత ఆ రైతు తన పొలములో పంట బాగా పండవలెనని కోరెను. శ్రీగురుమూర్తి చిరునవ్వు నవ్వి తాను అనుష్టానము ముగించుకొని వచ్చులోపల ఉన్న పంటనంతయు కోసివేయమని ఆజ్ఞాపించి సంగమమునకు గురుమూర్తి వెడలిపోయెను. రైతు గురుమూర్తి వాక్యములే వేదవాక్యములుగా భావించి గురువాజ్ఞను శిరసావహించెను. ఆ రైతు భార్యాబిడ్డలు పంట కోయనీయక అడ్డు పడెను. కాని ప్రయోజనము లేకపోయెను. శ్రీగురుమూర్తి సంగమము నుండి తిరిగివచ్చు దారిలో ఆ రైతు వద్దకు వచ్చి జరిగినదంతయు చూచి, తన పరిహాసవాక్యములను నిజమని ఎట్లు నమ్మితివని రైతును ప్రశ్నించెను. అంత ఆ రైతు భక్తి శ్రద్ధలతో గురువాక్యములే శరణమని అవి కోరికలను తీర్చునని బదులు చెప్పెను. అతని గురుభక్తికి మెచ్చి శ్రీగురుమూర్తి చిరునవ్వుతో ఆశీర్వదించెను. ఈ సంఘటన జరిగిన కొన్ని రోజుల పిదప గాలివాన వలన పంటలన్నియు నశించెను. కాని ఆ రైతు కోసిన పంటయందు క్రొత్త మొలకలు మొలచి సశ్యశ్యామలమైన ధాన్యము పండెను. ఆ గ్రామములోని జనులు మరియు విశ్వాసముతో నమ్ముకున్న ఆ రైతు కుటుంబీకులు గురుమూర్తి లీలలకు ముగ్ధులై ఆశ్చర్యము చెందినారు. ఆనాటినుండి వారి ఇంట గురుమూర్తి కరుణవల్ల సిరిసంపదలతో వర్థిల్లిన్నారు.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 32

**(శ్రీగురుమూర్తి తమ పూర్వాశ్రమమందలి చెల్లెలును కలియుట - తన చెల్లెలి పాపమును చెప్పి దాని పరిహారమునకు దారిచూపుట)**

గురుమూర్తి (నృశింహసరస్వతి) సాక్షాత్తు త్రిమూర్తిరూపుడైన దత్త భగవానుని రెండవ అవతారము దత్తభగవానుడు మొట్టమొదట శ్రీపాదశ్రీవల్లభ అవతారమును దాల్చినారని అందుకు గల కారణము కూడా మనము తెలుసుకుంటిమి. అలాగే శ్రీ పాద శ్రీవల్లభుడు గురుమూర్తిగా (నృశింహసరస్వతిగా) అవతారము దాల్చుటకు గల కారణము కూడా తెలుసుకున్నాము. శ్రీగురుమూర్తి కరంజా నగరమునకు చేరినప్పుడు తమ పితరులకు పూర్వస్మరణ కలిగించుటకై శ్రీపాదశ్రీవల్లభరూపమును చూపినారని మరియు రత్నాదేవి అనే ఆమె తన పూర్వజన్మ నందు ఒక ఆవును కొట్టెనని మరియు దంపతుల మధ్య కలహము తెచ్చుటచే తనకు ఈ జన్మయందే కుష్టురోగము సంభవించునని మరియు రత్నాదేవి భర్త యతియై ఆమెను వదిలిపెట్టునని శ్రీగురుమూర్తి ఆమెకు చెప్పినట్లు 11వ అధ్యాయములో చెప్పుకొంటిమి. అంత ఆ రత్నాదేవి తన పాపపరిహారము ఏమని గురుమూర్తిని ప్రశ్నింపగా గురుమూర్తి ఆ రత్నాదేవికి కుష్టురోగము వచ్చిన పిదప తన దర్శనము లభించునని ఆశీర్వదించెను. అంత వరకు తన పాపమము అనుభవించవలెనని గురుమూర్తి రత్నాదేవితో చెప్పెనని కూడా 11వ అధ్యాయములో తెలుసుకుంటిమి.

శ్రీగురుమూర్తి సంగమము నందున్న రోజులలో ఆ రత్నాదేవి అచ్చటకు వచ్చెను. అంత గురుమూర్తి ఆమెను పిలిచి జరిగిన విషయమంతయు ఆమెకు జ్ఞపికి చేసెను. అంత ఆ రత్న గురుమూర్తి పాదములపై పడి శరణువేడెను. గురుమూర్తి ఇదివరకు తాను చేసిన (రత్నాదేవి) రెండు పాపములను చెప్పుటయే కాక ఆమె ఐదు పిల్లులను చంపెనని ఆ పాపము వలన రత్నకు శరీరమంతయు కుష్టు వ్యాపించెనని చెప్పెను. తాను చేసిన పాపములు ఈ జన్మలో అనుభవించెదవా? లేదా వచ్చే జన్మ యందు అనుభవంచుదువా అని గురుమూర్తి రత్నాదేవిని ప్రశ్నించెను.

చెలియే మృత్యువు?చుట్టమే యముడు? సంసేవార్థులే కింకరుల్?
శిలలంజేసెనె బ్రహ్మ దన్ను? ధృడమే జీవంబు? నో చెల్లరే
చలితం బౌట యెఋంగ; రీ కపట సంసారంబు నిక్కంబుగా
దలచున్ మూఢుడు సత్యదాన కరుణా దర్మాది నిర్ముక్తుడై.
(శ్రీమద్భాగవతము)

అర్థం : ప్రతి జీవి శాశ్వతమని భావించును. కాని మృత్యువు ఆ జీవికి స్నేహితుడా? అతనిని మృత్యువు నుండి

తప్పించుటకు కావున ఈ మాయా సంసారము సత్యమని నమ్మిన జీవుడు సత్యము, దానము, కరుణ మరియు ధర్మాదులు వదిలి సంచరించుచున్నాడు.

శ్రీగురుమూర్తి పూర్వాశ్రమమందలి చెల్లెలు రత్నను పిలిచి తన పూర్వ పాపములను తెలిపి తత్కారణముగా ఆమె శరీరమంతయు కుష్టురోగము వ్యాప్తమైనట్లు చెప్పెను. పై శ్లోకము పరీక్షించిన ప్రతి జీవికి మృత్యువు రాక తప్పదని ఆ మృత్యువు దయతలచి విడిచిపెట్టదని యమధర్మరాజు అటువంటి జీవికి బంధువు కాదని మరియు అటువంటి జీవి మాయారూపమైన సంసారములో చిక్కుబడియున్నాడని తెలియుచున్నది. అలాగే జీవి చేసే పూర్వపాపకర్మలు కూడా ఆ జీవిని పట్టుకొనునని ఆ పాపకర్మలు అటువంటి పాపాత్మునికై స్నేహితుడు కాదని వాడిని దయతలచి విడిచిపెట్టదని గురుమూర్తి గుర్తుచేసెను. పైగా రత్నాదేవి పూరాశ్రమ మందలి చెల్లెలు అయినప్పటికి ఆమె చేసిన పాపములను వాటి ఫలితముగా ఆమెకు కుష్టువ్యాధి సోకెను. శ్రీగురుమూర్తి పైన చెప్పినట్లుగా ఆమె బాధను రాబోవు జన్మలో అనుభవించదలచినదా లేక ఈ జన్మ యందే అనుభవించదలచినదాఅని ప్రశ్నింపగా రత్నాదేవి తాను ఈ జన్మయందే అనుభవించుటకు సిద్ధముగా ఉండెనని చెప్పెను. దయామయుడైన శ్రీగురుమూర్తి రత్నాదేవిని కరుణింపదలచి ఆమెను పాపనాశతీర్థమందు స్నానము చేసి రమ్మనెను. రత్నాదేవి గురువాజ్ఞను పాటించిన వెంటనే కుష్టురోగము మాయమయ్యెను. సప్తజన్మల పాపము నశింపచేయునది ఆ పాపవినాశమనెడి తీర్థము. అట్టి పవిత్రమైన తీర్థము రత్నాదేవి అందు స్నానము చేసిన పిదప తన పాపము నశించెనని ఋజువు చేసినది. గంధర్వనగరమున సంగమమున కల అష్టతీర్థము లన్నియు అట్టి మహత్యములు కలిగినవే. అనునిత్యము శ్రీగురుమూర్తి నామము మనస్సులో భక్తితో స్మరించుకొని ప్రతి జీవి తాను గంధర్వనగరమున లేకపోయినప్పటికి మరి ఏ ఇతర ప్రదేశములో ఉన్నప్పటికి ఆ జీవి స్నానము చేయునప్పుడు శ్రద్ధాభక్తితో శ్రీగురుమూర్తిని స్మరించి మామూలు జలమును చెంబుతో తీసుకుని ఆ జీవి అష్టతీర్థములను ఒక్కసారి స్మరించుకుని తన ఒంటిపై పోసుకొనిన శ్రీగురుమూర్తిని చూచినంత ఫలము మరియు అష్టతీర్థములలో మునిగినంత పుణ్యము మరియు తద్వారా తన సర్వపాపములను నశింపచేసుకొనవచ్చును.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 33

### (శ్రీ పాద శ్రీ వల్లభ అవతారమున కురుపురమున ఉన్న రజకుడు శ్రీ గురుమూర్తి అవతారమున వైడూర్యపురమందలి మ్లేచ్ఛరాజుగా జన్మించుట)

7వ అధ్యాయమున శ్రీదత్తుని ప్రథమ అవతారమగు శ్రీ పాద శ్రీ వల్లభుడు కురుపురములో ఉన్నప్పుడు ఒక రజకుడు స్వామిని దర్శించెనని ఆ రజకుడు ఒకసారి నదీ తీరమున ఒక యువరాజు తన స్త్రీలతో జలక్రీడలాడుతూనున్న దృశ్యమును చూచి ఆ రాజు యొక్క వైభవమును తన పరిస్థితితో పోల్చుకుని బాధపడి తన మనస్సులో నున్న కోరికను తాను కూడా అట్టి భోగభాగ్యములను కనీసం ఏ జన్మలోనైనా లభించవలెనని అట్టి కోరికను శ్రీపాదశ్రీవల్లభునికి రజకుడు చెప్పగా శ్రీ పాద శ్రీవల్లభుడు రాబోవు జన్మయందు ఆ రజకుడు వైఢూర్యనగరమందలి మ్లేచ్ఛరాజుగా జన్మించునని అప్పుడు శ్రీ పాద శ్రీవల్లభుడు శ్రీగురుమూర్తి అవతారములో వచ్చి దర్శనము ఇచ్చునని వాగ్దానము చేసెను. స్వామి వాగ్దానము చేయుటకు గల కారణము ఆ రజకుడు శ్రీపాదునితో తనకు స్వామి దర్శన వియోగము వలదని ఎల్లప్పుడు స్వామిని దర్శింపవలెనని కోరగా శ్రీ పాదుడు మరుజన్మలో కూడా తనకు శ్రీగురుమూర్తి అవతారమున దర్శనము ఇచ్చుటయే గాక, తన వాంఛ అయిన భోగభాగ్యములు అనుభవించుటకై ఆ రజకుని మ్లేచ్ఛరాజుగా జన్మించెదడని రాబోవు సంఘటనను ముందుగనే శ్రీపాదశ్రీవల్లభుడు సూచించెను. అవధూతలు మాటలు పొల్లుపోవు. చెప్పినది చెప్పినట్లుగానే జరుగును. అట్లే శ్రీపాదశ్రీవల్లభుని అవతారమున కురుపురముననున్న రజకుడు మరుసటి జన్మలో అనగా శ్రీగురుమూర్తి అవతారమున వైఢూర్యనగరము నందలి మ్లేచ్ఛరాజుగా జన్మించెను. తన పూర్వ జన్మ సంస్కారముచే దానధర్మములు బ్రాహ్మణులపై భక్తి ఆ మ్లేచ్ఛరాజుకు కల్గెను. నిజానికి మ్లేచ్ఛులకు ద్విజులను నిందించుట అలవాటు. కాని ఈ మ్లేచ్ఛరాజు మటుకు వ్యతిరేకముగా ప్రవర్తించెను. ఒకసారి ఆ మ్లేచ్ఛరాజుకు తొడపై కురుపు లేచెను. ఎన్ని ఔషధములు వాడినను గుణము కనిపించలేదు. అంత రాజ్యములో హితులు ఆ బాధకు నివారణ పాపవినాశతీర్థమని కావున అక్కడకు వెళ్ళి తన పాపమును తొలగించుకొనివలసినదిగా ఆ మ్లేచ్ఛరాజుకు రాజహితులు బోధించిరి. మ్లేచ్ఛరాజుకి గంధర్వనగరమున గల శ్రీగురుమూర్తి దర్శనమును చేసుకొనవలసినదిగా కూడా సూచించెను. అంత ఆ రాజు వెంటనే గంధర్వనగరము చేరెను. శ్రీగురుమూర్తిని దర్శించి నమస్కరించగా శ్రీగురుమూర్తి వెంటనే "రజకా ఎక్కడ ఉంటివి?" అని ప్రశ్నించగా, ఆ మ్లేచ్ఛరాజు శ్రీగురుమూర్తి వాక్యములను గ్రహింపలేకుండెను. తరువాత తన పూర్వ జన్మను గుర్తుకు తెచ్చుకుని, శ్రీగురుమూర్తి పాదములపై పడి ప్రణమిల్లెను. తన తొడపై గల కురుపు సంగతిని గురుమూర్తికి చెప్పగా శ్రీగురుమూర్తి రాజును చూచినంతనే కురుపు మాయమయ్యెను. శ్రీదత్తుడు తన భక్తుడైన రజకుడికి శ్రీపాదశ్రీవల్లభ అవతారమున ఇచ్చిన మాటను

నిలబెట్టుటకై మరియు ఆ రజకుడి మనస్సులోని వాంఛను నెరవేర్చుటకై తదుపరి జన్మయందు శ్రీదత్తుడు శ్రీ గురుమూర్తిగా తన అవతారమును దాల్చి తన భక్తుడికిచ్చిన మాటను నిలబెట్టి మరియు భక్తుని మనస్సులో గల వాంఛను కూడా తీర్చెను. శ్రీ దత్తుడు ఎంత ప్రేమమూర్తియో కదా! తన అపారమైన ప్రేమ సముద్రము ప్రవహిస్తూనే తన కరుణాకెరటాలు పొంగుతూ ఎందరో భక్తులను తరింపచేయుటకు అవతారములు దాల్చుచూనే ఉన్నారు.

శ్రీ గురుమూర్తిరాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 34

### (కలియుగమున శ్రీ గురుమూర్తి ఇక ఉండరాదని నిర్ణయించుకొని అదృశ్యమయ్యేదనని శ్రీగురుమూర్తి నిర్ణయించుకొనుట)

శ్రీగురుమూర్తి చూపిన మహిమను మ్లేచ్ఛరాజు ఎంతో సంతసించి తన రాజ్యమును మరియు తనకు గల భోగభాగ్యములను చూచుటకై శ్రీగురుమూర్తిని తన వైఢూర్యనగరమునకు మ్లేచ్ఛరాజు గురుమూర్తిని రమ్మని ఆహ్వానించెను. శ్రీగురుమూర్తి తన రాకవలన పురమునందలి భేదములు వచ్చునని గ్రహించి, గౌతమీతీర్థమునకు పోయి కలియుగమునందు ఇక అదృశ్యమగుటకు నిర్ణయించుకొనెను. కాని ఆ రాజు తన పట్టును వదలక శ్రీగురుమూర్తిని అనుసరించెను. అంత శ్రీ గురుమూర్తి అది తగదని మ్లేచ్ఛరాజుతో తాను ఉండకూడదని తానొక సన్యాసియని శ్రీగురుమూర్తి రాజుతో చెప్పి తానిక ఉపాసన చేయవలెనని తన పునఃదర్శనము పాపవినాశనమనెడి తీర్థమందు లభించునని శ్రీగురుమూర్తి మ్లేచ్ఛరాజును ఆశీర్వదించెను. శ్రీగురుమూర్తి పాపనాశతీర్థమునకు పోయి తన శిష్యులకు తన అవతారమును చాలిస్తున్నట్లుగా సూచించెను. మ్లేచ్ఛరాజుకిచ్చిన మాటను నిలబెట్టుటకై శ్రీగురుమూర్తి తన భక్తుడైన మ్లేచ్ఛరాజును పాపవినాశతీర్థమునకు రప్పించెను. మ్లేచ్ఛరాజు తిరిగి శ్రీగురుమూర్తిని తన పురమునకు రమ్మని కోరగా గురుమూర్తి అంగీకరించెను. వైఢూర్యపురములో మ్లేచ్ఛులందరూ శ్రీగురుమూర్తిని పూజించుచున్న ఆ మ్లేచ్ఛరాజును చూచి అది అధర్మమని రాజు ఒక విప్రునికి సేవకుడయ్యెనని భావించెను. మరికొందరు రాజు చర్యలకు ముగ్ధులైరి. మ్లేచ్ఛరాజు శ్రీగురుమూర్తితో తనకు గురుమూర్తి పాదసేవ చేయవలెనని కోరగా అంత శ్రీగురుమూర్తి మ్లేచ్ఛరాజుతో తన రాజ్య భారమును అతని పుత్రునికప్పగించి, శ్రీశైలమునకు వచ్చినచో శ్రీపర్వతమున తనకు శ్రీగురుమూర్తి పునఃదర్శనము లభించగలదని చెప్పి శ్రీగురుమూర్తి పయనమయ్యెను.

శ్రీ గురుమూర్తిరాజం శరణం ప్రపద్యే

## అధ్యాయము - 35

### (శ్రీ గురుమూర్తి గంధర్వనగరమును వదిలి శ్రీశైలమునకు పయనమగుట)

దత్త స్వరూపుడైన శ్రీ గురుమూర్తి (నృశింహ సరస్వతి) తన అవతారమును ముగించ దలచెను. శ్రీ గురుమూర్తి జగద్గురువు. వారి అవతారమునకు ముగింపు నిజానికి ఉండదు. వారు అవధులు లేనటువంటి జగద్గురువులు. కావుననే వారిని అవధూత అని కూడా అంటారు. భౌతికముగా వారి రూపము ఉండకపోయినప్పటికి వారు శాశ్వతులు. వారి మహిమలకు ముగింపు ఉండదు. ఐతే కారణ జన్ములు కావున ఏ కారణమునకై వారు భువిపై వచ్చి లోక కళ్యాణముచేసి సత్పురుషులను రక్షించిన పిదపవారు తమ అవతారమునకు స్వస్తి చెప్పెదరు. అట్లు చేయుటకై ఏదో ఒక నెపము సృష్టించి తద్వారా వారి అవతారమును ముగించెదరు. అనగా వారి మాయా ప్రభావముచే అంతా మాయలో పడి ఆ మాయామత్తులో అన్నీ మరిచి ఏమీ తెలియని పరిస్థితిలో ఉన్న సమయాన్ని అదును చూచుకొని అట్టి అవధూతలు వారి అవతారమును చాలించెదరు. వారు మెరుపులా వచ్చి మెరిసి వెళ్ళిపోయిన పిదప మాయామత్తు నుండి సామాన్య జనులమైన మనము బైటపడి జరిగిన విషయమును తలచి అసలు ఆ విధముగా ఎలా అయినది అని మనము మనల్నే ప్రశ్నించుకునే పరిస్థితి వస్తుంది.

మహావిష్ణువు అవతారమైన శ్రీ కృష్ణ పరమాత్ముడు దుర్మార్గులను హతమార్చి సన్మార్గులను కాపాడి ఎన్నో మహిమలు చూపిన పిదప తన అవతారమును చాలించుటకై ఒక నెపము చూపుటకై మాయ కల్పించెను. కృష్ణుడంటే అప్పటివరకు ఎంతో ఇష్టపడే యాదవులు కృష్ణుడు ద్వారక నుండి వెళ్ళిపోగా ఆ యాదవులు తమలో తాము మద్యపానము స్వీకరించి మత్తిల్లి సరదాగా మొదలుపెట్టిన పొట్లాట చివరికది నిజంగా మారి భయంకరమైన యుద్ధము వారిలో వారికి జరిగినది. అప్పటివరకు ఎంతో ప్రేమతో అందరికి అండగా ఉంటూ యాదవులను రక్షించే ఆ భగవాన్ శ్రీ కృష్ణుడు యాదవుల పరిస్థితిని మరియు జరిగిన యుద్ధమును చూచి నవ్వుకొనెను. రాబోవు కాలము ఎంత భయంకరముగా ఉండునో అనే దానికి ఆ యాదవుల మధ్య జరిగిన యుద్ధము ఒక ఉదాహరణ. అందుకే కాబోలు బలరామకృష్ణులలో బలరాముడు యోగ మార్గముతో అనంతునిలో కలిసిపోయినాడు. మరియు శ్రీ కృష్ణభగవానుడు ఎన్నో లీలలు చూపి మహిమలు చేసి కాళీయునిపై నాట్యముచేసి గోవర్ధనగిరిని తన చిటికెన వ్రేలుపై మోపి తన నోటిలో పదునాల్గు భువనభాండములు చూపిన అట్టి మహిమాన్వితుడైన శ్రీకృష్ణుడు ఒక బోయవాడిచేత బాణము దెబ్బ తగిలించుకుని నూరుకోట్ల సూర్యభగవానుని దివ్యతేజస్సుతో తన నిజస్థానానికి వెళ్ళిపోయినాడు.

విష్ణువు అవతారమైన శ్రీ దత్త భగవానుని రెండవ అవతారము అగు శ్రీ గురుమూర్తి కూడా గంధర్వ నగరమునకు మ్లేచ్ఛరాజు వచ్చునని తద్వారా ద్విజులకు బాధ కలుగునని ముందుగనే శ్రీ గురుమూర్తి తన దివ్య దృష్టితో ఊహించెను. నిజానికి మ్లేచ్ఛరాజు తన పూర్వజన్మలో ఒక రజకుడు. ఆ రజకుడు కూడా శ్రీ దత్తుని మొదటి అవతారమైన శ్రీ పాదవల్లభుని భక్తుడు. అటువంటి సంస్కారముగల మ్లేచ్ఛరాజు నిజానికి మంచివాడే.

కాని అప్పటి కాలమున మ్లేచ్ఛులకు మరియు ద్విజులకు భేదాభిప్రాయములు కలిగి ఉండెడివారు. కాని శ్రీ గురుమూర్తి తన పూర్వావతారమున శ్రీ పాదవల్లభ భక్తుడైన రజకుడి వాంఛను తీర్చుటకై మరియొక అవతారము దాల్చి శ్రీ గురుమూర్తి రూపమున అవతరించి రజకుడిని మ్లేచ్ఛరాజుగా రప్పించి తన భక్తుడికి పునఃదర్శనము ఇచ్చెదననే మాటను నిలబెట్టుటకే శ్రీదత్తుడు గురుమూర్తి రూపమున మ్లేచ్ఛరాజుకు దర్శనము ఇచ్చెను. గురుమూర్తి తన మాటను నిలబెట్టెను. కాని మ్లేచ్ఛరాజుకు దర్శనము ఇచ్చుటచేత మిగిలిన తక్కువ జాతివారు కూడా మున్ముందు తన దర్శనమునకు వచ్చెదరని అట్లువచ్చినచో ద్విజులకు ఇబ్బంది కల్గుననే ఉద్దేశ్యముతో ఇక కలియుగమున శ్రీ గురుమూర్తి ఉండకూడదని నిశ్చయించుకుని గంధర్వనగరమును విడిచి శ్రీశైలమునకు పోదలచెను శ్రీ గురుమూర్తి.

శ్రీ గురుమూర్తి రాజం శరణం ప్రపద్యే.

## అధ్యాయము 36

### (శ్రీగురుమూర్తి తన నిజస్థానమునకు పోవుట)

పూర్వాధ్యాయమున శ్రీ గురుమూర్తి తన అవతారమును ముగించుటకు నిశ్చయించెనని గంధర్వ నగరమును విడిచి శ్రీశైలమునకు వెళ్ళదలిచెనని తెలుసుకుంటిమి. శ్రీశైలయాత్ర నెపముతో శ్రీ గురుమూర్తి అదృశ్యుడగుటకు నిశ్చయించుకొనెను. శ్రీ గురుమూర్తి నిశ్చయమును తెలుసుకున్న గంధర్వ నగర ప్రజలందరు ఎంతో దుఃఖించిరి. అప్పటివరకు శ్రీ గురుమూర్తి ఒక్కరే యావత్ గంధర్వ నగర ప్రజలందరికి అండగా ఉంటూ రక్షిస్తూ ఉన్న శ్రీ గురుమూర్తి గంధర్వ నగర వాసులందరిని వదిలి వెళ్ళినచో వారికి ఇక రక్ష ఎవరని తలచిన శ్రీ గురుమూర్తి స్వయముగా గంధర్వవాసులకు ధైర్యమునిచ్చే బోధనలు చెప్పినారు. అట్టి గురుమూర్తి అమూల్యమైన బోధనలు తనను నమ్ముకున్న భక్తులకు తానెప్పుడు ఉండునని వారిని ఎప్పటికి రక్షిస్తూనే ఉంటానని తన గుప్త స్వరూపము సదా గాణ్గాపురమునందు ఉండుననే రహస్యమును శ్రీ గురుమూర్తి చెప్పిన అమూల్య వాక్యములను క్లుప్తముగా మూడవ అధ్యాయములో చెప్పబడినది. చదువరులు ఇక్కడ ఒక్కసారి 3వ అధ్యాయమును జ్ఞప్తికి చేసుకొనవలెను.

భగవంతుడు సాకారనిరాకార రూపుడని తెలిసినది. నిజానికి పరమాత్మ నిరాకారుడే. కావుననే శ్రీ గురుమూర్తి గంధర్వ నగరము (గాణ్గాపురము) వదిలి వెళ్ళిపోయినను తన అవతారము చాలించినను నిరాకారరూపుడైన ఆ పరమాత్మ గురుమూర్తి సదా గుప్త స్వరూపమున నిరంతరము ఉండును. భాగవతములో ఒక్కసారి ఉద్దవ శ్రీకృష్ణ పరమాత్ముల సంభాషణలోని ఒక ముఖ్య ఘటన ఇక్కడ చెప్పవలసియున్నది. ఉద్దవుడు శ్రీ కృష్ణ పరమాత్మను ఇట్లు ప్రశ్నించెను. "రూపములేని నిరాకారమైనటువంటి నీకు ఒక రూపాన్ని కల్పించి భక్తితో నిన్ను కొలిచేవారి కోరికలన్ని నీవు ఎలా తీరుస్తున్నావు స్వామీ?" అంత శ్రీ కృష్ణ పరమాత్ముడు ఒక చక్కని రహస్యమును చెప్పెను. "ఈ లోకములో మానవులకు ధ్యానము నిలుచుట అతికష్టము". కావున వివిధ దేవతాప్రతిమలలో అందమైన రూపములలో నేను ఉంటాను. ఆ ప్రతిమలకు అందమైన వస్త్రాలు, ఆభరణములు, పూలదండలు మొదలైన వాటితో పాటు అన్న పానీయాలతో అర్పించి మానసిక పూజాపద్ధతులతో సంతుష్టపరచి నన్ను ఆకట్టుకొనెదరు. శ్రీ కృష్ణపరమాత్ముడు ఉద్దవునితో చెప్పిన అంతరార్థ రహస్యమును తెలుసుకున్నచో పరమాత్మ నిరాకారుడేననే సత్యమును తెలుసుకొనవచ్చును. కావుననే శ్రీ గురుమూర్తి తన అవతారము చాలించి అదృశ్యమవుటకు నిశ్చయించుకొనెను. అట్టి పరమాత్మ స్వరూపము భౌతికముగా మన కళ్ళ ఎదుట లేకపోయినను నిరాకారముగా నిరంతరముగా ఉన్నారు. కావుననే శ్రీ గురుమూర్తి గంధర్వనగరము వదిలి శ్రీశైలము పోవునపుడు తన భక్తులతో పరమార్థ రహస్యమును దివ్యమైన ప్రబోధములు చేసి తాము నిరంతరము గుప్త స్వరూపమున గాణ్గాపురమునందు ఉండెదనని వాగ్దానము చేసినారు.

శ్రీ గురుమూర్తి శ్రీ పర్వతమునకు వెళ్ళి పాతాళ గంగలో స్నానమొనరించి తన అవతార కార్యము ముగిసినదని పుష్పాసనము ఏర్పాటు చేయమని శిష్యులకు ఆదేశించినారు. గురుమూర్తి శిష్యులు గుర్వాజ్ఞను శిరసావహించి దివ్యమైన పీఠము గంగానదిపై ఉంచినారు. శ్రీ గురుమూర్తి తన శిష్యులతో "గంధర్వ నగరము వెళ్లి చూడుడు. నా నిజభక్తులకు మాత్రమే అక్కడ నేను దర్శనమిచ్చెదనని" పలికినారు. అంత ఆ దివ్యపీఠముపై పరమాత్మ అగు శ్రీ గురుమూర్తి ఆసీనులై నదీ ప్రవాహము మధ్యన వెళ్ళి తన నిజస్థానమునకు పోవుచున్నాని

శిష్యులకు చెప్పి వారికి నాలుగు ప్రసాద పుష్పములను అచ్చటి నుండి పంపెదనని వాటిని భక్తితో నలుగురు శిష్యులను తీసుకొనమని బోధించి గుప్తరూపుడై అంతర్ధానమయ్యెను. కొంతసేపటికి నావను నడిపేవాడు నది ఒడ్డుకు వచ్చి గురుమూర్తి శిష్యులతో పరమాత్మ అయిన శ్రీ గురుమూర్తి నదీ మధ్యమున సాక్షాత్కరించెనని దేవతా బృందముతో ఉన్నారని చెప్పిరి. మరియు ఆ నావికుడు కదళీవనాంతరమునకు గురుమూర్తి పోవుచున్నారని ఈ వార్తను తన శిష్యులకు చెప్పమని ఆ నావికులకు గురుమూర్తి ఆదేశించినారనే విషయం నావికులు చెప్పిరి. గురుమూర్తి శిష్యులు చూచుచుండగనే గురుమూర్తి పంపిన నాలుగు ప్రసాద పుష్పములు అక్కడికి రానేవచ్చెను. గురుమూర్తి శిష్యులలో ముఖ్యమైన నలుగురు శిష్యులు ఆ ప్రసాద పుష్పములు స్వీకరించినారు.

శ్రీ దత్తుని అవతారమగు శ్రీ గురుమూర్తి (నృశింపసరస్వతి) అవతారము ముగిసినది. నిజానికి అవదూతల చరితములకు ముగింపు ఉండదు. బ్రహ్మ విష్ణు మరియు మహేశ్వర కలయిక అగు ఆ త్రిమూర్తి మొదట శ్రీ దత్తునిగా అత్రి మహర్షి మరియు అనసూయల కోరికపై అవతారము దాల్చెను. పిదప శ్రీ దత్తుడు తన భక్తురాలైన సుమతి కోరికపై శ్రీపాద వల్లభ అవతారము దాల్చెను. తరువాత శ్రీపాదుడు తన భక్తురాలైన అంబిక కోరికపై శ్రీ గురుమూర్తి(నృసింహసరస్వతి) అవతారము దాల్చెను. పిదప తన రెండవ అవతారము ముగించి శ్రీ గురుదత్తుడు మాణిక్యనగర్‌లో శ్రీ మాణిక్య ప్రభువుగను, అక్కల్‌కోటలో శ్రీ స్వామి సమర్ధగను, శిరిడీలో సచ్చిదానంద శ్రీసాయినాథుడిగను, షేగావ్‌లో శ్రీ గజానన మహరాజుగను ఇలా శ్రీదత్తుడు తన అవతారములనెన్నో దాల్చినారు. జగద్గురువు, ఆదిగురువు అవధూత అయిన శ్రీ గురుమూర్తి అవతారమునకు ఆది, అనంతములు చెప్పుట అసాధ్యము. కావున ఈ అధ్యాయము చివరిది అని శ్రీ గురుమూర్తి చరితము ఇక ముగియుచున్నదని చెప్పుట కూడా ఒక విధముగా తప్పే. శ్రీ గురుమూర్తి అవతారమునకు ముగింపు లేదు. కాబట్టి ఇక శ్రీదత్తుని చరితమునకు కూడా ముగింపు అన్నది ఉండదు. అనునిత్యము శ్రీ దత్తుని నామస్మరణతో వారి వివిధ రూపములైన శ్రీపాద, నృసింహ, మాణిక్య, స్వామి సమర్థ, శ్రీసాయి, గజానన ఇలా ఎన్నో రూపాలను ఎవరికి ఇష్టమైన రూపము ఉండునో ఆ రూపముతో ఆ దత్తుని మనస్సులో నిలుపుకొని మానసిక పూజతో దత్తుని ఆకట్టుకొని అట్టిపూజ నిరంతరము చేయగా ఏదో ఒకరోజు సర్వరూపములు ఒకటేననే సత్యము తెలిసి పరమాత్మ నిరాకారుడనే సత్యం కూడా తెలిసి అట్టి పరమాత్మను అంతట సర్వవ్యాపిగా అందరిలోను చూడగలిగే రోజు తప్పక వస్తుంది. ఆ రోజుకై వేచివుందాం. శ్రీదత్తుని అనుగ్రహము కోరుకుందాం.

సర్వేజనా సుఖినోభవంతు.

**కోటంరాజు శ్రీనివాసరావు**
**2-1-194/సి, నల్లకుంట**
**హైదరాబాద్-500 044**
**సెల్ : 9346823570**

Sripada Sri Guru Sangamam
·Seva Trust·

# శ్రీదత్తాత్రేయ అష్టోత్తర శతనామావళి

ఓం శ్రీ దత్తాయ నమః
ఓం దేవ దత్తాయ నమః
ఓం బ్రహ్మ దత్తాయ నమః
ఓం విష్ణు దత్తాయ నమః
ఓం శివ దత్తాయ నమః
ఓం అత్రిదత్తాయ నమః
ఓం ఆత్రేయాయ నమః
ఓం అత్రి వరదాయ నమః
ఓం అనసూయాయై నమః
ఓం అనసూయా సునవే నమః
ఓం అవధూతాయ నమః
ఓం ధర్మాయ నమః
ఓం ధర్మ పరాయణాయ నమః
ఓం ధర్మపతయే నమః
ఓం సిద్ధాయ నమః
ఓం సిద్ధపతయే నమః
ఓం సిద్ధిసేవితాయ నమః
ఓం గురవే నమః
ఓం గురుగమ్యాయ నమః
ఓం గురోర్గురుతరాయ నమః
ఓం గరిష్ఠాయ నమః
ఓం వరిష్ఠాయ నమః
ఓం మహిష్ఠాయ నమః
ఓం మహాత్మనే నమః
ఓం యోగాయ నమః
ఓం యోగగమ్యాయ నమః
ఓం సిద్ధిదాయ నమః
ఓం యోగాదేశకరాయ నమః
ఓం యోగ పతయే నమః
ఓం యోగీశాయ నమః
ఓం యోగాధీశాయ నమః
ఓం యోగపరాయణాయ నమః
ఓం బాలాయ నమః
ఓం బాలవీర్యాయ నమః
ఓం కుమారాయ నమః
ఓం కిశోరాయ నమః
ఓం కందర్ప మోహనాయ నమః

ఓం అర్ధాంగాలింగితాంగాయ నమః
ఓం సురాగాయ నమః
ఓం విరాగాయ నమః
ఓం వీతరాగాయ నమః
ఓం అమృతవర్షిణే నమః
ఓం ఉగ్రాయ నమః
ఓం అనుగ్రహరూపాయ నమః
ఓం స్థవీయసే నమః
ఓం శాంతాయ నమః
ఓం స్థవిరాయ నమః
ఓం అఘోరాయ నమః
ఓం మూఢాయ నమః
ఓం ఊర్ధ్వరేతసే నమః
ఓం ఏక వక్త్రాయ నమః
ఓం ద్వినేత్రాయ నమః
ఓం యోగిధ్యేయాంఘ్రిపంకజాయ నమః
ఓం దిగంబరాయ నమః
ఓం దివ్యాంబరాయ నమః
ఓం పీతాంబరాయ నమః
ఓం శ్వేతాంబరాయ నమః
ఓం చిత్రాంబరాయ నమః
ఓం శంఖినే నమః
ఓం గదినే నమః
ఓం మునయే నమః
ఓం మౌలినే నమః
ఓం విరూపాయ నమః
ఓం స్వరూపాయ నమః
ఓం పద్మమాలినే నమః
ఓం సహస్రశిరసే నమః
ఓం సహస్రాక్షాయ నమః
ఓం సహస్ర బాహవే నమః
ఓం సహస్రాయుధాయ నమః
ఓం సహస్ర పాదాయ నమః
ఓం సహస్ర పద్మార్చితాయ నమః
ఓం పద్మ హస్తాయ నమః
ఓం పద్మ పాదాయ నమః
ఓం పద్మనాభాయ నమః

ఓం పద్మ గర్భారుణాక్షాయ నమః
ఓం పద్మ కింజల్క వర్చసే నమః
ఓం జ్ఞానినే నమః
ఓం జ్ఞాన గమ్యాయ నమః
ఓం జ్ఞాన విజ్ఞామూర్తయే నమః
ఓం త్రినేత్రాయ నమః
ఓం ద్విభుజాయ నమః
ఓం షడ్భుజాయ నమః
ఓం అక్షమాలినే నమః
ఓం కమండల ధారిణే నమః
ఓం శూలినే నమః
ఓం దమరుధారిణే నమః
ఓం ధ్యానినే నమః
ఓం ధ్యాననిష్ఠాయ నమః
ఓం ధ్యాన స్థిమిత మూర్తయే నమః
ఓం ధూళీధూసరితాంగనాయ నమః
ఓం చందనవిప్తమూర్తయే నమః
ఓం భస్మోధూళిత దేహాయ నమః
ఓం దివ్య గంధాను లేపినే నమః
ఓం ప్రసన్నాయ నమః
ఓం ప్రమత్తాయ నమః
ఓం ప్రకృష్టార్థ ప్రదాయ నమః
ఓం అష్టైశ్వర్య ప్రదానాయ నమః
ఓం వరదాయ నమః
ఓం వరీయసే నమః
ఓం బ్రాహ్మణే నమః
ఓం బ్రహ్మరూపాయ నమః
ఓం విష్ణవే నమః
ఓం విశ్వరూపిణే నమః
ఓం శంకరాయ నమః
ఓం ఆత్మనే నమః
ఓం అంతరాత్మనే నమః
ఓం పరమాత్మనే నమః
ఓం ఆనంద స్వరూపాయ నమః
ఓం అనఘావ్రత ప్రియాయ నమః
ఓం వాసుదేవాయ నమః